


సోమశిలలో పెరుగుతున్న నీటినిల్వ



అనంతసాగం, (ఆంధ్రజ్యోతి) : సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి వరద ప్రవాహం వస్తుండటంతో నీటిమట్టం అంతకంతకూ పెరుగుతోంది. శుక్రవారం 13,453 క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా డ్యాంలో 33.550 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 3,600, ఉత్తర కాలువకు 320, దక్షిణ కాలువకు 100 క్యూసెక్కులు చొప్పున నీరు సరఫరా చేస్తున్నారు.

అన్నదాతకు ఆర్థిక సాయం



- నేడు తొలివిడత నగదు జమ
- 1,95,866 మంది రైతులకు రూ. 131.603 కోట్లు
- కౌలురైతులకు రెండు విడతలుగా నగదు పంపిణీ

నెల్లూరు (వ్యవసాయం), ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన అన్నదాతలకు పెట్టుబడి సాయం పెంచి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ నెరవేర్చేందుకు రంగం సిద్ధం చేసింది. ఇప్పటికే వ్యవసాయ శాఖ అధికారులు అర్హులైన రైతులను గుర్తించి జాబితాను సిద్ధం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులతోపాటు ఆదాయ పన్ను చెల్లింపుదారులు, ప్రజాప్రతినిధులను ఇలా కొంతమందిని పథకానికి మినహాయింపు ఇచ్చారు. అన్నదాత సుఖీభవ పథకం మొదటి విడతకు జిల్లాలో 1,95,866 మంది రైతులను అర్హులుగా తేల్చారు. వీరికి మొత్తంగా రూ.131.603 కోట్లుశనివారం రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ కానున్నాయి. కాగా, సీసీఆర్సీ గుర్తింపు కార్డులున్న కౌలు రైతులకు రూ.10వేలు చొప్పున సంవత్సరానికి రెండు విడతల్లో రాష్ట్ర ప్రభుత్వం అందజేయనుంది.

● రాష్ట్ర ప్రభుత్వం రూ.97.933 కోట్లు

రైతు సేవా కేంద్రాల్లోని గ్రామ వ్యవసాయ సహాయకులు అర్హులైన రైతుల జాబితాను సిద్ధం చేయడంతోపాటు ఈకేవైసీ ప్రక్రియను పూర్తి చేశారు. మొత్తంగా అన్నదాత సుఖీభవ పథకం కింద మొదటి విడతగా 1,95,866 మంది రైతులకు ఒక్కొక్కరికి రూ.5వేలు చొప్పున పెట్టుబడి సాయం అందనుంది. మొత్తంగా రూ.97.933 కోట్లు రైతుల ఖాతాల్లో జమ అవుతుంది. ప్రకాశం జిల్లా దర్శి మండలం ఈస్ట్ వీరయ్యపాళెం గ్రామం నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శనివారం రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు.

● పీఎం కిసాన్ రూ.33.67కోట్లు

కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకం ద్వారా జిల్లావ్యాప్తంగా 20వ విడత కింద 1,68,350 మంది రైతులకు ఆర్థిక సాయం అందనుంది. ఒక్కో రైతుకు రూ.2వేల చొప్పున రూ.33.67కోట్లు రైతుల ఖాతాల్లో జమవుతాయి. వారణాసిలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ కార్యక్రమం ప్రారంభించనున్నారు. మొత్తం మీద రూ.7 వేలు రైతుల ఖాతాల్లో జమ అవుతాయి.

● ఒక్కో రైతుకు రూ.6500 అదనపు లబ్ధి

వైసీపీ ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద రూ.13500 మాత్రమే పెట్టుబడి సాయం కింద రైతులకు అందించింది.

నియోజకవర్గాల వారీగా రైతుల వివరాలు

నియోజకవర్గం	అన్నదాత సుఖీభవ	పీఎం కిసాన్	నగదు (రూ.కోట్లలో)
ఉదయగిరి	45275	39525	30.5
ఆత్మకూరు	34223	30471	23.2
కావలి	18305	14415	12
కోవూరు	16938	13002	11
సర్వేపల్లి	27958	23909	18.7
నెల్లూరు	5299	4340	3.5
వెంకటగిరి	16015	13614	10.7
కందుకూరు	31853	29074	21.7
మొత్తం	195866	168350	131.6

అందులో పీఎం కిసాన్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం రూ.6వేలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.7500 ఇచ్చింది. అయితే ఎన్డీఏ కూటమి పెట్టుబడి సాయం కింద ఏటా రూ.20వేలు అందిస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు చర్యలు తీసుకుంది. కేంద్రం వాటా రూ.6వేలు కాగా రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.14వేలు అందించనుంది. దీంతో ఒక్కో రైతుకు రూ.6500 అదనపు లబ్ధి చేకూరనుంది.

● జిల్లావ్యాప్తంగా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో స్థానిక ప్రజాప్రతినిదులు, అధికారులు కచ్చితంగా అన్నదాత సుఖీభవ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొనాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రకాశం జిల్లా దర్శి మండలం ఈస్ట్ వీరయ్యపాళెం గ్రామం నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగాన్ని రైతులంతా వీక్షించేలా ప్రతి రైతు సేవా కేంద్రాల్లో ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. అలాగే కోవూరులో జరిగే కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డితోపాటు కలెక్టర్ పాల్గొననున్నట్లు తెలిసింది.

ఉద్యోగ మేళా!

ఆత్మకూరులోని ఆంధ్రా ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ప్రారంభమైన మెగా జాబ్‌మేళాకు యువత తరలివచ్చింది. రెండు రోజులపాటు జరిగే ఈ జాబ్‌మేళాకు 3వేల మందికిపైగా రిజిస్ట్రేషన్ చేసుకోగా, తొలిరోజున 579 మంది అభ్యర్థులకు వివిధ కంపెనీల్లో నియామకపత్రాలను అందజేశారు. ముందుగా రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు గుండ్రా సతీష్‌రెడ్డి, కలెక్టర్ ఆనంద్ జ్యోతి ప్రజ్వలన చేసి మెగా జాబ్‌మేళాను ప్రారంభించారు.

- వివరాలు 8లో..



కౌంటర్ వద్ద రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న యువతీ యువకులు

రెవెన్యూ రికార్డుల డిజిటలైజేషన్ పూర్తి

'నెల్లూరు రెవెన్యూ' పేరుతో కొత్త వెబ్‌సైట్

ఇక రికార్డులన్నీ కంప్యూటర్‌లో నిక్షిప్తం!

రెవెన్యూ శాఖలో కీలక సంస్కరణలు మొదలుకాబోతున్నాయి. జిల్లాలో విపరీతమైన భూసమస్యల పరిష్కారానికి అధికార యంత్రాంగం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై మూస పద్ధతిని అనుసరించకుండా, కొత్త విధానాన్ని అమల్లోకి తీసుకురాబోతోంది. 'నెల్లూరు రెవెన్యూ' పేరుతో సరికొత్త వెబ్‌సైట్‌ను రూపొందిస్తోంది. మధర్ రికార్డులతోపాటు నేటి వరకూ ఉన్న వివిధ రకాల ఉత్తర్వులను ఈ వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తీసుకొస్తున్నారు. రెండు విడతల్లో ఈ రికార్డుల డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా, తొలి విడత ప్రక్రియ పూర్తయింది. ఈ నెల 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ వెబ్‌సైట్‌ను ఆవిష్కరించుకునేందుకు జిల్లా ఉన్నతాధికారులు సన్నాహాలు ప్రారంభించారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వానికి కలెక్టర్ ఓ ఆనంద్ లేఖ కూడా రాశారు.

- వేగంగా భూ సమస్యలు పరిష్కరించే వీలు
- ఆగస్టు 15న ప్రారంభించేందుకు సన్నాహాలు
- ప్రభుత్వానికి లేఖ రాసిన కలెక్టర్ ఆనంద్





నెల్లూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : 'నెల్లూరు రెవెన్యూ' అనే పేరుతో రూపొందిస్తున్న కొత్త వెబ్‌సైట్‌ను భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తయారు చేశారు. ఇప్పటి వరకూ చాలా రెవెన్యూ రికార్డులు డిజిటలైజ్ కాలేదు. తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్ కార్యాలయాల్లోని రికార్డు రూముల్లో మగ్గుతున్నాయి. ఇప్పుడు ఈ రికార్డులన్నిటినీ డిజిటలైజ్ చేస్తున్నారు. మొత్తం 12 రకాల రికార్డులను కొత్త వెబ్‌సైట్ ద్వారా రెవెన్యూ యంత్రాంగానికి అందుబాటులోకి తీసుకురానున్నారు. తొలి విడతలో పర్మినెంట్ రికార్డులను స్కాన్ చేశారు. 10 (1), ఆర్ఎస్ఆర్, సీలింగ్ రిజిస్టర్, డీ-రిజిస్టర్లను స్కానింగ్ చేయడం పూర్తయింది. అలానే 2012 నుంచి వెబ్‌ల్యాండ్ అందుబాటులోకి రాగా అక్కడ నుంచి డిజిటల్ అడంగల్స్ ఉన్నాయి. అంతకుముందు ఉన్న ఫసలీలను కూడా స్కానింగ్ చేస్తున్నారు. ఇప్పటికే సగం రికార్డుల స్కానింగ్ పూర్తయింది. రెండో విడతగా డైనమిక్ రికార్డులను డిజిటలైజ్ చేసి అందుబాటులోకి తీసుకురానున్నారు. వీటిలో ఆర్‌హెచ్, ఈసీ, 22(ఏ), లోన్ మాడ్యూల్, నీటి తీరువా రికార్డు, ఎఫ్ఎంబీలు ఉన్నాయి. ఇందులో ఆర్‌హెచ్, నీటి తీరువా రికార్డులు మినహా మిగిలిన రికార్డులన్నీ గతంలోనే స్కానింగ్ చేసి ఉన్నారు. జిల్లాకు సంబంధించిన ఈ రికార్డులన్నింటినీ రిజిస్ట్రేషన్ శాఖ నుంచి అధికారికంగా అందించాలని కోరుతూ కలెక్టర్ ఆనంద్ ఇటీవల భూపరిపాలన ప్రధాన కమిషనర్‌కు లేఖ రాశారు.

● పెరిగిన భూ సమస్యలు

గత ప్రభుత్వంలో విచ్చలవిడిగా రికార్డులు మార్చేయడంతో బాధితులు అధికారుల వద్దకు క్యూ కడుతున్నారు. మరోవైపు సివిల్ కోర్టుల్లో భూ వివాదాలు ఎక్కువయ్యాయి. క్షేత్రస్థాయిలో రెవెన్యూ సిబ్బంది పనితీరు అధ్వానంగా ఉంటోంది. భూ సమస్యల పరిష్కారంలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారు. ఈ కారణంతో జిల్లా ఉన్నతాధికారులపై ఒత్తిడి పెరుగుతోంది. సాధారణంగా కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ కార్యక్రమంలో 250కు మించి అర్జీలు వచ్చేవి కావు. కానీ ఇటీవల ఆ సంఖ్య 500 దాటుతోంది. అందులో సగానికిపైగా భూ సమస్యలే ఉంటున్నాయి. వీటిని పరిష్కరించాలని ఉన్నతాధికారులు కిందిస్థాయి సిబ్బందికి పంపుతున్నా.. అక్కడ పరిష్కారం కాక మళ్లీ కలెక్టరేట్ చుట్టూ తిరగాల్సి వస్తోంది. రీఓపెన్ అవుతున్న అర్జీలను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతుంది.

ఇక సాకులు చెప్పడం కుదరదు

ఇప్పటి వరకూ రెవెన్యూ రికార్డులన్నీ ఒకేచోట లభ్యమయ్యేవి కావు. కొన్ని రికార్డులు కలెక్టరేట్‌లో ఉంటే మరి కొన్ని తహసీల్దార్ కార్యాలయాల్లో ఉండేవి. దీంతో ప్రజలు రెవెన్యూ కార్యాలయాలకు వెళితే 'ఇప్పుడు కాదు.. తర్వాత రండి..' అనే మాటలు వినిపిస్తుంటాయి. ఇకపై రెవెన్యూ రికార్డులన్నీ ఒకచోటకు చేరనున్నాయి. నూతన వెబ్‌సైట్‌లో సర్వే నంబర్ లేదా ఎఫ్ఎంబీ నంబర్ సెర్చ్ చేస్తే ఆ భూమికి సంబంధించిన రికార్డులన్నీ కనిపిస్తాయి. ప్రతీ అర్జీ ఆన్‌లైన్ ద్వారానే వెళుతుండటం, రికార్డులన్నీ ఆన్‌లైన్‌లోనే ఉంటుండడంతో సమస్య పరిష్కారంలో ఉద్దేశ పూర్వకంగా నిర్లక్ష్యం చేస్తే వెంటనే ఆ వివరాలు పైఅధికారులకు తెలిసిపోయేలా వెబ్‌సైట్‌ను రూపొందించారు. ఈ ప్రక్రియ ఫలితంగా రెవెన్యూ రికార్డులను తారుమారు చేసేందుకు కూడా ఆస్కారం ఉండదు.

ఖాకీ ఉద్యోగానందం

కానిస్టేబుల్ పరీక్షల తుది ఫలితాల విడుదల

పోలీసు శాఖలోకి 160 మంది...

నెల్లూరు (క్రైం), ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ శాఖలు ఎన్ని ఉన్నా... వాటిలో పోలీసు శాఖ ప్రత్యేకమైనది. అలాగే ఎన్ని రకాల ఉద్యోగాలున్నప్పటికీ ఖాకీ నౌకరి అంటే ఎవరికైనా కొంత గొప్పే!. అలాంటి లాఠీ ఉద్యోగానికి జిల్లాలో కొత్తగా 160 మంది ఎంపికయ్యారు. పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీకి సంబంధించి తుది ఫలితాలను రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసింది.

8 లో..

ఊరి కోసం ప్రాణాలైనా వదులుతాం

- మైనింగ్ అనుమతులు రద్దు చేయాలి
- వరికుంటపాడు వాసుల ఆగ్రహం
- హైవేపై బైఠాయించి, నిరసన

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): 'మాకు జీవనాధారంగా మారిన కొండతోపాటు ఊరి కోసం ప్రాణాలు వదిలేందుకు కూడా సిద్ధంగా ఉన్నా'మని వరికుంటపాడు పంచాయతీ వాసులు తేల్చి చెప్పారు. కొండ ప్రాంతంలో మైనింగ్ (తెల్లరాయి తవ్వకాలు) అనుమతులు రద్దు చేయాలని కోరుతూ శుక్రవారం స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని జాతీయ రహదారిపై బైఠాయించి, నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్థులు మాట్లాడుతూ తొలి నుంచి టీడీపీలోనే ఉంటున్న తాము ఎమ్మెల్యే మంచోడని నమ్మి ఎంతో వ్యయ, ప్రయాసలను భరించి గెలిపించుకున్నట్లు చెప్పారు. తీరా ఇప్పుడు తమ అభిష్టానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండానే అధికారులు రహస్యంగా ప్రజాభిప్రాయ సేకరణ జరిపి వ్యాపారులకు అనుకూలంగా వ్యవహరించడం దారుణమని మండిపడ్డారు. ఇప్పటికే ఎమ్మెల్యేకు అర్జీలు ఇచ్చినా పట్టించుకోలేదని, తమ ప్రాంతంలో పనులు జరుపుకోవాలంటే అందరినీ చంపి చేసుకోవాలని హెచ్చరించారు. అనంతరం గ్రామస్థులతోపాటు జంగంరెడ్డిపల్లి, భాస్కరాపురం, ఆంద్రావారిపల్లి, కనియంపాడు గ్రామాలకు చెందిన ప్రజలు, మహిళలు జాతీయ రహదారిపై మానవహారంగా ఏర్పడి 'మైనింగ్ వద్దు... మా ప్రాణాలు ముద్దు' అంటూ నినాదాలు చేశారు. దీంతో కొంతసేపు వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడటంతో ట్రాఫిక్ సమస్య నెలకొంది. విషయం తెలుసుకున్న ఎస్ఐ రఘునాథ్ అక్కడకు చేరుకుని సర్ది చెప్పారు. అయినా ఆందోళనకారులు ససేమిరా అన్నారు. దీంతో పోలీసులు, ఆందోళనకారుల నడుమ కొంతసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. చివరికి కాసేపటికి ప్రజలు ఆందోళన విరమించారు.



హాస్టళ్లకు కొత్త వంట సామగ్రి

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని 73 బీసీ సంక్షేమ హాస్టళ్లకు శుక్రవారం కొత్త వంట సామగ్రి చేరింది. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని హాస్టళ్లలో ఎప్పటి నుంచో వినియోగిస్తున్న పాత సామగ్రి స్థానంలో ప్రభుత్వం కొత్త పాత్రలను అందించింది. ఈ సందర్భంగా జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి వెంకటలక్ష్మమ్మ మాట్లాడుతూ పిల్లలకు మెనూ ప్రకారం సక్రమంగా ఆహారం అందించేందుకు అన్నీ చర్యలు చేపట్టామని, వారి అభ్యసన సామర్థ్యాన్ని మరింత పెంచేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

దేవీ నమోస్తుతే!!

శ్రావణ మాసంలో 2వ శుక్రవారం సందర్భంగా శివకేశవులు, అమ్మవారి ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. మూలవర్లకు అభిషేకాలు, నవావరణ పూజలు, సామూహిక లక్ష కుంకుమార్చన, పూలంగి సేవ, విశేష పూజలు, పల్లకీ ఉత్సవాలు జరిగాయి. తరలివచ్చిన భక్తుల అన్నప్రసాద వితరణ చేశారు.



మహారాణుల్లా తిరగండి!

- 15 నుంచి ఆర్టీసీలో ఉచిత ప్రయాణం
- ఇబ్బందులు తలెత్తకుండా ఆదేశాలు
- బస్సులకు మరమ్మతులు, రంగులు
- డిపోలవారీగా కాల్‌ఆన్ డ్రైవర్ల నియామకం



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణానికి అన్ని ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. ఏదైనా గుర్తింపు కార్డు చూపితే చాలు బస్సుల్లో మహారాణుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చు. ఎన్నికల ముందు ఎన్డీఏ కూటమి ఇచ్చిన హామీల్లో భాగంగా ఈ నెల 15వ తేదీ నుంచి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అందించేందుకు రంగం సిద్ధం చేసింది. గత నెల చివరి వారంలో ఆర్టీసీ నెల్లూరు జోన్ పరిధిలోని రీజియన్లకు సంబంధించిన అధికారులతో ఆ సంస్థ ఎండీ తిరుమలరావు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అన్ని అంశాలతో పాటు మహిళలకు ఉచిత ప్రయాణంపై ప్రత్యేకంగా చర్చించారు. 15వ తేదీలోగా బస్సులను కండిషన్‌లో ఉంచుకోవాలని ఎండీ ఆదేశించారు. దీంతో జిల్లాలోని అన్ని డిపోలలో బస్సులకు మరమ్మతులు, బస్సులకు పెయింటింగ్ వంటి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇటీవల మరోమారు జిల్లా అధికారులతో సమావేశమై దిశానిర్దేశం చేశారు. బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తున్న మహిళతోపాటు సాధారణ ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చర్యలు తీసుకోనున్నారు.



నెల్లూరు-1 డిపోలో ఆర్టీసీ బస్సుకు రంగులు అద్దుతున్న కార్మికులు

● గుర్తింపు కార్డు ఉంటే చాలు

మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంపై ఆ సంస్థ ఉన్నత యంత్రాంగం దిశా నిర్దేశం చేసింది. మహిళలు ఏ గుర్తింపు కార్డు చూపించినా బస్సుల్లో ఉచిత ప్రయాణానికి అనుమతించాలని అధికారులకు సూచించారు. గత సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా మహిళలు ఎక్కడ ఎక్కినా.. ఎక్కడ దిగినా ఉచిత ప్రయాణం అందించాలని ఉన్నతాధికారులు సూచించినట్లు తెలుస్తోంది. అయితే ఈ నెల 8వ తేదీ ఆర్టీసీ ఎండీ అన్ని జిల్లాల ఆర్టీసీ అధికారులతో మరోమారు సమావేశం కానున్నారు. అప్పుడే పూర్తిస్థాయిలో స్పష్టత రానుంది.

● జీరో టికెట్‌పై అవగాహన

ఈ నెల 15 నుంచి అధిక సంఖ్యలో మహిళలు బస్సుల్లో ప్రయాణిస్తే ఎలాంటి ఇబ్బందులు పడకూడని రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ అధికారులకు స్పష్టం చేసింది. ఇప్పటికే అమలవుతున్న తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో ఆర్టీసీ ఉన్నతాధికారులు పర్యటించి అక్కడ తలెత్తుతున్న ఇబ్బందులను గుర్తించారు. అవి మన దగ్గర పునరావృతం కాకుండా అనేక నిర్ణయాలు తీసుకున్నారు. అందులో భాగంగానే అధిక సంఖ్యలో బస్సులు ఏర్పాటు చేయడంతో పాటు డ్రైవర్ల కొరత ఉన్న డిపోల పరిధిలో కాల్ ఆన్ డ్రైవర్ల నియామకాలకు అనుమతులు ఇచ్చింది. దీంతో పాటు బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య పెరిగిన సమయంలో ఫుట్‌పాత్‌ల పై నిల్చునే అవకాశం ఉంటుందని, అలాంటి సందర్భాల్లో ప్రమాదాలు జరగకుండా బస్సుల ఫుట్‌పాత్ మెట్లను మరమతు చేయాలని సూచించారు. ఈ క్రమంలో జిల్లా వ్యాప్తంగా అన్ని డిపోలలో అధికారులు బస్సుల కండిషన్‌పై దృష్టి పెట్టి, మరమ్మతు పనుల్లో వేగం పెంచారు.



ఆంధ్రజ్యోతి
4 శనివారం, 2 ఆగస్టు 2025
www.andhrajyothy.com
కోవూరు
సర్వేపల్లి

నేడు ఎమ్మెల్యే సోమిరెడ్డి రాక

వెంకటాచలం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎర్రగుంట వద్ద ఉన్న కమ్యూనిటీ హాలులో శనివారం జరిగే అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ పథకం ప్రారంభ కార్యక్రమానికి సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి హాజరవుతున్నారని ఎమ్మెల్యే కార్యాలయ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఉదయం 9.30 గంటలకు సోమిరెడ్డి విచ్చేసి ప్రారంభ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9424
వెండి కిలో ధర	రూ. 112800
వెండి ఒక గ్రాము	రూ. 115.80

ప్రశాంతమ్మా.. మా మొర ఆలకించవమ్మా!

● బుచ్చి వ్యాపారుల్లో గుబులు రేపుతున్న కాలువ పూడికతీత

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ప్రతీసారి కాలువ పూడికతీత పేరుతో బుచ్చి పట్టణంలోని ముంబాయి జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న వ్యాపార దుకాణాలు, నివాసాలను అధికారులు ధ్వంసం చేస్తున్నారు. దీంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని దుకాణాదారులు, ఇళ్ళ యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు అధికారులు రెండు నెలల క్రితం నోటీసులు ఇచ్చారు. వారంలోపు తొలగించాలంటూ హెచ్చరించారు. ఆఖరుకు వ్యాపారులు ఎమ్మెల్యేకి మొరపెట్టుకోవడంతో అధికారులు వెనక్కి తగ్గారు. ఇప్పుడు మళ్లీ దుకాణాలు పగలగొట్టేందుక ఎక్స్‌కవేటర్లను సిద్ధం చేస్తున్నారని, ఏదైనా ఒక దిశా నిర్దేశం చేస్తే అందుకు కట్టుబడి ఉంటామని దుకాణదారులు, స్థానికులు చెబుతున్నారు. కాలువ పూడికతీతకైతే పగలగొట్టాల్సిన అవసరం లేదంటున్నారు. అవసరమైన చోట తొలగించి గతంలో నగర పంచాయతీకి ముందు మనుషులను పెట్టి పూడిక తీయించి కాలువలు శుభ్రం చేశారన్నారు. నాలుగేళ్ళ తరువాత ఇప్పుడు పూడిక తీయడం కుదరదంటే ఎవరితప్పు అని వ్యాపారస్థులు ప్రశ్నిస్తున్నారు.. అన్ని రకాల పన్నులు వసూలు చేసి పూడిక తీయకుండా నిధులు ఏమి చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. రెండు నెలలకోసారి దుకాణాలు తొలగిస్తామంటూ ఆందోళన రేకెత్తిస్తున్నారంటూ వాపోతున్నారు. అయితే.. కాలువలపైన శాశ్వత కట్టడాలు వుండకూడదని కమిషనర్ బాలకృష్ణ తెగేసి చెప్తున్నారు. వర్షాలకు కాలువల్లో పూడికతీతకు ఇబ్బందులు ఎదురౌతాయంటున్నారు. కాలువపై కట్టడాలను స్వచ్ఛందంగా తొలగించాలని హెచ్చరించారు. అందుకు రంగం సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు. విస్తరణ అనంతరం కాలువల్లో పూడికతీతకు అనుకూలంగా దుకాణాలు, ఇళ్ళ ముందు బండలు వేసుకోవాలని కమిషనర్ చెప్పారు. మొత్తానికి కాలువల్లో పూడికతీత పనుల వల్ల ఇళ్లు దెబ్బతింటాయని వ్యాపారస్తులు, ఇళ్ళ యజమానుల్లో ఆందోళన నెలకొంది. మరోవైపు దుకాణాలు, నివాసాలకు ఇబ్బంది లేకుండా కాలువ పూడిక తీయిస్తామని గతంలో హామీలిచ్చిన నాయకులు, ప్రజాప్రతినిధులు ప్రస్తుతం ముఖం చాటేయడంపై దుకాణాదారులు, ఇళ్ళ యజమానులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



బుచ్చిరెడ్డిపాళెం - ముంబాయి జాతీయ రహదారికి ఇరువైపులా వున్న దుకాణాలు

మా కడుపు కొట్టకండి...



మేం పూడికతీతకు వ్యతిరేకం కాదు.. కానీ పూడిక తీత పేరుతో దుకాణాలు ధ్వంసం చేసి మా కడుపులు కొట్టకండి. నగర పంచాయతీ కౌన్సిల్ ఏర్పాటైన నాలు గేళ్ళలో ఒక్కసారి కూడా కాలువల్లో పూడిక తీయలేదు. దీంతో పేరుకుపోయిన మురుగునీరు ఒక్కసారిగా తీ యాలంటే సాధ్యమా? అవసరమైన చోట తొలగించి మిగతా ప్రాంతాల్లో మనుషులతో పూడిక తీయిస్తే సరి పోతుంది కదా?

- రాచూరి సురేష్, కూల్ డ్రింక్ షాపు యజమాని, బుచ్చి బస్టాండ్ సెంటర్

వ్యాపారులకు నష్టం రాకూండా చూడాలి



కాలువల పూడికత పేరుతో దుకాణాలు ధ్వంసం చేయడం అన్యాయం. నివాసాలతోపాటు వ్యాపారులందరం తీవ్రంగా నష్ట పోతాం. దుర్వాసనకు దుకాణాలు, హోటళ్లు మూసేసుకోవాలి. వర్షా కాలంలో చాలా ఇబ్బం దులు ఎదురవుతాయి. ఎమ్మెల్యే ప్రశాంతమ్మ మా మొర ఆలకించాలి. వ్యాపారులకు నష్టం వాటిల్లకుండా చర్యలు చేపట్టాలి.

-షేక్ వహబ్ సాహెబ్, టీ స్టాల్ యజమాని, గాంధీబొమ్మ సెంటర్



యూరియా అధికంగా వాడొద్దు

'ఆంధ్రజ్యోతి'తో ఎంఏఓ నీరజ

కోవూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కనిగిరి రిజర్వాయర్ పరిధిలోని పొలాల్లో అధిక మోతాదులో యూరియా వాడవద్దని మండల వ్యవసాయాధికారిణి నీరజ రైతులకు సూచించారు. ఎకరా పొలానికి రెండున్నర కట్టల యూరియా వాడితే సరి పోతుందన్నారు. ఒక్కో రైతు ఎకరాకు 5 నుంచి 6 కట్టల యూరియా వాడుతున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలను 'పొలంపిలుస్తోంది' కార్యక్రమంలో రైతులకు వివరిస్తున్నామన్నారు.

?.. రైతులకు సరిపోయినంత యూరియా అందుతోందా

!.. రైతులకు అవసరానికి మించి యూరియా అందుతోంది.

?.. రైతులు యూరియా కొరత ఉందంటు న్నారు..

!.. యూరియా కొరత లేదు. ఎకరాకు రెండున్నర కట్టలు వాడితే సరిపోతుంది. అన్ని ఎరువుల కంటే యూరియా ధర తక్కువగా ఉండడం, అందుబాటులో ఉన్నందు వల్ల అవసరానికి మించి వాడుతున్నారు.

? యూరియా అధికంగా వాడితే ఇబ్బందులేమిటి

!.. యూరియా అధికంగా వాడితే పురుగులు పంటను ఆశించే ప్రమాదముంది. పంట ఏపుగా పెరిగినప్పటికీ పర్యావరణం దెబ్బతింటుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. కేంద్ర ప్రభుత్వం యూరియా వాడకం తగ్గించాలనే ఉద్దేశ్యంతోనే తగ్గించి పంపుతోంది.

? రైతులకు డ్రోన్స్ పంపిణీ చేశారా

!.. రైతుల్ని గ్రూపుగా చేసి ఓ యూనిట్ పంపిణీ చేశాం. మరో రెండు గ్రూపులకు పంపిణీ చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం.

? కౌలు రైతులకు గుర్తింపు కార్డుల మాటేమిటి

!.. కౌలు రైతులు తమతమ గ్రామాల్లోని వీఆర్వోల వద్దనుంచి కౌలు ' రైతు గుర్తింపు కార్డుల్ని' తీసుకోమని ప్రభుత్వం ఆదేశించింది.

? పంటబీమా గురించి గ్రామాల్లో ప్రచారం చేస్తున్నారా

!.. పంట బీమా పథకం గురించి గ్రామాల్లో ప్రచారం చేస్తున్నాం. వరికి ఎకరాకు రూ.800 చెల్లించి బీమా చేయించుకోవాలి. ఈ నెల 15 లోగా బీమా చేయించుకోవాలని గ్రామాల్లో ప్రచారం చేస్తున్నాం.

జనసేన అబ్జర్వర్‌గా ప్రసాద్ యాదవ్



వెంకటాచలం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : కంటేపల్లి గ్రామానికి చెందిన జనసేన పార్టీ జిల్లా నేత బోనుబోయిన ప్రసాద్ యాదవ్‌ను కోవూరు అసెంబ్లీ నియోజకవర్గానికి అబ్జర్వర్‌గా నియమించారు. శుక్రవారం జనసేన పార్టీ క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్, జిల్లా పార్టీ ఇన్‌చార్జ్, ఏపీ టీడ్కో ఛైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ నియమిస్తూ ఉత్తర్వులిచ్చారు. గతంలో ఈయన తిరుపతి పార్లమెంట్ జనసేన పార్టీ కో ఆర్డినేటర్‌గా పని చేశారు. జనసేన పార్టీ అధిష్టానంతో పాటు అజయ్‌కుమార్‌కు ప్రసాద్ యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. క్షేత్ర స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా పలువురు జనసేన నేతలు, కార్యకర్తలు, ఆయనకు అభినందనలు తెలియజేశారు.

కోవూరులో యువకుడి అపహరణ

కోవూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక శివాలయం సమీపంలో దుకాణాన్ని నిర్వహిస్తున్న ఓ యువకుడిని గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి అపహరించుకువెళ్ళినట్లు స్థానికులు తెలిపారు. వ్యాపార కుటుంబానికి చెందిన ఓ యువకుడు కొద్దికాలంగా దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. కొందరు అపరిచిత వ్యక్తులు రిజిస్టర్ నంబరు లేని కారులో దుకాణం వద్ద యువకుడిని బెదిరించారు. సెల్‌ఫోను లాక్కొని తమ వెంట తీసుకువెళ్ళారు. ఈ విషయమై కుటుంబసభ్యులు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

కోవూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. గాంధీజనసంఘం, గుమ్మళ్ళదిబ్బ గిరిజన కాలనీల్లో శుక్రవారం ఆమె ఇంటింటికీ తిరిగి పింఛన్లను పంపిణీ చేశారు. రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలలో ఉన్నప్పటికీ ప్రతీ నెల మొదటి తేదీనే ముఖ్యమంత్రి చంద్రబాబు పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో కొత్తగా 789 మందికి పింఛన్లు మంజూరయ్యాయని తెలిపారు. మహిళలు ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణించేందుకు ఈ నెల 15 నుంచి పథకాన్ని ప్రవేశపెట్టనున్నట్లు వివరించారు. తహసీల్దారు సీహెచ్ సుబ్బయ్య, ఎంపీడీఓ శ్రీహరిరెడ్డి, ఎం పీపీ పార్వతి, పెన్నా డెల్టా ఛైర్మన్ జెట్టి రాజ గోపాలరెడ్డి, సర్పంచ్ యాకసిరి విజయమ్మ, టీడీపీ నాయకులు కొల్లారెడ్డి సుధాకరరెడ్డి, ఇంతా మల్లారెడ్డి, గాదిరాజు అశోక్‌కుమార్ పాల్గొన్నారు.



పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతి

నేడు అన్నదాత సుఖీభవ పథకం ప్రారంభోత్సవం

స్థానిక పీవీఆర్ కళ్యాణమండపంలో శనివారం అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ పథకాన్ని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ప్రారంభిస్తారని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు అనిత తెలిపారు. నియోజకవర్గ పరిధిలో పీఎం కిసాన్ పథకానికి 13002 మంది, అన్నదాత సుఖీభవ పథకానికి 16938 మంది లబ్ధిదారులు ఎంపికైనట్లు వివరించారు.

తల్లిపాలు శిశువుకు వరం.. తల్లికి రక్షణ

ఇందుకూరుపేట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): జగదేవిపేట అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుబ్బరత్నమ్మ ఆధ్వర్యంలో గర్భిణీలు, బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేటర్ సీహెచ్ సుధాకర్ రావు మాట్లాడుతూ తల్లిపాలు శిశువుకు వరం.. తల్లికి రక్షణ అన్నారు. తెలిపారు. పుట్టిన వెంటనే మొదటి గంటలో తల్లిపాలు ఇవ్వడం ద్వారా శిశువు రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుబ్బరత్నమ్మ, ప్రధానోపాధ్యాయుడు ఖాజావలి, హెల్త్ సూపర్‌వైజర్ సతీష్‌బాబు, హెల్త్ అసిస్టెంట్ మాధవ, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న వైద్య, అంగన్‌వాడీ సిబ్బంది

● వెంకటాచలం: కంటేపల్లిలో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహిం చారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మజ మాట్లాడుతూ తల్లులు తప్పనిసరిగా పిల్లలకు పాలు ఇవ్వాలన్నారు. తల్లి పాలు ఇవ్వడం వల్ల పలు రకాల క్యాన్సర్లు రావన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త ఎన్ కామాక్షమ్మ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు బలం

● సైదాపురం: తల్లిపాలే బిడ్డకు బలం అని రాపూరు సీడీపీవో సునంద అన్నారు. కొమ్మిపాడు అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాల్లో ఆమె పాల్గొన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ధనమ్మ, సీహెచ్‌వో రాజేశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

● రాపూరు : పుట్టిన బిడ్డకు 6 నెలల వరకు తల్లిపాలు బలాన్ని ఇస్తాయని సీడీపీవో సునంద అన్నారు. గురువారం వీరాయపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేపినాపి సామాజిక కేంద్రం డాక్టర్ ప్రమీలారాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునంద, అంగన్‌వాడీ సిబ్బంది, గర్భిణులు, తల్లులు, తదితరులు పాల్గొన్నారు.

అధికారుల సంరక్షణలో బాధిత చిన్నారులు

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మినగల్లు గ్రామానికి చెందిన మణి(13) అనే గిరిజన బాలుడు తెలంగాణ రాష్ట్రం వరంగల్‌లో బాతుల కాపరిగా వెట్టి చాకిరీలో మగ్గిపోతుండగా, సమాచారం తెలుసుకున్న బాల కార్మికశాఖాధికారులు వారిని ప్రస్తుతం తమ సంరక్షణలో ఉంచుకున్నారు. ఈ ఘటన 16 రోజుల ఆలస్యంగా వెలుగు చూసింది. ఐతే బాలుడు అధికారులకు ఇచ్చిన సమాచారం మేరకు కోవూరు నియోజకవర్గం నుంచి మరో ముగ్గురు మైనర్లు కూడా వెట్టి చాకిరీలో బాతుల కాపరులుగా వున్నట్టు గుర్తించారు. మణి ఇచ్చిన సమాచారంతో చైల్డ్ లేబర్ అధికారులు సర్పంచు భర్త రాముకు విషయం తెలియజేశారు. దీంతో రంగంలోకి దిగిన రాము మినగల్లుకు చెందిన బాలుడితోపాటు కోవూరు నియోజకవర్గ పరిధిలోని మరో ముగ్గురు బాలురతో మాట్లాడారు. మూడు రోజుల్లో వారిని తల్లిదండ్రులకు అప్పజెబుతానని ధైర్యం చెప్పడంతో పిల్లలు ఊపిరి పీల్చుకున్నారు.

జగన్ రెడ్డీ.. స్క్రిప్టు చూసి మాట్లాడితే మంచిది

వెంకటాచలం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మీడియాతో మాట్లాడేటప్పుడు ఒకటికి రెండుసార్లు స్క్రిప్టు చూసుకుని మాట్లాడితే మంచిదని సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్‌నాయుడు ఎద్దేవా చేశారు. వెంకటాచలంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. వైసీపీ హయంలో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి లెక్కకు మించి సహజ సంపదను దోపిడీ చేశాడన్నారు. విలేకరుల సమావేశంలో ఏఎంసీ డైరెక్టర్ గుమ్మినేని వాణిభవాని, నేతలు సందూరి శ్రీహరి, చల్లా చెంచయ్య, మణి, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు ఆధార్ కార్డుల జారీ

విడవలూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : శుక్రవారం 160 మంది గిరిజనులకు ఆధార్ కార్డులను తహసీల్దారు చంద్రశేఖర్ అందజేశారు. కార్యక్రమంలో ఈస్టన్ ఛానల్ డీసీ ఛైర్మన్ పాశం శ్రీహరిరెడ్డి, నాయకులు పూండ్ల అచ్యుత్ రెడ్డి, సత్యవోలు సత్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పథకం దేశంలోనే రికార్డు

● సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి



లబ్ధిదారుకు పింఛను అందజేస్తున్నఎమ్మెల్యే సోమిరెడ్డి

పొదలకూరు, ఆగస్టు 1 : 'ఏపీలో అమలవుతున్న పింఛన్ల పథకం దేశంలోనే రికార్డు' అని సర్వేపల్లి ఎ మ్మెల్యే సోమిరెడ్డి చంద్ర మోహన్ రె డ్డి అన్నారు. శుక్ర వారం పొదల కూరు మండల పరి షత్ కార్యాలయ ఆవరణంలో నిర్వహించిన నూతన స్పౌజ్ పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయ న ముఖ్య అతిథిగా పాల్గొని పింఛన్లు పంపిణీ చేశారు. జిల్లాకు 5429 కొత్త స్పౌజ్ పింఛన్లు రాగా, సర్వేపల్లి నియోజకవర్గంలో 720 మందికి, పొదలకూరు మండ లానికి 212 మందికి మంజూర య్యాయన్నారు. కండలేరు ఎడమకాలువ మోటార్లను సర్వీ సింగ్ చేయించడంతో పాటు కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లకు మర మ్మతు లు చేయిస్తున్నామన్నారు. శనివారం నుంచి ఎడమ కాలువకు సాగునీరు అందించ బోతున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో నరసింహారావు, డిప్యూటీ తహసీల్దారు సురేఖ, కార్యదర్శి యశ్వంత్ సింగ్, మండల టీడీపీ అధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు, పట్టణా ధ్యక్షుడు బొద్దులూరు మల్లికార్జున నాయుడు, మండల మహిళా ధ్యక్షురాలు ఆదాల సుగుణమ్మ, కలిచేటి ప్రభాకర్‌రెడ్డి, కోడూరు భాస్కర్‌రెడ్డి, బక్కయ్యనాయుడు, వెన్నపూస రాజశేఖర్‌రెడ్డి, పల్లారపు కృష్ణయాదవ్, ఏఎంసీ వైస్ ఛైర్మన్ వెంపులూరు అరుణ, తల్లిక ప్రసాద్, సచివాయలం అధికారులు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయ కులు పాల్గొన్నారు.

185 కొత్త స్పౌజ్ పింఛన్ల పంపిణీ

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): బుచ్చి నగర పంచా యతీతోపాటు మండలంలో కొత్తగా మంజూరైన 185మందికి స్పౌజ్ పింఛన్లు శుక్రవారం పంపిణీ చేసినట్టు కమిషనర్ బాలకృష్ణ, ఎంపీడీఓ నారాయణరెడ్డి తెలిపారు. నగర పంచాయతీ పరిధిలో 92 శాతం, మండలంలో 95శాతం ఫించన్లు పంపిణీ చేసినట్టు కమిషనర్, ఎంపీడీఓ తెలిపారు. ఛైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, టీడీపీ అర్బన్, రూరల్ అధ్యక్షులు గుత్తా శ్రీనివాసులు, బెజవాడ జగదీష్, వైస్ ఛైర్మన్లు, కౌన్సిలర్లు, టీడీపీ క్లస్టర్ ఇన్‌ఛార్జులు, నాయకులు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

● రాపూరు: తిరుపతి పార్లమెంటు ఉపాధ్యక్షుడు కొండ్లపూడి రాఘవరెడ్డి ఆధ్వర్యంలో అకిలి వలస, గుండవోలు గ్రామాల్లో లబ్ధిదా రులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటగిరి నియోజకవర్గ రైతు కార్యదర్శి రవీంద్రరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

● మనుబోలు: మనుబోలు పంచాయతీలో కొత్తగా మంజూరైన స్పౌజ్ పింఛన్లు 22 మంది లబ్ధిదారులకు శుక్రవారం పంపిణీ చేశామని తిరుపతి పార్లమెంట్ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామిరెడ్డి తెలిపారు. మనుబోలు గ్రామ అధ్యక్షుడు మా రంరెడ్డి రమణారెడ్డి, సీనియర్ నాయకులు పచ్చిపాల చంద్రశేఖర్ రెడ్డి, కలికి రమేష్‌రెడ్డి, శాలివాహన జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లగిరి ప్రసాద్, ఏకాంబర సుబ్బయ్య, ఐటీడీపీ కార్యదర్శి. గుంజి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వీఎల్‌వోకు సన్మానం

రాపూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): సైదాపురం మండలం ఊటుకూరు గ్రామీణ పశువైద్యశాలలో వీఎల్‌ఓగా పనిచేస్తూ పదవీ విరమణ పొందిన చల్లా లక్ష్మణ్‌కుమార్‌కు రాపూరు ప్రభుత్వ పశు వైద్యశాలలో శుక్రవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. రాపూ రు ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు అనీల్ కుమార్ ఆధ్వర్యంలో లక్ష్మణ్‌కుమార్ దంపతులను సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాపూరు, ఊటుకూరు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు కేటాయించండి

ముత్తుకూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : దళితులతకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని పంటపాలెం సాగునీటి సంఘం అధ్యక్షు డు మునుకూరు మురళీధర్‌రెడ్డి కోరారు. శుక్రవారం తహసీల్దారు స్వప్నకు వినతిపత్రం అందజేశారు. దొరువులపాలెం పంచాయతీలో 40 ఏళ్లుగా దళితులకు ఇళ్ల స్థలాలు ఇవ్వలేదన్నారు. ఈ కార్యక్రమం లో టీడీపీ నాయకులు పేర్నేటి రామ్మోహన్‌రెడ్డి, దువ్వూరు రాకేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెత్త ఎక్కడపడితే అక్కడ వేయకండి

మనుబోలు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఇంట్లో చెత్తను వీధుల్లో ఎక్కడపడితే అక్కడ పడేయకుండా, చెత్తబండిలోనే వేయాలని డి ప్యూటీ ఎంపీడీవో నారాయణ తెలిపారు. బండేపల్లిలో ఇంటింటా చెత్త సేకరణ ప్రక్రియను ఆయన శుక్రవారం పరిశీలించారు. చెత్త పేరుకుపోవడం వల్ల వచ్చే వ్యాధులు, ఇబ్బందుల గురించి అవగా హన కల్పించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి గిరికిరణ్ పాల్గొన్నారు.

వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు అపహరణ



బాధితులను విచారిస్తున్న ఎస్ఐ ప్రభాకర్‌రావు

బిట్రగుంట, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం నాగులవరం పంచాయతీ చెన్నారెడ్డిపాలెం పాతూరులో గుర్తు తెలియని వ్యక్తి పట్టపగలు ఓ వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు అపహరించుకెళ్లిన ఘటన శుక్రవారం జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. చెన్నారెడ్డిపాలెం పాతూరు రామాలయం సమీపంలో మునగాల చిన్నపురెడ్డి, భార్య వెంకమ్మ దంపతులు నివాసం ఉంటున్నారు. ఉదయం 11 గంటల సమయంలో మనుమడు, మనుమరాలితో చిన్నపురెడ్డి టీవీ చూస్తుండగా, ఇంటి వరండాలో వెంకమ్మ పడుకుని ఉంది. ఓ గుర్తుతెలియని వ్యక్తి వరండాలోకి వచ్చి తాగడానికి నీరు అడుగుతూ ఇంటి తలుపుకి గెడిపెట్టి వెంకమ్మ మెడలో ఉన్న 3 సవర్ల బంగారు గొలుసు లాక్కుని పరారయ్యాడు. వృద్ధురాలి మనుమడు మునగాల సుందరరామిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ఎన్.ప్రభాకర్‌రావు తెలిపారు.

నెత్తిన పెట్టుకున్నందుకు నిందిస్తారా?

● పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దిపాటి

నెల్లూరు(క్రైం), ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : నేరాలు చేసిన వారిని పరామర్శించడానికి వచ్చిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, ప్రాణాలు పణంగా పెట్టి విధులు నిర్వహిస్తున్న పోలీసులను నిందించడాన్ని జిల్లా పోలీసు అధికారుల సంఘం తీవ్రంగా ఖండిస్తోందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాద్ రావు అన్నారు. గత ప్రభుత్వంలో నెత్తిన పెట్టుకొన్న పోలీసు వ్యవస్థను ఇప్పుడు నిందించడాన్ని వైసీపీ నాయకుల విజ్ఞతకే వదిలేస్తున్నామని చెప్పారు. ఆయన శుక్రవారం నెల్లూరులో విలేకరులతో మాట్లాడారు. గతంలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పర్యటనలో జరిగిన అల్లర్లను దృష్టిలో పెట్టుకొని పోలీసు ఉన్నతాధికారులు ఆంక్షలు విధిస్తూ అనుమతులు జారీ చేశారని చెప్పారు. పకడ్బందీ బందోబస్తు ఏర్పాటు చేస్తే, అలజడి సృష్టించాలనే దురుద్దేశంతో నిబంధనలకు విరుద్ధంగా కార్యకర్తలను సేకరించడమేకాక వారిని రెచ్చగొట్టి పోలీసుల మీదకు వదలడం హేయమైన చర్య అన్నారు. హెడ్ కానిస్టేబుల్ మాలకొండయ్య చెయ్యి విరగడానికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను కోరామని తెలిపారు.

కోవూరులో ఘర్షణ



కోవూరులో ఘర్షణకు దిగిన టీడీపీ, వైసీపీ నాయకులు

కోవూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాటూరురోడ్డులో టీడీపీ- వైసీపీ నాయకుల మధ్య శుక్రవారం ఘర్షణ జరిగింది. ఇరువర్గాలకు చెందిన మహిళా నాయకులు పరస్పరం దాడికి దిగారు. వివరాలిలా ఉన్నాయి. మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి పాటూరు రోడ్డులోని వైసీపీ నాయకుల సమావేశంలో పాల్గొనేందుకు రానున్నారనే సమాచారంతో పెద్దసంఖ్యలో మహిళలు అక్కడికి చేరుకున్నారు. పాటూరురోడ్డుకు ప్రసన్న కుమార్‌రెడ్డి వస్తే ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై చేసిన వ్యక్తిత్వ హననపు మాటలకు నిరసన వ్యక్తం చేయాలనుకున్నారు. ఇంతలో వైసీపీ నాయకులు ప్రదర్శనగా వచ్చిన మహిళల్ని ప్రతిఘటించడంతో ఉద్రిక్తత నెలకొంది. మహిళలపై దాడి చేసేందుకు వైసీపీ మహిళా నాయకులు కొందరు ప్రయత్నించారు. దీంతో రెండు వర్గాల మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వాదం జరిగింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ రంగనాథ్‌గౌడ్ సిబ్బందితో అక్కడికి చేరుకుని ఇరువర్గాలనూ అక్కడినుంచి పంపించేయడంతో వివాదం సద్దుమణిగింది.

బిట్రగుంట రైల్వే సెక్షన్‌లో తనిఖీలు



స్టేషన్ మాస్టర్‌తో మాట్లాడుతున్న ఏడీఆర్ఎం శ్రీనివాసరావు

బిట్రగుంట, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): బిట్రగుంట రైల్వే సెక్షన్ పరిధిలోని పలు కార్యాలయాలను విజయవాడ వోపీ ఏడీఆర్ఎం కె.శ్రీనివాసరావు శుక్రవారం విస్తృత తనిఖీలు చేపట్టారు. విజయవాడ నుంచి ప్రత్యేక రైల్లో బిట్రగుంట రైల్వేస్టేషన్‌కు చేరుకున్న ఆయన ఎస్ఎంఆర్ మురళీధర్, ఐవోడబ్ల్యూ రాజేష్‌లతో కలసి ఎస్ఎం కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. స్టేషన్ ఎదురుగా ఉన్న గార్డెన్ పరిరక్షణ గురించి ఎస్ఎంఆర్‌కు పలు సూచనలు ఇచ్చారు. క్రూకంట్రోల్ లాబీలో డ్రైవర్లు, అసిస్టెంట్ డ్రైవర్లు, గార్డులతో సమావేశం నిర్వహించారు. ఉద్యోగ భద్రత, తీసుకోల్సిన జాగ్రతలపై అవగాహన కల్పించారు. అనంతరం చీఫ్ కంట్రోల్ అధికారి శేషయ్యతో కలిసి డ్రైవర్స్, గార్డుల రన్నింగ్ రూమ్ (విశ్రాంతి భవనం), నూతనంగా నిర్మాణంలో ఉన్న రన్నింగ్ రూమ్‌ను పరిశీలించారు. ఆయనతో పాటు సీనియర్ డీఈఈ సౌత్ కృష్ణ, ఏడీఈఎన్ రాజేంద్రప్రసాద్, పీడబ్ల్యూ రాజకుమార్ తదితరులు ఉన్నారు.

పామాయిల్ పరిశ్రమలో ప్రమాదం

● ముగ్గురికి గాయాలు ● టీడీపీ నేతల పరిశీలన



కంపెనీ ప్రతినిధులతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

ముత్తుకూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : పంటపాలెం సమీపంలోని బుంగే పామాయిల్ పరిశ్రమలో శుక్రవారం జరిగిన ప్రమాదంలో ముగ్గురు కార్మికులు గాయపడ్డారు. రిఫైనరీని శుభ్రం చేస్తుండగా, ప్రమాదవశాత్తు అందులోని కెమికల్ కాళ్లపై పడడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న మండల టీడీపీ అధ్యక్షుడు నీలం మల్లికార్జున యాదవ్ నాయకులతో కలిసి ప్రమాద స్థలానికి చేరుకుని కార్మికులను పరామర్శించారు. అనంతరం బుంగే కంపెనీ ప్రతినిధులను అడిగి ప్రమాద వివరాలను తెలుసుకున్నారు. పొరపాటున కెమికల్ లీక్ కావడంతో ప్రమాదం జరిగిందని కంపెనీ ప్రతినిధులు చెప్పారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని టీడీపీ నాయకులు సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి మాచిరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నాయకులు ఏడుకొండలు, షఫీవుల్లా, ముత్యంగౌడ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	114
స్కిన్ చికెన్	210
స్కిన్‌లెస్	234

కోడిగుడ్ల ధర (100): 475



ఉద్యోగుల సేవలు శ్లాఘనీయం : జిల్లా జడ్జి శ్రీనివాస్

నెల్లూరు (లీగల్), ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కోర్టులో పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన పురుజి చంద్రశేఖర్, ఆళ్ల అరుణ అందించిన సేవలు మరువలేనివని జిల్లా ప్రధాన న్యాయాధికారి జీ శ్రీనివాస్ అన్నారు. ఉద్యోగ విరమణ పొందిన వారి వీడ్కోలు సభ శుక్రవారం రాత్రి జిల్లా కోర్టు ప్రాంగణంలో జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా జడ్జి మాట్లాడుతూ చంద్రశేఖర్ 42 ఏళ్లు, అరుణ 22 సంవత్సరాలు సేవలు అందించారని చెప్పారు. అనంతరం వారిని సత్కరించారు. కార్యక్రమంలో పలువురు న్యాయాధికారులు, ఉద్యోగులు, నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అయ్యప్ప రెడ్డి, నాగరాజు, ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సురేష్, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

గోవా గవర్నర్‌కు సత్కారం

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల గోవా గవర్నర్‌గా నియమితులైన కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజును నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం ఢిల్లీ విమానాశ్రయంలో సత్కరించారు. గవర్నర్‌గా నియమితులు కావడంపై వ్యక్తం చేశారు. కాగా, చైనా నుంచి మన దేశానికి గతేడాది డీఏపీ ఎరువుల దిగుమతి తగ్గిందని కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ సహాయ మంత్రి అనుప్రియ పటేల్ వెల్లడించారు. లోక్‌సభలో శుక్రవారం ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు ఆమె సమాధానమిస్తూ 2023-24లో దిగుమతులు 22.28లక్షల మెట్రిక్ టన్నులు ఉండగా, 2024-25 మధ్య కాలంలో కేవలం 8.47లక్షల మెట్రిక్ టన్నులకు తగ్గిందని వివరించారు. ప్రస్తుత సంవత్సరం 0.97మెట్రిక్ టన్నుల డీఏపీ దిగుమతి అయిందని తెలిపారు.

అధ్యాపకురాలికి డాక్టరేట్

నెల్లూరు(విద్య), ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ సెల్‌లో పనిచేస్తున్న అధ్యాపకురాలు కూనపరెడ్డి పద్మావతి నాగేశ్వరమ్మ డాక్టరేట్ అందుకున్నారు. శుక్రవారం కళాశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ దత్తాత్రేయశర్మ మాట్లాడుతూ స్టీల్ ఇండస్ట్రీస్‌లో ఉద్యోగుల ఉత్పాదకతపై శిక్షణ కార్యక్రమాల ప్రభావం, రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ విశాఖపట్నంలో ఒక కేస్ స్టడీ అనే శీర్షికపై పరిశోధనకు పద్మావతికి కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పీహెచ్‌డీ ప్రదానం చేసిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జీ శ్రీనివాసులురెడ్డి, ప్లానింగ్, డెవలప్‌మెంట్ డీన్ డాక్టర్ విష్వక్సేనరెడ్డి, ఏజీఎం శ్రీధర్, ప్లేస్‌మెంట్ సెల్ ఆఫీసర్ సందీప్‌రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రంలో వడ్డెర్లకు రక్షణ కరువు

● వడ్డెర సంఘం

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయాకర్

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా వడ్డెర కులస్తులకు రక్షణ కరువైందని వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుంజి దయాకర్ ఆరోపించారు. శుక్రవారం నగరంలోని భవన నిర్మాణ కార్మిక సంఘం భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి అనంతపురం జిల్లా గుండ్లపల్లి పంచాయతీలో వల్లెను నవీన్ అనే వ్యక్తిపై పోలీసులు అక్రమ కేసు బనాయించి కొట్టారని చెప్పారు. దీంతో మనస్థాపం చెందిన నవీన్ ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. ఇందుకు కారకుడైన ఎస్‌ఐపై కేసు నమోదు చేయాలని, నవీన్ కుటుంబానికి రూ. 50 లక్షల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, బెల్లంకొండ బాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సప్త మోక్ష క్షేత్ర యాత్ర

● సెప్టెంబరు 9 నుంచి ప్రారంభం

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : రాబోయే మహాలయ పక్షాల్లో ఆధ్యాత్మిక యాత్రకు శ్రీకారం చుట్టామని ఇండియన్ రైల్వేస్ సౌత్ స్టార్ రైల్ అండ్ టూర్ టైమ్స్ డైరెక్టర్ విఘ్నేష్ తెలిపారు. ఆయన శుక్రవారం నెల్లూరు ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. మహాలయ పక్షలో సప్త మోక్ష క్షేత్ర యాత్ర సెప్టెంబరు 9న ప్రారంభమవుతుందన్నారు. గూడూరు, నెల్లూరులో యాత్రికులు రైలు ఎక్కే వీలుందన్నారు. 15 రోజులు సాగే ఈ యాత్రలో ఉజ్జయిని, ఓంకారేశ్వర్, ద్వారక, సిద్ధపూర్, మధుర, అయోధ్య, ప్రయాగరాజ్, వారాణసి, గయా వంటి పవిత్ర క్షేత్రాలను దర్శించుకోవచ్చని తెలిపారు. టికెట్ కోసం 93550 21516 నెంబరును సంప్రదించాలని కోరారు. విలేకరుల సమావేశంలో టూర్ టైమ్స్ జనరల్ మేనేజర్ సంతోష్ పాల్గొన్నారు.

పెనుబర్తిలో రెవెన్యూ సదస్సు

నెల్లూరు రూరల్, ఆగస్టు 1,(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెనుబర్తి, కలివెలపాళెంలో అధికారులు శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దారు కృష్ణప్రసాద్, ఎంపీపీ విజయకుమార్ మాట్లాడుతూ రెవెన్యూ శాఖకు సంబంధించిన సమస్యలను లిఖిత పూర్వకంగా తెలియపరిస్తే పరిష్కారం చూపుతామని చెప్పారు. నాణ్యమైన రికార్డులను తయారు చేసేందుకు రైతులంతా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీటీ నాజర్, వీఆర్వోలు పాల్గొన్నారు.

దర్గాల్లో అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు

● వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అజీజ్

ఏఎస్ పేట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): దర్గాలలో అవినీతి, అక్రమాలు చేస్తే సహించమని రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన స్థానిక ఖాజానాయబ్ దర్గాను సందర్శించారు. దర్గాలో స్వామి, అమ్మవార్ల సమాధులపై పూలు, గలేఫాలు కప్పి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం దర్గా రికార్డులను పరిశీలించి అవక తవకలు గుర్తించారు. దర్గాలలో అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సిబ్బందిని హెచ్చరించారు. అనంతరం అన్న దాన సత్రం పరిశీలించి భక్తు లకు నాణ్యమైన ఆహారం అందించాలని, దర్గా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర మైనార్టీ ప్రధాన కార్యదర్శి జాఫర్, ఎస్‌ఐ సైదులు పాల్గొన్నారు.

అధరహో!!

● మండుతున్న కూరగాయల రేట్లు ● ఘాటెక్కిన మిర్చి ● గత నెలకన్నా భారీగా పెరుగుదల

నెల్లూరు(వ్యవసాయం), ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): కూరగాయల ధరలు సామాన్యులు బెదరగొడుతున్నాయి. రూ.500 తీసుకుని మార్కెట్‌కెళితే కనీసం సంచి నిండని పరిస్థితి. గడిచిన నెలరోజుల్లో కూరగాయల ధరలు పరిశీలిస్తే సగటున కిలోకు రూ.20 నుంచి రూ.40 వరకు పెరిగాయి. పచ్చి మిర్చి మరింత ఘాటెక్కింది. గత నెలరోజుల్లో కిలో ధర దాదాపు రూ.100ను దాటేసింది. ప్రస్తుతం మార్కెట్ ధర పట్టిక ప్రకారం రూ.80గా ఉన్నప్పటికీ అరకిలో రూ.50 చొప్పున విక్రయిస్తున్నారు. ఓవైపు పంటల దిగుబడి తగ్గిపోవడం, మరోవైపు బయటి మార్కెట్ల నుంచి దిగుమతి చేసుకోవాల్సి రావడంతో ధరలు పెరుగుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో సామాన్య, మధ్యతరగతి ప్రజలపై అదనపు భారం పడుతోంది. ఇప్పటికే పెరిగిపోతున్న నిత్యావసర ధరలతో ఇబ్బంది పడుతుండగా తాజాగా కూరగాయల ధరలు కూడా పెరగడం వారికి శరాఘాతంగా మారుతోంది. ముఖ్యంగా పల్లెల్లో ఉపాధిలేక నగరానికొచ్చి చిన్న చిన్న పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న కుటుంబాలు పెరిగిన ధరలతో అల్లాడిపోతున్నాయి. కాగా, మరో రెండు, మూడు నెలలు కూరగాయల ధరలు ఎక్కువగానే ఉంటాయని కొందరు వ్యాపారులు చెబుతున్నారు.

● ఒక్కో సమయంలో ఒక్కో రేటు

నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి కూరగాయల మార్కెట్‌లో ధరలు ఒకే రోజున ఒక్కో సమయంలో ఒక్కో విధంగా ఉంటున్నాయి. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం ధరలు వేర్వేరుగా ఉండటం గమనార్హం. అంతే కాక మార్కెట్ కమిటీ ప్రకటించిన ధరలకంటే వ్యాపారులు కిలో రూ.10 నుంచి రూ.20ల వరకు పెంచి అమ్మకాలు సాగిస్తున్నారు. దీనిపై మార్కెటింగ్‌శాఖ అధికారులు దృష్టి సారించాలని వినియోగదారులు కోరుకుంటున్నారు.



కూరగాయల ధరల పెరుగుదల రూ.ల్లో

రకం	గతనెల	ప్రస్తుతం
మిర్చి	40	100
టమోటా	10	50
బీన్స్	50	90
వంకాయలు	40	60
క్యారెట్	40	60
అల్లం	50	85
కాకరకాయ	35	50
చామగడ్డ	35	50
పందిరి చిక్కుళ్లు	40	65
గోరు చిక్కుళ్లు	20	40
కందగడ్డ	50	90
బెండకాయలు	20	50
క్యాలీఫ్లవర్	20	40
బీట్‌రూట్	20	40
దొండకాయలు	20	40
ముల్లంగి	20	40
బీరకాయలు	30	50



విశేష అలంకరణలో ఇరుకళల పరమేశ్వరి అమ్మవారు

కుచోన్నతే కుంకుమ రాగశోణి..!

● భక్తిశ్రద్ధలతో లక్ష కుంకుమార్చన

● ఆలయాల్లో శ్రావణ శుక్రవార పూజలు

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : శ్రావణ మాసం రెండవ శుక్రవారం సందర్భంగా నగర వాసులు ఇళ్లలో, ఆలయాల్లో ప్రత్యేక పూజలన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

● రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో లక్ష కుంకుమార్చన వైభవంగా జరిగింది. ఉదయం మూలవర్లకు అభిషేకాలు, నవావరణ పూజలు జరిగాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం అమ్మవారికి పూలంగిసేవ, కుంభ హారతులు, రాత్రి పల్లకీసేవ జరిగాయి. ఆలయ సహా య కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి పర్యవేక్షించారు. మహాకుంభాభిషేక అనంతరం తొలి శుక్రవారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

● స్టోన్‌హౌస్‌పేట కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి విశేష అభిషేకాలు, పూజలు జరిగాయి. నవబాలదుర్గకు సామూహిక కుంకుమా ర్చన జరిగింది. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం పూలంగిసేవ, సౌభాగ్య ద్రవ్య వితరణ జరిగాయి. ఆలయ పాలక మండలి పర్యవేక్షించింది.

● గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి ఆలయంలో ఉదయం అభిషేకాలు, విశేష పూజలు, సాయంత్రం పూలంగిసేవ, సామూహిక కుంకుమ పూజ, చందనాలంకారం, పల్లకీసేవ జరిగాయి. ఈవో గిరికృష్ణ, ఉత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

● మూలాపేట శ్రీకృష్ణధర్మరాజులస్వామి ఆలయంలో ఉదయం అభిషేకాలు, రాత్రి పూలంగిసేవ, పల్లకీ ఉత్సవం జరిగాయి.

● మూలస్థానేశ్వరాలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా రాత్రి భువనేశ్వరి అమ్మవారికి పల్లకీసేవ నేత్రపర్వంగా జరిగింది. ఆలయ ఈవో వెంకటశ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

భువనేశ్వరీ దేవి



సీజనల్ వ్యాధులపై అవగాహన పెంచుకోవాలి

● మలేరియా విభాగం జిల్లా అదనపు అధికారి నాగార్జునరావు

నెల్లూరు (వైద్యం) ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధులపై అందరూ అవగాహన పెంచుకోవాలని మలేరియా విభాగం జిల్లా అదనపు అధికారి నాగార్జునరావు సూచించారు. శుక్రవారం ఆకుతోట పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలోని శ్రామికనగర్, వడ్డీపాళెంలో కీటక జనిత వ్యాధులపై ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి నీటి నిల్వలను పరిశీలించారు. ఎక్కువగా నిల్వ ఉన్న నీటిని ఒలకబోయించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మలేరియా అధి కారులు శాంసన్‌బాబు, రామారావు, ఆరోగ్య సహాయకులు మస్తాన్, సుజాత తదితరులు పాల్గొన్నారు.



నీటి నిల్వలను ఒలకబోస్తున్న మలేరియా విభాగం సిబ్బంది

అర్హులందరికీ పింఛన్లు అందాలి

● కమిషనర్ నందన్

నెల్లూరు(సిటీ), ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : అర్హత కలిగిన వారందరికీ ఎన్టీ ఆర్ భరోసా పింఛన్లు నూరు శాతం అందచేయాలని కార్పొరేషన్ కమిషనర్ నందన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నగరంలోని 36వ డివిజన్ బ్రహ్మానందపురం, అంబేడ్కర్ నగర్ ప్రాంతాల్లో పింఛన్ల పంపిణీలో ఆయన పాల్గొన్నారు. నిర్ణీత కాల వ్యవధిలో లబ్ధిదారులందరికీ పింఛను అందచేయాలని సూచించారు. ఐవీఆర్ ఫోన్ కాల్స్ ద్వారా అభిప్రాయాలు సేకరించే అవకాశం ఉన్నందున లబ్ధిదారులతో వినయ పూర్వకంగా వ్యవహరించాలన్నారు. అనంతరం రెవెన్యూ, సిటీ ప్లానింగ్ విభాగాలతో తన కార్యాలయంలో సమా వేశం నిర్వహించారు. ఎల్ఆర్ఎస్ పథకాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లా లని సూచించారు. ఆ తర్వాత వెంగళరావునగర్, తాతయ్యబడి పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన సదుపాయం, ఇతర సౌకర్యాల పై ఆరా తీశారు. ఆపై 32వ డివిజన్‌లోని ఎన్‌టీటీ కాలనీలోని సచివాలయాన్ని తనిఖీ చేశారు.



మంచంపట్టిన వృద్ధురాలికి పింఛన్ అందచేస్తున్న కమిషనర్

93.09 శాతం పెన్షన్ల పంపిణీ

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో శుక్రవారం 93.09శాతం సామాజిక పెన్షన్ల పంపిణీ జరిగింది. 306337 పెన్షన్లకుగాను 285163 మందికి అందజేశారు. శనివారం మిగిలిన వారికి ఇస్తారు. జూలైలో రెండు వేల ఏఆర్‌టీ పెన్షన్లు మంజూరుకాగా, వాటి మొత్తాన్ని లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమచేశారు.

వర్ల రామయ్య పుట్టినరోజు వేడుక

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య పుట్టినరోజును నగరంలోని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర నివాసంలో శుక్రవారం నిర్వహించారు. రవిచంద్ర కేక్‌కట్ చేసి అందరికీ పంచారు. పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రామయ్య నాటి వైసీపీ ప్రభుత్వ దౌర్జన్యాలను ఎదుర్కొని టీడీపీ శ్రేణులకు అండగా నిలిచారన్నారు. దళిత, బలహీన వర్గాల్లో పార్టీ బలోపే తానికి కృషి చేశారని చెప్పారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జన్ని రమణయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు జలదంకి సుధాకర్, కనపర్తి గంగాధర్, బుర్ల వెంకటేశ్వర్లుగౌడ్, ఊరందూరు సురేంద్రబాబు, శైలేంద్రబాబు, అమ్ముల్లా, రసూల్, అరవ కిశోర్ తదితరులు పాల్గొన్నారు.



బీద రవిచంద్రకు కేక్ తినిపిస్తున్న జెన్ని రమణయ్య

మాలకొండయ్యకు జనసేన నాయకుల పరామర్శ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జిల్లా పర్యటనలో వైసీపీ శ్రేణుల విధ్వంసంతో చేయి విరిగి చికిత్స పొందుతున్న ఎస్‌బీ హెడ్‌కానిస్టేబుల్ మాలకొండయ్యను శుక్రవారం జనసేన పార్టీ నాయకులు పరామర్శించారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ మాట్లాడుతూ వైసీపీ కార్యకర్తలు రాక్షసంగా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. పోలీసులు ఇచ్చిన నోటీసులను పట్టించుకోకుండా విధ్వంసానికి దిగిన వైసీపీ నాయకులు, కార్యకర్తలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నూనె మల్లికార్జున యాదవ్, పావు జెన్ని చంద్రశేఖర్‌రెడ్డి, కాకు మురళీ రెడ్డి, ప్రశాంత్‌గౌడ్, గుర్రం కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



మాలకొండయ్యను పరామర్శిస్తున్న జనసేన నాయకులు

ప్రసన్న క్షమాపణ చెప్పాలి

● ఏపీ పోలీస్ అధికారుల సంఘం

నెల్లూరు(క్రైం), ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : పోలీసులను కించపరుస్తూ వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రి ప్రసన్నకుమార్‌రెడ్డి పోలీసులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆంధ్రప్రదేశ్ పోలీస్ అధికారుల సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు వై శ్రీహరి ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. పోలీ సులను ఏక వచనంతో సంబోధిస్తూ... ఎస్సై, సీఐ స్థాయి అధికారులను ఆఫ్ట్రాల్‌గా అభివర్ణిస్తూ, అవమానించే విధంగా మాట్లాడటం సరికాదన్నారు. కష్టపడి చదివి, పరీక్షల్లో ప్రతిభ చాటితేనే సీఐ, ఎస్‌ఐ ఉద్యోగాలకు ఎంపి కవుతారని, అంతేతప్ప రాజకీయ పదవుల్లాగ పంచుకోవడానికి అవి చాక్లెట్లు, కేకు ముక్కలు కాదన్న విషయాన్ని ప్రసన్న తెలుసుకోవాలని హితవు పలికారు.

పోలీసు అధికారులకు ఘనంగా వీడ్కోలు

నెల్లూరు(క్రైం), ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : సుదీర్ఘకాలం పోలీసు శాఖలో సేవలందించి ఉద్యోగ విరమణ పొందిన పోలీసు అధికారులకు శుక్రవారం ఘనంగా వీడ్కోలు పలికారు. నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో ఈ కార్యక్రమం జరిగింది. ఏఏవో ఎస్‌కే ఖతీజా బేగం, ఎస్‌ఐలు వీసీ సుబ్రహ్మణ్యం, జీపీపీ రామరాజు, డీ హరేంద్రబాబు, పీ జనార్దన్ శ్రీనివాస్, ఏఆర్ ఎస్‌ఐలు వీ శ్రీహరి, ఎస్‌కే షౌకత్‌బాషా, సీ చంద్రశేఖర్‌రెడ్డిని అధికా రులు సత్కరించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ సీహెచ్ సౌజన్య మాట్లాడు తూ ఇతర ప్రభుత్వ శాఖల కంటే పోలీసు శాఖలో పనిచేయడం ప్రత్యేకమన్నారు. శేష జీవితం సంతోషంగా గడపాలని, ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు సింధుప్రియ, ఘట్టమనేని శ్రీనివాస రావు, శ్రీనివాసరావు, చంద్రమోహన్, ఏవో చంద్రమౌళి, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగ విరమణ పొందిన పోలీసు అధికారులతో ఏఎస్పీ, డీఎస్పీలు, అధికారులు

తల్లిపాలే బిడ్డకు తొలి టీకా

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : తల్లి ముర్రుపాలే బిడ్డకు తొలి టీకా అని నెల్లూరు అర్బన్ సీడీపీవో అరుణ అన్నారు. శుక్రవారం నగరంలోని నీలగిరి సంఘం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవ సభ జరిగింది. ఆమె మాట్లాడుతూ బిడ్డపుట్టిన గంటలోపే తల్లి పాలను తాగించాలని చెప్పారు. తల్లి పాలతో కలిగే లాభాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాజేశ్వరి, డీపీఎంవో డాక్టర్ రమేష్, డీ వెంకటేశ్వర్లు, బర్నాబాస్, మునికుమార్ తదితరులు పాల్గొన్నారు.



తల్లిపాల వారోత్సవంలో మాట్లాడుతున్న అర్బన్ సీడీపీవో అరుణ

'నారాయణ'లో వారోత్సవాలు

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని నారాయణ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు ఘనంగా జరిగాయి. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మల్లి దొరసానమ్మ మాట్లాడుతూ వాతావరణ మార్పుల కారణంగా వచ్చే జబ్బులను తట్టుకునే శక్తి తల్లిపాలకు ఉందన్నారు. తల్లిపాలు ఇవ్వటం వల్ల అందం తగ్గిపోతుం దనేది అపోహ అని తెలిపారు. చిన్నపిల్లల విభాగాధిపతి డాక్టర్ సాంబశివా రెడ్డి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ్‌కాంత్ మాట్లాడుతూ పిల్లలకు వాంతులు, విరేచనాలు అవుతున్నాయన్న చిన్న చిన్న కారణాలతో తల్లులు బిడ్డకు పాలివ్వటం మానకూడదని తెలి పారు. ఈ కార్యక్రమంలో ఆసు పత్రి అసిస్టెంట్ మెడికల్ సూప రింటెండెంట్ డాక్టర్ సతీష్, ఆపరేషన్స్ ఏజీఎం డాక్టర్ మంజుప్రభ, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ కార్తీక్, ఏజీ ఎం శేఖర్‌రెడ్డి, నర్సింగ్ సూపరింటెండెంట్ కాంత తదితరులు పాల్గొన్నారు.



నారాయణ ఆసుపత్రిలో జరిగిన కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది

వారోత్సవంలో అర్బన్ సీడీపీవో అరుణ

డబ్బాపాలొద్దు.. తల్లిపాలే ముద్దు!

నెల్లూరు రూరల్(ఆంధ్రజ్యోతి) : చిన్నారులకు తల్లిపాలే శ్రేష్ఠమని, డబ్బాపాలు వాడొద్దని ఐసీడీఎస్ నవాబుపేట సెక్టార్ సూపర్‌వైజర్ శకుంతల పిలుపునిచ్చారు. రూరల్లోని పెద్దచెరుకూరు-3 అంగన్‌వాడీ కేంద్రంలో వారోత్సవాలను శుక్రవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బిడ్డ పుట్టిన ఒక గంటలోపు ముర్రుపాలు తాగించడం వల్ల జీవితకాలానికి సరిపోయే వ్యాధి నిరోధక శక్తి లభిస్తుందని చెప్పారు. తల్లిపాలు ఇవ్వడం వల్ల రొమ్ము క్యాన్సర్, అండాశయ వ్యాధులను అధిగమించ వచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎం ఎస్‌కే శ్రీలేఖ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల విద్యార్థులకు రక్త పరీక్షలు

నెల్లూరు(విద్య), ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని చిన్న బాలయ్యనగర్ మునిసిపల్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులు, ఎన్‌సీసీ కేడెట్స్‌కు శుక్రవారం రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో రక్తపరీక్షలు, గ్రూపింగ్ నిర్వహించారు. ఎన్‌సీసీ చీఫ్ ఆఫీసర్ కే బాలబ్రహ్మాచారి మాట్లాడుతూ విద్యార్థులకు రక్తదానం ప్రాముఖ్యతను తెలియచేసి కార్డులు అందచేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ మోటివేటర్ మధు, పాఠశాల సిబ్బంది కమలమ్మ, నాగేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.



రక్త పరీక్షలు చేయించుకుంటున్న విద్యార్థులు

ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణకు సంతాపం

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో తులనాత్మక అధ్యయన వైస్ చాన్సలర్ గంగిశెట్టి లక్ష్మీనారాయణ మృతికి నెల్లూరు కవులు ఓ ప్రకటనలో సంతాపం తెలిపారు. తెలుగు, కన్నడ, ఇంగ్లీషు భాషల్లో నిష్ణాతుడైన ఆయన మృతి భాషా సాహిత్యానికి తీరని లోటని అరసం జిల్లా అధ్యక్షుడు గంగిశెట్టి శివకుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పెరుగు రామకృష్ణ పేర్కొన్నారు.

కానిస్టేబుల్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు

నెల్లూరు(విద్య), ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : ఏపీ పోలీస్ కానిస్టేబుల్ మెయిన్స్ పరీక్షల్లో నగరంలోని శ్రీహర్ష కోచింగ్ సెంటర్ ఉత్తమ ఫలితాలు సాధించినట్లు ఆ సంస్థ డైరెక్టర్ ఎం హరిబాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తమ వద్ద శిక్షణ పొందిన 45 మందిలో 20 మంది మంచి ఫలితాలు సాధించారని తెలిపారు.

జాషువా వీధిగా నామకరణం

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని కూరగాయల మార్కెట్ పక్కన ఉన్న వీధికి ప్రముఖ కవి గుర్రం జాషువా వీధిగా నామకరణం చేస్తూ కార్పొరేషన్ కౌన్సిల్‌లో తీర్మానం చేయడం హర్షణీ యమని గుర్రం జాషువా గ్రంథాలయం కమిటీ కార్య నిర్వాహక అధ్యక్షుడు షేక్ ఖాసీం ఓ ప్రకటనలో అన్నారు. ఆ వీధిలో ఉన్న జాషువా గ్రంథాలయ నిర్మాణాన్ని కూడా త్వరగా పూర్తి చేయాలని కోరారు.



వేసిన ప్యాచ్‌లో లేచిపోయిన తారు



రహదారి అంచుల్లో ఇలా..

ప్యాచ్ వర్క్ ఇలాగేనా!?

మూణ్నెళ్లకే దెబ్బతిన్న దువ్వూరు క్రాస్ రోడ్డు

సంగం మండలం దువ్వూరు క్రాస్ రోడ్డు నుంచి అనసూయనగర్ వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డు ఇది. సుమారు 5 కి.మీ పొడవు ఉంది. 2014-19 టీడీపీ ప్రభుత్వంలో తారు రోడ్డు నిర్మించారు. ఆ తరువాత వైసీపీ హయాంలో ఈ రహదారిపై భారీ వాహనాలతో ఇసుక తరలించడంతో అనతికాలంలోనే దెబ్బతిన్నది. రోడ్డుకు ఇరువైపులా తారులేచిపోయి కుంచించుకుపోయింది. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాల బారీన పడుతున్నాయి. ఏడాది కిందట అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఎఫ్‌డీఆర్ నిధుల కింద సుమారు రూ.10 లక్షలు మంజూరు చేసింది. దువ్వూరు నుంచి అనసూయనగర్ వరకు ప్యాచ్ పనులు చేయాలి. పనులు దక్కించుకున్న ఓ కాంట్రాక్టర్ ఏప్రిల్‌లో మరమ్మతు (ప్యాచ్) పనులు చేశారు. అయితే, రహదారి దెబ్బతిన్న చోట పూర్తిగా తొలగించి నిబంధనల మేరకు మెటల్ వేసి రోలింగ్ చేయాలి. ఆ తరువాత తగిన పరిమాణంలో తారు, 6ఎంఎం మెటల్ మిక్సింగ్ చేసి రోలింగ్ చేయాలి. కానీ కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా పనులు నాసిరకంగా చేసి జేబులు నింపుకున్నాడే విమర్శలు ఉన్నాయి. దీంతో పనులు చేసిన రెండు, మూడు నెలలకే రోడ్డు అంచులు లేచిపోయి అధ్వానంగా మారింది. అధికారుల పర్యవేక్షణ లోపంతోనే పనుల్లో నాణ్యత లోపించినట్లు అనసూయనగర్ వాసులు ఆరోపిస్తున్నారు. క్వాలిటీ కంట్రోల్ అధికారుల తనిఖీ చేసి కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ ఏఈ అవినాష్ మాట్లాడుతూ పనులు జరిగిన సమయంలో తాను లేనని, క్వాలిటీ కంట్రోల్ అధికారులు తనిఖీ చేశాకే బిల్లులు చెల్లించి ఉంటారని చెప్పుకొచ్చారు.

- సంగం (ఆంధ్రజ్యోతి)

అవయవ దానంతో 8 మందికి పునర్జన్మ

● 'జీవన్‌దాన్' రాష్ట్ర చైర్మన్ డాక్టర్ రాంబాబు

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : ఎవరైనా ఒకరు అవయవ దానం చేయడం ద్వారా ఎనిమిది మందికి పునర్జన్మ లభిస్తుందని జీవన్‌దాన్ సంస్థ ఏపీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ రాంబాబు తెలిపారు. శుక్రవారం నెల్లూరులోని ఓ ఫంక్షన్ హాల్లో అవయవ దానంపై అవగాహన సదస్సు జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా అవయవ దానంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. తమ సంస్థలో ఇప్పటికే 4733 మంది రోగులు అవయవ దానం కోసం రిజిస్టర్ చేయించుకున్నారని తెలిపారు. శనివారం నెల్లూరు అపోలో ఆసుపత్రిలో అవగాహన శిబిరం జరుగుతుందన్నారు. ఆదివారం అవయవదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. జీజీహెచ్‌లోనూ ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అపోలో ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీరాం సతీష్, యూనిట్ హెడ్ బాలరాజు, మెడికవర్ ఆసుపత్రి క్లస్టర్ హెడ్ రంజిత్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, కిమ్స్ ఆసుపత్రి సీవోవో డాక్టర్ సతీష్, నారాయణ ఆసుపత్రి ఏజీఎం శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెట్టప్రాంత యువతకు ఉద్యోగాల కల్పనే లక్ష్యం

● రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

ఆత్మకూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : మెట్ట ప్రాంత నిరుద్యోగ యువతకు మంచి భవిష్యత్‌ను అందించి, ఈ ప్రాంత సమగ్ర అభివృద్ధికి బాటలు వేయడమే లక్ష్యంగా ఆత్మకూరులో మెగా జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఆత్మకూరు ఆంధ్రా ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ఉదయం మంత్రి ఆనం, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు గుండ్రా సతీష్‌రెడ్డి, కలెక్టర్ ఆనంద్ జ్యోతి ప్రజ్వలన చేసి మెగా జాబ్ మేళాను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ నిరుద్యోగ యువత కంపెనీల చుట్టూ తిరగడం కాకుండా కంపెనీలే ముందుకొచ్చి ఉద్యోగాలు ఇచ్చేలా ఈ జాబ్‌మేళాకు శ్రీకారం చుట్టామన్నారు. సుమారు 90కిపైగా రాష్ట్ర, జాతీయ స్థాయి కంపెనీలు ఈ మేళాలో పాల్గొంటున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు గుండ్రా సతీష్‌రెడ్డి మాట్లాడుతూ మన ఇంటి ముందుకు నడిచి వచ్చిన ఉద్యోగాలను సద్వినియోగం చేసుకుని మంచి భవిష్యత్ పొందాలని యువతకు పిలుపునిచ్చారు. మెట్టప్రాంతంలోని యువతీ యువకులు ఆంగ్లభాష నైపుణ్యంలో కొద్దిగా వెనుకబడి ఉంటారే గాని ఉద్యోగాల్లో కష్టపడి పనిచేసి తమ సామర్థ్యాలను నిరూపించుకుంటారని పేర్కొన్నారు. ముందుగా కలెక్టర్ ఆనంద్, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్, ఏపీ ఇన్ లాండ్ అథారిటీ చైర్మన్ జడ్ శివప్రసాద్, ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, ఎన్డీసీసీబీ బ్యాంకు చైర్మన్ దనుంజయరెడ్డి, ఆర్డీవో పావని, తహసీల్దారు పద్మజ తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి మెగా జాబ్‌మేళాను ప్రారంభిస్తున్న మంత్రి ఆనం, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సతీష్‌రెడ్డి తదితరులు

● జాబ్‌మేళాకు విశేష స్పందన

మెగా జాబ్‌మేళాకు యువత నుంచి విశేష స్పందన లభించింది. 3వేల మందికిపైగా యువతీ యువకులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. తొలిరోజున 579 మంది అభ్యర్థులకు వివిధ కంపెనీల్లో నియామకపత్రాలను అందజేశారు. శనివారం కూడా ఈ జాబ్‌మేళా జరగనుంది.

రేపు అథ్లెటిక్స్ క్రీడా జట్ల ఎంపిక

నెల్లూరు(విద్య), ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో అండర్-14, 16, 18, 20 బాల, బాలికల జిల్లా జట్ల ఎంపిక నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు కే వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు ఎంపికలు జరుగుతాయని, ఆసక్తి గల క్రీడాకారులు వయసు ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌తో హాజరు కావాలని కోరారు. ఎంపికైన వారు త్వరలో బాపట్లలో జరిగే రాష్ట్ర పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.

రాష్ట్ర ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య), ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అందించే రాష్ట్ర ఉపాధ్యాయ అవార్డులకు అర్హత కలిగిన ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో బాలాజీరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2025 వ సంవత్సరానికి అవార్డు అందుకునేందుకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు 8వతేదీ సాయంత్రం 5 గంటలలోపు వారి ప్రతిపాదనలను సంబంధిత డిప్యూటీ ఈవోలకు అందచేయాలని సూచించారు. వివరాలకు www.deo.nellore.50webs.comను పరిశీలించాలని తెలిపారు.



స్వర్ణగరుడ వాహనంపై పెంచలలోరు

ఘనంగా పెంచలస్వామి నక్షత్ర వేడుకలు

రాపూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పెంచలకోనలోని స్వామివారి జన్మ నక్షత్రం స్వామి నక్షత్రం సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజామున స్వామివారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. చందనాలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం వేద పండితులు శాంతిహోమం, కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. సాయంత్రం బంగారు గరుడ వాహనంపై స్వామివారు మాఢవీధుల్లో విహరించారు. శ్రావణ మాసం రెండవ శుక్రవారం సందర్భంగా ఆదిలక్ష్మీ అమ్మవారికి ప్రాకారోత్సవం, సామూహిక కుంకుమార్చన ఘనంగా నిర్వహించినట్లు అలయ ఉప కమిషనర్ పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

బొప్పాయి ధర పతనం!

● దళారుల దోపిడీ ● ప్రభుత్వం ఆదుకోవాలని రైతుల వేడుకోలు

కలిగిరి, ఆగస్టు 1(ఆంధ్ర జ్యోతి): రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన బొప్పాయి పంటకు గిట్టు బాటు ధర లేక రైతులు దిగాలు చెందుతున్నారు. అతివృష్టి, అనావృష్టి, ప్రకృతివైపరీత్యాల నుంచి కంటికి రెప్పలా కాపాడుకున్న పంటకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించక పోవడం, దళారులు ఇష్టానుసారంగా వ్యహరిస్తూ సిండికేట్‌గా మారడంతో ధరలు పతనమవుతోన్నాయి. పంట సాగు సమయంలో తాామున్నామంటూ భరోసా ఇచ్చే అధికారులు తీరా పంట దిగుబడి వచ్చేసరికి ముఖం చాటేస్తున్నారు. దీంతో పండించిన పంట ఎక్కడ అమ్ముకోవాలో తెలియక దళారుల చేతిలో చిక్కి నష్టపోతున్నారు. కొందరు దళారులు చెప్పే ధరకు అమ్ముకోలేక కడుపుమండి పడిన పంటను నడిబజార్లో రోడ్లపై పోసి తగలబెడుతున్నారు. దీనినిబట్టి చూస్తే రైతు బాధ ఏ స్థాయిలో ఉందే ఇట్టే తెలుస్తోంది. వింజమూరు వ్యవసాయ డివిజన్ పరిధిలో సుమారు 145 ఎకరాల్లో బొప్పాయి సాగు చేస్తున్నారు. ఇక్కడ పండించిన పంట ఢిల్లీ, హర్యానా, బెంగాల్ తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తారు. అయితే రాష్ట్రం నుంచి ఎగుమతులు చేయాలంటే రైతు దళారుల మీదే ఆధార పడవలసి వస్తోంది. దాంతో దళారి చెప్పిన ధరకు అమ్ముకోక తప్పడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం బొప్పాయి సాగు చేస్తున్న రైతులకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసి ధరల స్థిరీకరణకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



కలిగిరి ప్రాంతంలో సాగు చేస్తున్న బొప్పాయి తోట

ధర పడిపోయింది



3.5 ఎకరాల్లో బొప్పాయి సాగు చేశాను. ఎకరం సాగుకి రూ.2 లక్షలకు పైగా పెట్టుబడి పెట్టాను. ఇప్పటి వరకు మూడు కోతలకు కిలో రూ.10కి పైగా ధర అందింది. మార్కెట్ డిమాండ్ లేదంటూ దళారులు ప్రస్తుతం కిలో రూ.5 మాత్రమే చెల్లిస్తామనడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నాం. బొప్పాయి రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి.

- కాకూరు విష్ణువర్ధన్‌రెడ్డి, రైతు, కలిగిరి

మద్దతు ధరకు కృషి చేస్తాం



వింజమూరు డివిజన్ పరిధిలో మే నెల నుంచి బొప్పాయి కోతలు మొదలయ్యాయి. బొప్పాయి సాగు విస్తీర్ణం పెరగడం, మామిడి పండ్లు అందుబాటులో ఉండట వలన బొప్పాయి వినియోగం తగ్గింది. ప్రస్తుతం ఉత్తరభారతదేశంలో వర్షాలు కురుస్తుండడంతో డిమాండ్ తగ్గి ధరలు పతనమయ్యాయి. రైతులు బొప్పాయి పంటను మార్కెట్ యార్డుల్లో అమ్మకోవడానికి ముందుకువస్తే సంబంధిత అధికారులతో మాటాడి మద్దతు ధర అందించడానికి కృషి చేస్తాం.

-షేక్ షాహీల్, ఉద్యానశాఖాధికారి, వింజమూరు డివిజన్

'బ్లాక్'లో యూరియా!

బస్తాకు రూ.65 అదనంగా వసూలు

దోపిడీ చేస్తున్నారని రైతుల గగ్గోలు

పట్టించుకోని వ్యవసాయశాఖ అధికారులు

జలదంకి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్ణయించిన ధరకు విక్రయించాల్సిన యూరియా బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. యూరియా బ్లాక్ మార్కెట్ లో విక్రయించడం లేదని, కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన బస్తా ధర రూ.285కే దొరుకుతోందని జిల్లా వ్యవసాయధికారి (డీఏవో) సత్యవాణి తరచూ సమావే శాల్లో, పత్రిక ప్రకటనలో చెబుతున్నారు. కానీ వాస్తవానికి ప్రైవేటు రైతు డిపోలో ఒక బస్తా రూ.65 అదనంగా వసూలు చేస్తూ రూ.350 విక్రయిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఎవరైనా అదనపు ధర గురించి మాట్లాడితే వారికి యూరియా దొరకడం లేదు. ఈ క్రమంలో ఏ రైతునైనా యూరియా బస్తా ఎంత అని ప్రశ్నిస్తే రూ.350 అని టక్కున చెబుతున్నారు.

● రూ.10కోట్ల దోపిడీ

జిల్లాలో ప్రసుత్తం 5లక్షల ఎకరాలకు పైగా జలాశయాల కింద వరిసాగు జరుగుతోంది. ప్రతి ఎకరానికి 4 బస్తాల యూరియా వినియోగిస్తున్నారు. అమేరకు వ్యవసాయశాఖ కూడా 200 కిలోలు యూరియా ఎకరానికి వినియోగం చాలని పలు సమావేశాలలో వివరిస్తున్నారు. ఇలా 5లక్షల ఎకరాలలో 20లక్షల బస్తాల యూరి యా జిల్లా రైతాంగం వినియోగిస్తోంది. పీఏసీఎస్‌లు, మార్క్‌ఫెడ్‌ల ద్వారా కేవలం 20 శాతం మాత్రమే ప్రభుత్వ ధర రూ.285 కు రైతులకు అందుతోంది. మిగిలిన 80 శాతం రైతు వినియోగించే యూరియా బ్లాక్‌మార్కెట్‌లో రూ.350కు బస్తా కొనుగోలు చేసి రూ.65 అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇలా రైతుల జేబుల్లో నుంచి ఒక్క యూరియా ద్వారానే ఎరువుల వ్యాపారులు సుమారు రూ.10కోట్లకు పైగా దోపిడీకి ఈ ఒక్క సీజన్‌లోనే పాల్పడుతున్నారు. యథేచ్ఛగా అధిక ధరకు యూరియా అమ్మకాలు జరుగుతుంటే జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎంపీ, మంత్రులు ఏం చేస్తున్నట్లు అని జిల్లా రైతాంగం ప్రశ్నిస్తోంది. పలువురు రైతులు యూరియా బ్లాక్‌మార్కెట్‌పై ఎమ్మెల్యేల దృష్టికి, మంత్రుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం శూన్యమని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రతిపక్ష వైసీపీ కూడా యూరియా బ్లాక్‌మార్కెట్‌పై అధికారపక్షాన్ని ప్రశ్నించిన దాఖలాలు లేవు. రైతుసంఘాలు మాత్రం యూరియా అధక ధరలపై ఆందోళన చేస్తున్నా ఫలితం దక్కడం లేదు.



లారీలో నుంచి ఎరువుల బస్తాలు దించుతున్న హమాలీలు



మాట్లాడుతున్న నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి

జగన్ జైలుకెళ్లడం ఖాయం

● నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : లిక్కర్ స్కామ్‌లో మాజీ సీఎం జగన్ త్వరలో జైలుకెళ్లటం ఖాయమని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి జోస్యం చెప్పారు. అవినీతి, అక్రమాలకు పాల్పడిన వారు, తప్పు చేసిన వారికి జైలు జీవితం తప్పదని అన్నారు. నగరంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వంలో కరోనా సమయంలో పేదలకు కూరగాయలు పంచితే అక్రమ కేసులు బనాయించారని చెప్పారు. నెల్లూరు సిటీ తోపాటు కావలి, కందుకూరులో తనపై 64 అక్రమ కేసులు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ ముఖం పెట్టుకుని వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి నెల్లూరు పర్యటనకు వచ్చారని ప్రశ్నించారు. మైనింగ్‌తో దోచుకుని జైలులో ఉన్న కాకాణి గోవర్దన్‌రెడ్డిని పరామర్శించటం సిగ్గుచేటన్నారు. తల్లిని, చెల్లిని వదిలేసిన జగన్‌కు మహిళలంటే గౌరవం లేదని విమర్శించారు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ప్రసన్న కుమార్‌రెడ్డిని పరామర్శించేందుకు జగన్ రావటం దారుణమన్నారు. జిల్లాలోని వైసీపీ నాయకులు గత ప్రభుత్వంలో ఇష్టమొచ్చినట్లు దోచుకున్నారని, చివరకు కరోనా సమయంలో ఇంజక్షన్‌లు సైతం అమ్ముకున్నారని మండిపడ్డారు. జగన్ త్వరలో లిక్కర్‌స్కామ్‌లో జైలు కెళ్లటం ఖాయమని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉచ్చి భువనేశ్వరీ ప్రసాద్, ప్రశాంత్, కువ్వా రఘు బాలాజీ, జహీర్, మొయినుద్దీన్, మహేంద్రరెడ్డి, అంచూరు శ్రీని వాసులు నాయుడు పాల్గొన్నారు.

జగన్ పర్యటనలో మరో కేసు నమోదు

నెల్లూరు (క్రైం), ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్‌రెడ్డి నెల్లూరు పర్యటనకు సంబంధించి శుక్రవారం దర్గామిట్ట పోలీసులు మరో కేసు నమోదు చేశారు. ప్రభుత్వ వైద్య కళాశాల ఉత్తరం వైపు ప్రహరీ గోడ కొంత భాగాన్ని గుర్తుతెలియని వ్యక్తులు కూల్చి వేశారని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు శుక్రవారం దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో పోలీసులు కేసు నమోదు చేసి, సాంకేతికత ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు. కాగా, జగన్ పర్యటనకు సంబంధించి ఇప్పటికే రెండు కేసులు నమోదై ఉన్నాయి.

ఖాకీ ఉద్యోగానందం

కానిస్టేబుల్ పరీక్షల తుది ఫలితాలు విడుదల

పోలీసు శాఖలోకి 160 మంది...

ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన ప్రక్రియ

నియామక ఉత్తర్వు, పోస్టింగే తరువాయి

అభ్యర్థుల్లో వెల్లివిరుస్తున్న ఆనందం

నెల్లూరు (క్రైం), ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ పాలనలో 2022 సంవత్సరంలో పోలీసు శాఖలో కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. అందులో భాగంగా ఉమ్మడి నెల్లూరు జిల్లాకు 160 పోస్టులను కేటాయించింది. 2023 జనవరి 22వ తేది ప్రాథమిక పరీక్ష నిర్వహించగా జిల్లా నుంచి 19,551 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఆ తర్వాత దేహదారుఢ్య పరీక్షల విషయం పట్టించుకోలేదు. దీంతో నియామక ప్రక్రియ సందిగ్ధంలో పడింది. అయితే గతేడాది కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రక్రియను కొనసాగించింది. ప్రాథమిక పరీక్షల్లో అర్హత పొందిన వారికి ఈ ఏడాది జనవరిలో దేహదారుఢ్య పోటీలు నిర్వహించింది. వాటికి 3855 మంది పురుషులు, 835 మంది మహిళలు హాజరయ్యారు. ఆ పరీక్షల్లోనూ అర్హత సాధించిన అభ్యర్థులకు జూన్ 1వ తేదీ మెయిన్స్ పరీక్ష నిర్వహించింది. తుది ఫలితాలను రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత శుక్రవారం విడుదల చేశారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాకు సంబంధించిన 160 మందితో తుది జాబితాను ప్రకటించారు. వీరికి ఇక నియామక ఉత్తర్వులిచ్చి పోస్టింగ్ ఇవ్వడమే మిగిలి ఉంది. కాగా, వైసీపీ ప్రభుత్వంలో మొదలైన ప్రక్రియను కూటమి ప్రభుత్వం పూర్తి చేసినందుకు కానిస్టేబుల్ ఉద్యోగం సాధించిన వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కార్పొరేట్ ఆసుపత్రులు పీ-4 పథకానికి సిద్ధం కావాలి

● ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి

● డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని కార్పొరేట్ ఆసుపత్రుల యాజమాన్యం పీ-4 పథకంలో పేద కుటుంబాలను ఎన్నుకుని బంగారు కుటుంబాలకు మార్గదర్శకులుగా తీర్చిదిద్దాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత పిలుపునిచ్చారు. శుక్రవారం డీఎంహెచ్‌వో చాంబర్‌లో కార్పొరేట్ ఆసుపత్రుల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. నచ్చిన నిరుపేద కుటుంబాన్ని ఎంపిక చేసుకుని పీ-4 విధానంలో ఆయా కుటుంబాలను తీర్చిదిద్దాలని సూచించారు. ఇందులో బలవంతం లేదని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సహకరించాలని, స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని కోరారు. ఎంపిక చేసుకున్న కుటుంబాల వివరాలు ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. నారాయణ ఆసుపత్రి పరిపాలన అధికారి సుధీర్ ముందుకు వచ్చి బంగారు కుటుంబ మార్గదర్శకులను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో ఏడీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి, ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ సుధీర్‌కుమార్, డీఎస్ఎంవో డాక్టర్ సురేంద్ర, డెమో కనకరత్నం, ఎపిడమాలజిస్ట్ డాక్టర్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



ఆసుపత్రుల ప్రతినిధులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో సుజాత

ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా శోభారాణి

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి) : జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ(ఎఫ్ఏసీ)గా శోభారాణిని ప్రభుత్వం నియమించింది. ఆమె సాంఘిక సాంక్షేమ శాఖ జిల్లా డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఇప్పటి వరకు ఎస్సీ కార్పొరేషన్ ఇన్‌చార్జి ఈడీగా ఉన్న శ్రీనివాసులు సెలవుపై వెళ్ల టంతో శోభారాణికి అదనపు బాధ్యతలు అప్పగించారు.

బోధనోపకరణాలతో విద్యాబోధన చేయాలి

ఉదయగిరి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధనోపకరణాలతో విద్యాబోధన చేయాలని ఎంఈవోలు తిప్పిరెడ్డి వెంకటేశ్వర్లు, తోట శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం మండలంలోని గండిపాళెం ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం సంబంధిత రిజిస్టర్లు పరిశీలించి మధ్యాహ్న భోజనాన్ని రుచిచూశారు. ఈకార్యక్రమంలో ప్రధానో పాధ్యాయురాలు షాహిదా, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9424
వెండి కిలో ధర	రూ. 112800
వెండి ఒక గ్రాము	రూ. 115.80

న్యూస్ బాక్స్

గ్రామాల్లో పారిశుధ్యం మెరుగు పరచాలి



గ్రామస్థులతో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో మోహన్‌రావు

సీతారామపురం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యం మెరుగునకు పంచాయతీ కార్యదర్శులు చర్యలు చేపట్టా లని జడ్పీ సీఈవో మోహన్‌రావు సూచించారు. శుక్రవారం ఆయన మండలంలోని గుండుపల్లి ఎస్సీ కాలనీలో పర్యటించారు. గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్యం, వీధిలైట్లు వంటి వాటిపై సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం ఐవీఆర్ కాల్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో సాయి ప్రసాద్, ఈవోపీఆర్డీ రాంనాథరెడ్డి ,సిబ్బంది పాల్గొన్నారు.

అదనపు తరగతి గదుల నిర్మాణ పనుల పరిశీలన

ఉదయగిరి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరుగుతున్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను ఏపీఈడబ్ల్యూఐడీసీ డీఈ సుబ్బారావు, ఏఈ ప్రతాప్‌లు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీఎం ఉష పథకం కింద కళాశాలకు రూ.5 కోట్లు మంజూరయ్యాయన్నారు. అందులో రూ.3.50 కోట్లతో అదనపు తరగతి గదుల నిర్మాణం జరుగుతోందన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించి త్వరితగతిన పనులు పూర్తిచేసేలా చర్యలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణ స్వామి, వైస్ ప్రిన్సిపాల్ ఆకుల నరసింహారెడ్డి, గుత్తేదారులు గడ్డం శ్రీనివాసులు, బొజ్జా శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

కలువాయి ఎంఈవో-1గా పద్మనాభం బాధ్యతల స్వీకరణ

కలువాయి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంఈవో-1గా పి పద్మనాభం శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కుల్లూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పనిచేస్తున్న ఆయనను ఎంఈవో-1 (ఎఫ్ఏసీ)గా నియమించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం పద్మనాభంను ఎంఈవో-2 శేషగిరిరావు, సీఆర్ ఎంటీలు, కార్యాలయ సిబ్బంది సన్మానించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది అంకిత భావంతో పనిచేసి విద్యాశాఖకు మంచి పేరు తీసుకురావాలని ఈ సందర్భంగా పద్మనాభరావు కోరారు.

వసతిగృహాల్లో ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఉదయగిరి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి సహాయ సాంఘీక సంక్షేమ శాఖ కార్యాలయ పరిధిలో సంక్షేమ వసతి గృహాల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏఎస్‌డబ్ల్యూవో రమణారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కార్యాలయ పరిధిలోని ఏడు వసతిగృహాలు ఉన్నాయన్నారు. అందులో 700 మంది విద్యార్థులు చేరాల్సి ఉండగా ఇప్పటివరకు 399 మంది ప్రవేశం పొందారన్నారు. ఇంకా 301 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. 3 నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులు వసతిగృహాల్లో చేరవచ్చన్నారు. ఆసక్తిగల విద్యార్థులు సమీపంలోని వసతిగృహ వార్డెన్లను సంప్రదించాలన్నారు. ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రైతులకు యూరియా పంపిణీ

కలువాయి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుల్లూరు-2 సచివాలయం పరిధిలోని వెంకటరెడ్డిపల్లి, రాజుపాళెం రైతులకు శుక్రవారం వ్యవసాయశాఖ అధికారులు యూరియా పంపిణీచేశారు. యూరియా దొరక్క రైతులు ఇబ్బందులు పడుతుండటంతో వ్యవసాయశాఖ సిబ్బంది ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయి యూరియా అందజేశారు. యూరియాకు ఎలాంటి కొరత లేదని, అయితే రైతులు పైరుకు తగిన మోతాదులో మాత్రమే వాడుకోవాలని వ్యవసాయాధికారి కళారాణి సూచించారు.

సంక్షేమ పథకాల అమలు చంద్రబాబుకే సాధ్యం



ఆత్మకూరులో పింఛను పంపిణీ చేస్తున్న మంత్రి ఆనం పక్కన సతీష్‌రెడ్డి, కలెక్టర్ ఆనంద్ తదితరులు



దుత్తలూరు (ఉదయగిరి): లబ్ధిదారులకు పింఛన్ నగదు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

దుత్తలూరు (ఉదయగిరి), ఆగస్టు 1 (ఆంధ్ర జ్యోతి): అర్హులైన ప్రతీ ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడడం ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడికే సాధ్యమని ఎమ్మె ల్యే కాకర్ల సురేష్ అన్నారు. శుక్రవారం దుత్తలూరు పంచాయతీ పరిధిలోని ఏసీ కాల నీలో ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన స్పౌజ్ పింఛన్ల నగదును టీడీపీ నాయకులతో కలిసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా కాలనీలోని ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేసి ఏడాది పాలనపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్ర మంలో టీడీపీ మండల కన్వీనర్ పేలపూడి వెంకటరత్నం, టీడీపీ నాయకులు ఉండేలా గురవారెడ్డి, కాకర్ల మధు, చీదర్ల మల్లికార్జున, వెంగళరెడ్డి, హనుమంతునాయుడు పాల్గొన్నారు.

●**వరికుంటపాడు (ఉదయగిరి రూరల్):** మండలంలోని కనియంపాడులో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌యాదవ్ అధికారులతో కలిసి శుక్రవారం లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు. గణేశ్వరాపురంలోనూ యువ నాయకుడు పేరం సుధాకర్‌రెడ్డి ఇంటింటికి తిరిగి పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో గోపి శ్రీనివాస్, డిప్యూటీ ఎంపీడీవో ఖలీల్ అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఉదయగిరి మండలం గండిపాళెంలో నాయకులు షేక్ ఇమ్రాన్, చుండ్రు వృథ్వీ పింఛన్లను అందజేశారు.

●**వింజమూరు :** మండలంలోని శంఖవరం గ్రామంలో శుక్రవారం టీడీపీ నాయకులు ఇంటింటికీ తిరిగి పెన్షన్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ టీడీపీ అధ్యక్షుడు భూమిరెడ్డి నరసింహారెడ్డి, చెరువు ప్రెసిడెంట్ భూమిరెడ్డి పెంచలరెడ్డి, పార్టీ నాయకులు పోరెడ్డి హజరత్‌రెడ్డి, భక్తవత్సలంరెడ్డి, మాజీ సర్పంచ్ పోలయ్య పాల్గొన్నారు.

●**సంగం :** మండలంలో సచివాలయ సిబ్బంది ఆగస్టు నెల పింఛన్లను శుక్రవారం ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీడీవో షాలెట్ సిద్ధీపురంలో పరిశీలించారు. అందులో భాగంగా కొత్తగా మంజూరైన స్పౌజ్ పింఛన్‌దారులకు రూ. 4000 పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవోతోపాటు ఏపీఎం రవి శంకర్‌రెడ్డి ఉన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు బాణా శ్రీనివాసులురెడ్డి జండాదిబ్బ, వెంగారెడ్డిపాళెంలో సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి, తలుపూరుపాడులో సంగం నీటి సంఘం అధ్యక్షుడు షేక్ బాబు, పెరమనలో సొసైటీ డైరెక్టర్ పట్టాభిరెడ్డి తదితరులు పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

●**ఉదయగిరి:** మండలంలో 82 మందికి స్పౌజ్ పింఛన్లు మంజూరు చేసినట్లు ఎంపీడీవో అప్పాజీ శుక్రవారం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మండలంలోని దాసరిపల్లి గ్రామంలో మాజీ సర్పంచ్ సయ్యద్ జాఫర్‌మొహిద్దీన్ జమృత్ బేగంతో కలిసి లబ్ధిదారులకు నగదు పంపిణీ చేశారు. అలాగే టీడీపీ మండల కన్వీనర్ చింతనబోయిన బయ్యన్న ఉదయగిరి పట్టణంలో టీడీపీ నాయకులతో కలిసి లబ్ధిదారులకు పింఛన్ల నగదు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొజ్జా నరసింహులు, గూడూరు వెంకటేశ్వరరావు, నవాజ్, నాగయ్య పాల్గొన్నారు.

●**అనంతసాగరం :** మండలంలోని 25 పంచాయతీల్లో 102 కొత్త పింఛన్లు పంపిణీ చేసినట్లు మండల టీడీపీ అధ్యక్షుడు మెట్టుకూరి కృష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం అనంత సాగరంలో పింఛన్ల నగదు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అనంతసాగరం చెరువు నీటి సంఘాధ్య క్షుడు రాపూరి సుబ్బారెడ్డి, మైనారిటీ నాయకుడు ఖాసిం బాషా, పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులు పాల్గొన్నారు.

●**సీతారామపురం :** ఎన్టీఆర్ భరోసా పెన్షన్ కార్యక్రమం శుక్రవారం సచివాలయ సిబ్బందితో కలిసి మండల నాయకులు పంపిణీ చేశారు. మండలంలో నూతనంగా మంజూరైన స్పౌజ్ పెన్షన్లను ఎంపీడీవో సాయి ప్రసాద్, నాయకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ వెంగళశెట్టి వెంకటేశ్వర్లు, మాజీ కన్వీనర్ మొత్తం శెట్టి చెన్నకేశవులు, తమ్మిశెట్టి రమణయ్య, ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ బాబు, జనసేన నాయకుడు భోగినేని కాశీరత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

● ఆత్మకూరులో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదా రు సతీష్‌రెడ్డి, కలెక్టర్ ఆనంద్, ఆర్డీవో పావని పాల్గొని నూతనంగా మంజూరైన స్పౌజ్ పెన్షన్లను లబ్దిదారులకు పంపిణీ చేశారు.

తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానం : సీడీపీవో



ఉదయగిరి: సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో సునీత

ఆత్మకూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పుట్టిన బిడ్డకు తల్లిపాలు అమృతంతో సమానమని సీడీపీవో పి సునీలత తెలిపారు. శుక్రవారం పట్టణంలోని సుందరనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరునెలల వరకు బిడ్డకు తల్లిపాలు ఇవ్వాలన్నారు. బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు సుధాకర్, పార్వతమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కస్తూరి, అంగన్‌వాడీ కార్యకర్తలు పి రాధ, భవాని, సునీత, సుధారాణి, దొరసానమ్మ, ఆశావర్కర్లు, పలువురు గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

●**అనంతసాగం:** మండలంలోని పాతదేవరాయపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం తల్లిపాల ప్రాముఖ్యతపై ఐసీడీఎస్ సీడీపీవో పద్మావతి బాలింతలకు అవగాహన కల్పించారు. పుట్టిన బిడ్డలకు తల్లిపాలు పట్టించడం ద్వారా వ్యాధినిరోధకశక్తి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి శ్రీకాంత్‌రెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

●**ఉదయగిరి:** తల్లిపాలు బిడ్డకు శ్రేష్ఠమని, బిడ్డ పుట్టిన అరగంట లోపు ముర్రుపాలు తాగిస్తే పిల్లల్లో వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందని సీడీపీవో సునీత పేర్కొన్నారు. శుక్రవారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గుడినరవ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాలపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్యఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

●**సీతారామపురం:** తల్లిపాలు బిడ్డకు ఎంతో మేలు చేకూరుస్తాయని ఐసీడీఎస్ సూపర్వైజర్ షేక్ షాను అన్నారు. శుక్రవారం పోలంగారిపల్లి అంగన్వాడి కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆమెతోపాటు అంగన్వాడి కార్యకర్తలు సులోచన, సంపూర్ణ, మహిళా పోలీసు అశ్విని, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



సంతానలక్ష్మి అమ్మవారికి కుంకుమపూజ నిర్వహిస్తున్న భక్తులు

ఉదయగిరి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లోని ఆలయాల్లో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని పార్వతీపరమేశ్వర, సంతానలక్ష్మి ఆలయాల్లో భక్తులు కుంకుమపూజ నిర్వహించారు. అలాగే మండలంలోని గండిపాళెం గంగమ్మ, చవటపల్లి మహాలక్ష్మి ఆలయాల్లో అమ్మవార్లకు సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, విశేష అలంకరణలు చేశారు. భక్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు : సీఐ



రోడ్డుమార్జిన్‌లో ఉన్న సామగ్రిని తీయిస్తున్న సీఐ

ఉదయగిరి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ వెంకటరావు హెచ్చరించారు. శుక్రవారం సిబ్బందితో కలిసి పంచాయతీ బస్టాండ్ సెంటర్‌ను పరిశీలించారు. ట్రాఫిక్‌కు అడ్డంగా పార్కింగ్ చేసిన వాహనాలను గుర్తించి జరిమానా విధించారు. అలాగే పండ్లు, కూరగాయలు, కిరాణా దుకాణదారులు రోడ్డుమార్జిన్‌ను ఆక్రమించి ఏర్పాటుచేసిన సామగ్రిని తొలగించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ అల శ్రీను, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను త్వరగా పూర్తిచేయాలి

సీతారామపురం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): నిర్మాణ దశలో ఉన్న గృహాలను త్వరగా పూర్తిచేయాలని ఎంపీడీవో సాయి ప్రసాద్ లబ్ధిదారులకు సూచించారు. శుక్రవారం మండలంలోని అయ్యవారిపల్లి గ్రామంలో పర్యటించారు. నిర్మాణంలో ఉన్న గృహాలను పరిశీలించి లబ్ధిదారులకు పలు సూచనలు చేశారు. బిల్లుల మంజూరులో ఎలాంటి జాప్యం లేదని, త్వరగా గృహాలు పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దుగ్గయ్య పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి



ఫ్యూజులు సరిచేస్తున్న లైన్‌మెన్ వెంకట్రావు

ఉదయగిరి రూరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం గ్రామ శివారు ప్రాంతంలో ప్రమాదకరంగా మారిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద నెలకొన్న సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని లైన్‌మేన్ వెంకట్రావు అన్నారు. శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు కథనానికి స్పందించిన ట్రాన్స్‌కో ఏఈ ఖుద్దూస్‌బాషా ఆదేశాల మేరకు ఆయన గ్రామానికి చేరుకొని తక్కువ ఎత్తులో ఉన్న తీగలతో పాటు ఫ్యూజులను సరిచేశారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాల మంజూరు



కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

ఉదయగిరి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేయడమే ప్రభుత్వ లక్ష్యమని మండల టీడీపీ కన్వీనర్ చింతనబోయిన బయ్యన్న పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని శుకునాలపల్లి పంచాయతీ పరిధిలో టీడీపీ నాయకులతో కలిసి సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీచేసి ఏడాది పాలనపై ప్రజలకు అవగాహన కల్పించారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సీఎం చంద్రబాబుకే సాధ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాలగిరి మహేష్‌రెడ్డి, బొజ్జా నరసింహులు, నరసయ్య, చెన్నకేశవులు, నాగయ్య, నరసింహులు, వెంకటసుబ్బయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

దర్గాలలో అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు



ఏఎస్‌పేట దర్గా రికార్డులు పరిశీలిస్తున్న రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అజీజ్

ఏఎస్ పేట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): దర్గాలలో అవినీతి, అక్రమాలు చేస్తే సహించమని రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన స్థానిక ఖాజానాయబ్ దర్గాను సందర్శించారు. దర్గాలో స్వామి, అమ్మవార్ల సమాధులపై పూలు, గలేఫాలు కప్పి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం దర్గా రికార్డులను పరిశీలించి అవకతవకలు గుర్తించారు. దర్గాలలో అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సిబ్బందిని హెచ్చరించారు. అనంతరం అన్నదాన సత్రం పరిశీలించి భక్తు లకు నాణ్యమైన ఆహారం అందించాలని, దర్గా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర మైనార్టీ ప్రధాన కార్యదర్శి జాఫర్, ఎస్ఐ సైదులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన



మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేస్తున్న ఉపాధ్యాయులు

సంగం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మధ్యాహ్న భోజన విరామ సమయంలో శుక్రవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మర్రిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజన సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.

17,894 మంది రైతులకు 'అన్నదాత సుఖీభవ'

ఉదయగిరి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకం కింద ఉదయగిరి వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో 17,894 మంది రైతులకు నగదు జమ కానుందని వ్యవసాయ సహాయ సంచాలకులు లక్ష్మీమాధవి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయగిరిలో 4,850 మంది, సీతారామపురంలో 2,958 మంది, దుత్తలూరులో 4,544 మంది, వరికుంటపాడులో 5,542 మంది రైతులు పథకానికి అర్హులన్నారు. వారికి శనివారం నుంచి ఖాతాల్లో పెట్టుబడి సాయం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.7 వేల నగదు జమ చేయనుందన్నారు. కాగా, రైతుసేవా కేంద్రాల్లో అన్నదాత సుఖీభవ పథకం ప్రత్యక్ష ప్రసార కార్యక్రమం రైతులు చూసేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు అపహరణ



బాధితులను విచారిస్తున్న ఎస్ఐ ప్రభాకర్‌రావు

బిట్రగుంట, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం నాగులవరం పంచాయతీ చెన్నారెడ్డిపాలెం పాతూరులో గుర్తు తెలియని వ్యక్తి పట్టపగలు ఓ వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు అపహరించుకెళ్లిన ఘటన శుక్రవారం జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. చెన్నారెడ్డిపాలెం పాతూరు రామాలయం సమీపంలో మునగాల చిన్నపురెడ్డి, భార్య వెంకమ్మ దంపతులు నివాసం ఉంటున్నారు. ఉదయం 11 గంటల సమయంలో మనుమడు, మనుమరాలితో చిన్నపురెడ్డి టీవీ చూస్తుండగా, ఇంటి వరండాలో వెంకమ్మ పడుకుని ఉంది. ఓ గుర్తుతెలియని వ్యక్తి వరండాలోకి వచ్చి తాగడానికి నీరు అడుగుతూ ఇంటి తలుపుకి గెడిపెట్టి వెంకమ్మ మెడలో ఉన్న 3 సవర్ల బంగారు గొలుసు లాక్కుని పరారయ్యాడు. వృద్ధురాలి మనుమడు మునగాల సుందరరామిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ఎన్.ప్రభాకర్‌రావు తెలిపారు.

నాగార్పమ్మ ఆలయంలో చోరీ

కావలిరూరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వైకుంఠపురం పెంకుల ఫ్యాక్టరీ రోడ్డులో ఉన్న నాగార్పమ్మ ఆలయంలో చోరీ జరిగింది. ఆలయ పూజారి చెన్నమ్మ, కమిటీ సభ్యుల కథనం మేరకు.. ఈ గుడిలో అమ్మవారి మూలవిరాట్ వెనుక పుట్ట ఉంది. ఈ పుట్టలోకి పాముల రాకపోకలకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు ఆలయం చుట్టూ గోడలకు బదులు ఇనుప గ్రిల్స్ ఏర్పాటు చేశారు. గురువారం రాత్రి పూజల అనంతరం పూజారి గుడి గ్రిల్స్‌కి తాళాలు వేసుకుని వెళ్లారు. శుక్రవారం ఉదయం యధావిధిగా వచ్చి గుడితాళాలు తీసిచూడగా అమ్మవారి మెడలో మంగళసూత్రం కనిపించలేదు. పరిసరాలు పరిశీలించగా మంగళసూత్రంలోని కొంతభాగం అక్కడే కిందపడి ఉంది. గుర్తుతెలియని దుండగులు గ్రిల్స్ బయటనుంచి పొడవాటి కర్రతో అమ్మవారి మెడలోని మంగళసూత్రాన్ని లాగడంతో అది కొంతభాగం తెగిపోయి కిందపడగా చిక్కిన మిగిలిన భాగాన్ని అపహరించుకెళ్లారు. చోరీకి గురైన బంగారం విలువ సుమారు రూ.40,000 ఉంటుందని భావిస్తున్నారు. కమిటీ సభ్యుడు నాగయ్య ఫిర్యాదు మేరకు రెండవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోవూరులో ఘర్షణ



కోవూరులో ఘర్షణకు దిగిన టీడీపీ, వైసీపీ నాయకులు

కోవూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాటూరురోడ్డులో టీడీపీ- వైసీపీ నాయకుల మధ్య శుక్రవారం ఘర్షణ జరిగింది. ఇరువర్గాలకు చెందిన మహిళా నాయకులు పరస్పరం దాడికి దిగారు. వివరాలిలా ఉన్నాయి. మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి పాటూరు రోడ్డులోని వైసీపీ నాయకుల సమావేశంలో పాల్గొనేందుకు రానున్నారనే సమాచారంతో పెద్దసంఖ్యలో మహిళలు అక్కడికి చేరుకున్నారు. పాటూరురోడ్డుకు ప్రసన్న కుమార్‌రెడ్డి వస్తే ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై చేసిన వ్యక్తిత్వ హననపు మాటలకు నిరసన వ్యక్తం చేయాలనుకున్నారు. ఇంతలో వైసీపీ నాయకులు ప్రదర్శనగా వచ్చిన మహిళల్ని ప్రతిఘటించడంతో ఉద్రిక్తత నెలకొంది. మహిళలపై దాడి చేసేందుకు వైసీపీ మహిళా నాయకులు కొందరు ప్రయత్నించారు. దీంతో రెండు వర్గాల మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వాదం జరిగింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ రంగనాథ్‌గౌడ్ సిబ్బందితో అక్కడికి చేరుకుని ఇరువర్గాలనూ అక్కడినుంచి పంపించేయడంతో వివాదం సద్దుమణిగింది.

బిట్రగుంట రైల్వే సెక్షన్‌లో తనిఖీలు




స్టేషన్ మాస్టర్‌తో మాట్లాడుతున్న ఏడీఆర్ఎం శ్రీనివాసరావు

బిట్రగుంట, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): బిట్రగుంట రైల్వే సెక్షన్ పరిధిలోని పలు కార్యాలయాలను విజయవాడ వోపీ ఏడీఆర్ఎం కే.శ్రీనివాసరావు శుక్రవారం విస్తృత తనిఖీలు చేపట్టారు. విజయవాడ నుంచి ప్రత్యేక రైల్లో బిట్రగుంట రైల్వేస్టేషన్‌కు చేరుకున్న ఆయన ఎస్ఎంఆర్ మురళీధర్, ఐవోడబ్ల్యూ రాజేష్‌లతో కలసి ఎస్ఎం కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. స్టేషన్ ఎదురుగా ఉన్న గార్డెన్ పరిరక్షణ గురించి ఎస్ఎంఆర్‌కు పలు సూచనలు ఇచ్చారు. క్రూకంట్రోల్ లాబీలో డ్రైవర్లు, అసిస్టెంట్ డ్రైవర్లు, గార్డులతో సమావేశం నిర్వహించారు. ఉద్యోగ భద్రత, తీసుకోల్సిన జాగ్రతలపై అవగాహన కల్పించారు. అనంతరం చీఫ్ కంట్రోల్ అధికారి శేషయ్యతో కలిసి డ్రైవర్స్, గార్డుల రన్నింగ్ రూమ్ (విశ్రాంతి భవనం), నూతనంగా నిర్మాణంలో ఉన్న రన్నింగ్ రూమ్‌ను పరిశీలించారు. ఆయనతో పాటు సీనియర్ డీఈఈ సౌత్ కృష్ణ, ఏడీఈఎన్ రాజేంద్రప్రసాద్, పీడబ్ల్యూ రాజకుమార్ తదితరులు ఉన్నారు.

పామాయిల్ పరిశ్రమలో ప్రమాదం

● ముగ్గురికి గాయాలు ● టీడీపీ నేతల పరిశీలన



కంపెనీ ప్రతినిధులతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

ముత్తుకూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : పంటపాలెం సమీపంలోని బుంగే పామాయిల్ పరిశ్రమలో శుక్రవారం జరిగిన ప్రమాదంలో ముగ్గురు కార్మికులు గాయపడ్డారు. రిఫైనరీని శుభ్రం చేస్తుండగా, ప్రమాదవశాత్తు అందులోని కెమికల్ కాళ్లపై పడడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న మండల టీడీపీ అధ్యక్షుడు నీలం మల్లికార్జున యాదవ్ నాయకులతో కలిసి ప్రమాద స్థలానికి చేరుకుని కార్మికులను పరామర్శించారు. అనంతరం బుంగే కంపెనీ ప్రతినిధులను అడిగి ప్రమాద వివరాలను తెలుసుకున్నారు. పొరపాటున కెమికల్ లీక్ కావడంతో ప్రమాదం జరిగిందని కంపెనీ ప్రతినిధులు చెప్పారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని టీడీపీ నాయకులు సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి మాచిరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నాయకులు ఏడుకొండలు, షఫీవుల్లా, ముత్యంగౌడ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	114
స్కిన్ చికెన్	210
స్కిన్‌లెస్	234

కోడిగుడ్ల ధర (100): 475

రేపు కరేడులో సబ్ జూనియర్ జూడో ఎంపికలు

ఉలవపాడు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): జిల్లా జూడో అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి సబ్ జూనియర్ జూడో సెలక్షన్స్ ఆదివారం కరేడు గ్రామంలో నిర్వహించనున్నట్లు జిల్లా జూడో కార్యదర్శి టీ.సురేష్, ఆర్గనైజింగ్ సెక్రటరి జీ.మురళి ఒక ప్రకటనలో తెలిపారు. హైస్కూల్ ఆటస్థలం పక్కనే ఉన్న జీఎం అకాడమీలో ఈ సెలక్షన్స్ జరుగుతాయని తెలిపారు. అండర్-14 విభాగంలో 2011, 2012, 2013 సంవత్సరాలలో పుట్టిన బాలబాలికలు మాత్రమే అర్హులని, ఆసక్తి కలిగిన వారు ఆధార్ కార్డు జెరాక్స్ తీసుకొని రావాలలన్నారు. ఇక్కడ జరిగే సెలక్షన్స్‌లో గెలుపొందిన వారు గుంటూరులో జరగనున్న రాష్ట్ర స్థాయి జూడో పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 8919036160కు సంప్రదించాలని పేర్కొన్నారు.

న్యూస్ బాక్స్

లే అవుట్ల క్రమబద్ధీకరణకు చర్యలు చేపట్టండి

● కావలి కమిషనర్ శ్రావణ్ కుమార్

కావలి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): అక్రమ లే అవుట్లను క్రమబద్ధీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ స్కీంను ప్రవేశపెట్టిందని, దానిని సద్వినియోగం చేసుకుని అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణకు చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్ కుమార్ తెలిపారు. మున్సిపల్ చాంబరులో శుక్రవారం అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణపై సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కావలి పురపాలక సంఘం పరిధిలో ఎన్ని అక్రమ లేఅవుట్లు ఉన్నాయో గుర్తించి వారికి ఎల్‌ఆర్‌ఎస్ స్కీంపై అవగాహన కల్పించాలని సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులను ఆదేశించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోకపోతే ఆ తర్వాత లేఅవుట్ దారులకు వాటిలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి ఎదురయ్యే ఇబ్బందులను గురించి విపులంగా తెలియచేసి ఎల్‌ఆర్‌ఎస్ స్కీం కింద వాటిని క్రమబద్ధీకరణకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారి వివేకానంద్ పాల్గొన్నారు.

పీఎంశ్రీ పథకం అమలుపై సమీక్ష

కలిగిరి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): పీఎంశ్రీ పథకం కింద ఎంపికైన స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌ను రాష్ట్ర పర్యవేక్షకుడు పీ.రమేష్ శుక్రవారం సందర్శించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్‌ల్యాబ్, అటల్‌టింకరింగ్‌ల్యాబ్, లైబ్రరీ, క్రీడామైదానం, టాయిలెట్లు తదితర మౌలిక సదుపాయాలపై సమీక్షించారు. అనంతరం తరగతి గదుల్లో విద్యార్థులతో ముఖాముఖి చర్చలు జరిపి విద్యార్థుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. పాఠశాలలోని బోధనాంశాలు, విద్యా ప్రమాణాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఏ శ్రీను, సిబ్బంది పాల్గొన్నారు.

వర్గీకరణ అమలును నిలిపివేయాలని ఆందోళన

కందుకూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు రద్దు చేయాలని, తెలుగురాష్ట్రాల్లో వర్గీకరణ చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మాలమహానాడు, మాల ఉద్యోగ ఉపాధ్యాయ, విద్యార్థిసంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయాసంఘాల నాయకులు మాట్లాడుతూ దళిత వ్యతిరేకి చంద్రబాబు ఎస్సీ వర్గీకరణ ద్వారా మాల, మాదిగల మధ్య చిచ్చుపెట్టాడన్నారు. చంద్రబాబు, ఆయన శిష్యుడు రేవంత్‌రెడ్డిలు మాదిగ, దాని ఉపకులాలపై అమితమైన ప్రేమ చూయిస్తూ వర్గీకరణ అమలు చేస్తుండటంతో మాలలకు తీరని అన్యాయం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలోని మిగిలిన ఏ రాష్ట్రం వర్గీకరణను అమలు చేయకపోయినప్పటికీ తెలుగురాష్ట్రాల్లో ఉత్సాహంగా అమలు చేస్తుండటం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు ఎల్. బ్రహ్మయ్య, పాలేటి కోటేశ్వరరావు, చార్వాక, గేరా చిరంజీవి, బొట్లగుంట శ్రీనివాసులు, దమ్ము థామస్, కోటయ్య, తదితరులు పాల్గొన్నారు.

తేజస్ నెట్‌వర్క్స్‌లో ఉద్యోగానికి ఎంపిక


విద్యార్థి ప్రసాద్

కందుకూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థి పీ.ప్రసాద్ ప్రముఖ మల్టీనేషన్ కంపెనీ తేజస్ నెట్‌వర్క్స్‌లో రూ.7.5 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగావకాశం పొందాడని కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల విజయ్ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐఐటీలు, ఎన్ఐటీలు లాంటి అగ్రశ్రేణి విద్యాసంస్థలలో చదివిన విద్యార్థులను మాత్రమే ఎంపిక చేసుకునే ఈ సంస్థలో తమ కళాశాల విద్యార్థి ఎంపిక కావడం గర్వకారణంగా ఉందని పేర్కొన్నారు. ప్రసాద్‌ను కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ రవికుమార్, వైస్ ప్రిన్సిపాల్ వి.హరిబాబు, ఆర్‌అండ్‌డి విభాగాధిపతి ఎం.లక్ష్మణరావు, ప్రొఫెసర్లు మీరావలి, కె. సుబ్బారెడ్డి, కె.మోహనరావు, ఎంఎం రాయుడు తదితరులు అభినందించారు.

259 పొగాకు బేళ్లు తిరస్కరణ

కలిగిరి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి గురువారం రైతులు మొత్తం 528 పొగాకు బేళ్లు విక్రయానికి తీసుకొచ్చారు. వేలంలో 11కంపెనీల ప్రతినిధులు పాల్గొని 269 బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-228, ఆర్‌ఆర్-2, సీఆర్-15, జంపింగ్ లాట్స్-14 కారణాలతో 259 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.160, సగటు ధర రూ.225.81గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

● కావలి నియోజకవర్గానికి 666 స్పౌజ్ పింఛన్లు మంజూరు ● ఎమ్మెల్యే వెంకటకృష్ణారెడ్డి ● లింగసముద్రంలో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి


కావలి : పింఛను అందచేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్, తదితరులు

కావలి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికీ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందచేస్తుందని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. కావలి నియోజకవర్గానికి 666 స్పౌజ్ పింఛన్లు మంజూరు అయ్యాయని తెలిపారు. పట్టణంలోని వెంగళరావునగర్ 18వ వార్డులో శుక్రవారం ఆయన ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని స్పౌజ్ పింఛన్లు పంపిణీ చేశారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, వ్యాధిగ్రస్థులకు కూటమి ప్రభుత్వం పింఛను పెద్ద మొత్తంలో పెంచి వారికి అండగా నిలిచిందన్నారు. సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారని చెప్పారు. అర్హులైన వారికి కొత్తగా రేషన్ కార్డులు, పింఛన్లు, నివేశన స్థలాలు, ఇళ్ల మంజూరుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, వాటికి అర్హులైన వారు సచివాలయాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్, మేనేజరు ఫణీంద్ర, టీడీపీ నేతలు కండ్లగుంట మధుబాబునాయుడు, శానం హరి, షేక్ హజరత్, యేగూరి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

● **దగదర్తి(బిట్రగుంట)(ఆంధ్రజ్యోతి):** దగదర్తి ఎస్టీ కాలనీలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగిన నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి పాల్గొని లబ్ధిదారులకు పింఛను నదగు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తాల్లూరు ప్రసాద్‌నాయుడు, టీడీపీ రాష్ట్ర కార్య దర్శి పమిడి రవికుమార్ చౌదరి, మండల అధ్యక్షుడు హనుమంతరావు, ప్రధాన కార్యదర్శి వింజం కొండపనాయుడు, నేతలు వడ్డే శ్రీనాథ్, విజయ్‌కుమార్, రవిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

● బోగోలు మండలంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల కార్యక్రమం ఎంపీడీవో ఆధ్వర్యంలో జరిగింది. బోగోలు, విశ్వనాథరావుపేట పంచాయతీలో జరిగిన కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, టీడీపీ మండల అధ్యక్షుడు మాలేపాటి నాగేశ్వరరావు, టీడీపీ ఇంచార్జి చిలకపాటి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి ఎల్.సుధీర్ బాబు, నేతలు జీ.సంజయ్, అర్పుతరాజ్, రఫీ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆర్థికాభివృద్ధికే సంక్షేమ పథకాలు

● **లింగసముద్రం(ఆంధ్రజ్యోతి):** సంక్షేమ పథకాలతో పేదల ఆర్థికాభివృద్ధి సాధ్యమని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు చెప్పారు. శుక్రవారం లింగసముద్రంలోని సచివాలయం-1 వద్ద ఎంపీడీవో కట్టా శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన నూతనంగా మంజూరైన వితంతు పింఛన్ల లబ్ధిదారులకు నగదు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్ని పథకాలు ప్రాధాన్యత క్రమంలో అమలు చేస్తున్నారన్నారు. రెండు మూడేళ్ల నుంచి భర్తలు చనిపోయిన వితంతు మహిళలకు కొత్తగా రాష్ట్రంలో 1.10 లక్షల మందికి పింఛన్లు మంజూరు చేశారన్నారు. శనివారం అన్నదాత సుఖీభవ పథకం అమలు జరుగుతుందని చెప్పారు. ఓ వైపు రాష్ట్రం సంక్షేమం, అభివృద్ధిలో దూసుకుపోతుంటే వైసీపీ నాయకులు ప్రభుత్వంపై అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిని అభ్యంతరకర భాషలో దూషించిన మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డిని మాజీ సీఎం జగన్ పరామర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. అనంతరం స్థానిక ఎస్టీ కాలనీలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పూరిమిట్ల గురునాథం, నాయకులు అడపా రంగయ్య, గాలంకి ప్రసాద్, కిలారి కొండయ్య, వీ.మాల్యాద్రి, జంపాల శివప్రసాద్, అడపా నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.


లింగసముద్రం : వితంతువుకు పింఛను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

● **వలేటివారిపాలెం :** మండలంలోని కూనిపాలెం, అంకభూపాలపురం గ్రామాల్లో వితంతులకు నూతనంగా మంజూరైన వితంతు పింఛన్లను సర్పంచు రాజారమేష్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మురళి, టీడీపీ నాయకులు అనుమోల సుధాకర్, ప్రగడ శ్రీనివాసులు, చెంచు శ్రీనివాసులు, ప్రగడ మోహన్‌రావు, బక్కమంతుల మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.

● **కొండాపురం :** మండలంలో 91 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయినట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో శేషసాయి తెలిపారు. నూతనంగా మంజూరైన స్పౌజ్ పింఛన్లతో కలిపి మొత్తం 5369 పింఛన్లు ఉండగా 4890 పింఛన్లను లబ్ధిదారులకు అందచేశారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచు మాచర్ల, టీడీపీ నాయకులు పోలినేని చంద్రబాబునాయుడు, పీ.రమేష్, దామా మహేశ్వరరావు, కుంకు మోహనరావు, యారవ క్రిష్ణయ్య, జాగర్లమూడి శ్రీను, మామిళ్లపల్లి వెంకట రమణయ్య, సచివాలయ పిబ్బంది పాల్గొన్నారు.

● **జలదంకి :** కొత్తగా మంజూరైన స్పౌజ్ పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు పీ.మధుమోహన్‌రెడ్డి, ఉదయగిరి నియోజకవర్గ తెలుగురైతు అధ్యక్షుడు పూనూరు భాస్కర్‌రెడ్డి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వంటే రు జయచంద్రారెడ్డి, తెలుగుయువత మండల అధ్యక్షుడు మునగాల తిరుమలరెడ్డి, కరియావుల అప్పలయ్యనాయు డు, వీఆర్వేలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రాత్రివేళ అక్రమంగా మట్టి తరలింపు


లింగసముద్రం కొత్త చెరువులోని మట్టిని రాత్రివేళ తరలిస్తున్న ట్రాక్టర్


లింగసముద్రం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి) : లింగసముద్రం కొత్త చెరువు నుంచి రాత్రివేళ అక్రమంగా మట్టి తరలిస్తున్నారు. పగలు ఈ చెరువు నుంచి మట్టిని తరలిస్తే అధికారులు పట్టుకుంటారనే కారణంతో కొందరు వ్యక్తులు శుక్రవారం రాత్రి 7 గంటల నుంచి ఎక్స్‌కవేటర్లతో తవ్వి సుమారు 10 ట్రాక్టర్ల ద్వారా లింగసముద్రంలోని ఓ వెంచర్‌కు తరలిస్తున్నారు. గత గురువారం నాడు కొందరు వ్యక్తులు ఇదే చెరువులోని మట్టిని తరలిస్తుండగా మైనర్ ఇరిగేషన్ ఏఈఈ బి మనోహర్‌కు విషయం తెలిసి, అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించడంతో వారు మట్టి తరలింపును ఆపేశారు. దీంతో వీరు మట్టి అక్రమ రవాణాను రాత్రివేళకు మార్చారు. వీరి ధన దాహానికి కొత్త చెరువు గుల్లై పోతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

తహసీల్దారు కార్యాలయంలో వేధిస్తున్న సిబ్బంది కొరత

● గ్రామ సచివాలయాల్లోనూ వీఆర్‌వోలు, సర్వేయర్లు...

లింగసముద్రం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి) : లింగసముద్రం తహసీల్దారు కార్యాలయాన్ని సిబ్బంది కొరత వేధిస్తోంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా మండల సర్వేయరు పోస్టు గత రెండేళ్ల నుంచి ఖాళీగా ఉంది. దీంతో ఉన్నతాధికారులు ఇతర మండలాలకు చెందిన మండల సర్వేయర్లకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించి ఎలాగోలా నెట్టుకొస్తున్నారు. అయితే సుమారు నెల రోజుల క్రితం వరకు ఇన్‌చార్జి మండల సర్వేయరుగా ఉన్న వలేటివారిపాలెం మండల సర్వేయరు గోపిరెడ్డి కూడా అక్కడి నుంచి బదిలీ అయ్యారు. దీంతో నెల రోజుల నుంచి మండల సర్వేయరు ఇన్‌చార్జి కూడా లేక ఆ పోస్టు కూడా ఖాళీగా ఉంది. ఇక కార్యాలయంలోని డిప్యూటీ తహసీల్దారు కే.శ్రీనివాసులు రెండు నెలల క్రితం బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఎవరిని నియమించలేదు. దీంతో డీటీ పోస్టు కూడా ఖాళీగా ఉంది. ప్రస్తుతం కార్యాలయంలో తహసీల్దారు, ఆర్ఐ, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్, అటెండరు విధులు నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉండగా మండలంలోని 13 గ్రామ సచివాలయాల్లో కూడా వీఆర్‌వోలు, సర్వేయరు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇటీవల జరిగిన సచివాలయ ఉద్యోగుల బదిలీల్లో 13 సచివాలయాల్లో 10 మంది వీఆర్‌వోలు ఉండగా, వారిలో ముగ్గురు బదిలీపై వెళ్లిపోయారు. 10 మంది సర్వేయర్లుండగా 8 మంది బదిలీ అయ్యారు. అయితే మండలంలో జరుగుతున్న రీ సర్వే కారణంగా వారు ఇంకా రిలీవ్ కాలేదు. వారు కూడా రెండు రోజుల్లో రిలీవ్ అవుతారని తెలిసింది. బదిలీ అయిన వారి స్థానంలో ఇంకా ఎవరూ రాలేదు.ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు పక్కనే చెత్త!


రోడ్డు పక్కన వేసిన చెత్తలో పందులు

వలేటివారిపాలెం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదురుగా రోడ్డు పక్కనే వ్యాపారులు వ్యర్థాలు వేస్తున్నారు. దీంతో అటువైపు వెళ్లే ప్రభుత్వ అధికారులు, వైద్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజలు దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అన్ని శాఖల అధికారులు తమ కార్యాలయాలకు అటు వైపే వెళ్లాలి. అయినప్పటికీ ఎవరూ పట్టించుకోడంలేదు. రోడ్డు పక్కన పడేసిన వ్యర్థాల్లోని కుళ్లిన ఆహార పదార్థాలను పందులు తింటూ రోడ్డుమీదకు తీసుకవస్తూ అపరిశుభ్రం చేస్తున్నాయి. వలేటివారిపాలెంలో చెత్తసంపద కేంద్రం ఉన్నప్పటికీ వ్యర్థాలు ఆ చెత్త సంపద కేంద్రంలో వేయకుండా రోడ్ల పక్కనే వేస్తున్నారు. ఇది వర్షానికి తడిచినప్పుడు మరీ ఎక్కువ దుర్వాసన వెదజల్లుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు పక్కన చెత్తను తొలగింపజేసి మళ్లీ చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

తలసేమియా బాధితులకు అండగా ఉంటాం


తలసేమియా బాధిత చిన్నారులకు పౌష్టికాహారం అందచేస్తున్న తటవర్తి రమేష్

కావలి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): తలసేమియా బాధిత చిన్నారులకు రెడ్‌క్రాస్ అందిస్తున్న సేవలు అమోఘమని, కావలి ఆర్యవైశ్య సంఘం వారికి అండగా ఉంటుందని ఆ సంఘం అధ్యక్షుడు తటవర్తి రమేష్ తెలిపారు. రెడ్‌క్రాస్ పాలకమండలి ఆహ్వానం మేరకు శుక్రవారం ఆయన కావలి రెడ్‌క్రాస్ తలసేమియా డేకేర్ సెంటర్‌ను చెన్నై ఆర్యవైశ్యనాయకులు తంగుటూరి సురేష్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న తలసేమియా బాధిత చిన్నారుల తల్లిదండ్రులతో మాట్లాడి వారి సాధకబాధకాలు తెలుసుకుని పౌష్టికాహారం అందచేశారు. అలాగే ఆ కేంద్రం వైద్యాధికారులు పాముారు శ్రీధర్, టీ.రమ్యలతో మాట్లాడి ఈ కేంద్రంలో చిన్నారులకు అందిస్తున్న వైద్యసేవల గురించి తెలుసుకున్నారు.

● టైల్స్ వ్యాపారి రూ.10 వేల విరాళం

తలసేమియా డేకేర్‌సెంటర్‌లో వైద్యసేవలు అందుకుంటున్న బాధిత చిన్నారుల మందులు, పౌష్టికాహారం కోసం ప్రముఖ టైల్స్ వ్యాపారి కొత్రపాటి దిలీప్ కుమార్ రూ.10 వేలు ఆర్థిక సహాయంను డాక్టర్లకు అందచేశారు. ఈ కార్యక్రమంలో కావలి రెడ్‌క్రాస్ చైర్మన్ డీ.రవిప్రకాష్, వైస్ చైర్మన్ కే.హరినారపరెడ్డి, కోశాధికారి ఆరికట్ల మధుసూదనరావు, పాలక మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు తప్పనిసరిగా అందించాలి

బిట్రగుంట, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): తల్లిపాలు బిడ్డకు తప్పనిసరిగా అందించాలని కోవూరుపల్లి పీహెచ్‌సీ వైద్యుడు ఎస్. రామకృష్ణ తెలిపారు. బోగోలు మండలంలోని యాదవపాలెం, రాజావీధి అంగన్వాడీ కేంద్రాల్లో శుక్రవారం ప్రపంచ తల్లిపాల వారోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు హైమావతి, సుప్రజ, తదితరులు పాల్గొన్నారు.


బిట్రగుంట : తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రామకృష్ణ

● వలేటివారిపాలెం(ఆంధ్రజ్యోతి) : తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత తెలిపారు. మండలంలోని కూనిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లిపాలు వారోత్సవాలు సందర్భంగా శుక్రవారం తల్లిపాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త ఉషారాణి, కళ్యాణి, ఏఎన్ఎం అరుణ, బాలింతలు పాల్గొన్నారు.


వలేటివారిపాలెం : కూనిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ సునీత

ప్రతి గడపకు ప్రభుత్వ సాయం అందాలి

● సోమశిల ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్

అల్లూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ప్రతి గడపకు ప్రభుత్వ సాయం అందడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని సోమశిల ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఇస్కపల్లి పంచాయతీ పరిధిలో ఇంటింటికి తిరిగి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కొక్కటిగా ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ, రాష్ట్రం అభివృద్ధివైపుకు పరుగులు తీయిస్తూ, యువత భవిత కోసం అహర్నిశలు పాటు పడుతున్న ఏకైక ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. ఆయనకు ఎల్లప్పుడూ ప్రజల ఆశీస్సులు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలలో స్థానిక నాయకులు పాపనబోయిన జగన్మోహన్‌రావు, కీర్తి బాబూరావు, పిట్టి సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలు పంపిణీ చేస్తున్న బీద గిరిధర్


మధ్యాహ్న భోజనం వివరాలు తెలుసుకుంటున్న ఆర్ఐవో వరప్రసాదరావు

ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించిన ఆర్ఐవో

ఉలవపాడు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఉలవపాడులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను జిల్లా ఇంటర్‌మీడియ్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి(ఆర్ఐవో) టీ.వరప్రసాదరావు శుక్రవారం సందర్శించారు. కళాశాలలో పారిశుధ్యం, వసతులు, నూతన తరగతి గదుల నిర్మాణం, ప్రభుత్వం అందిస్తున్న మధ్యాహ్నం భోజనం తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. ప్రభుత్వం అన్ని విధాల ప్రైవేటు కళాశాలలకు దీటుగా విద్యార్థులకు వసతులు కల్పిస్తుందని, నీట్, ఎంసెట్ తరహా బోధన అందిస్తుందని, దీనిని సద్వినియోగం చేసుకొని భవిష్యతులో ఉన్నతి స్థాయిలో నిలబడాలని సూచించారు.

వర్ల రామయ్య జన్మదిన వేడుకల్లో ఎస్సీ సెల్ నాయకులు


రామయ్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఎస్సీ సెల్ నాయకులు

కలిగిరి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య పుట్టినరోజు సందర్భంగా గురువారం విజయవాడలోని ఆయన స్వగృహంలో జరిగిన జన్మదిన వేడుకల్లో ఉదయగిరి ఎస్సీ సెల్ నాయకులు పాల్గొని శాలువాకప్పి, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి నియోజకవర్గ టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు స్వర్ణ కొండయ్య, ప్రధాన కార్యదర్శి ఉప్పుటూరి సుధీర్‌బాబు, విజయ్, హజరత్, తిరుపాల్, చిన్నా, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి ఉద్యోగ విరమణ సన్మానం


ఉద్యోగ విరమణ చేసిన ప్రభాకర్‌రావు దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఉలవపాడు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి) : అలగాయపాలెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ చేసిన సుదర్శి ప్రభాకరరావుకు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది, గ్రామస్థులు, పూర్వ విద్యార్థులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు వెంకటరత్నం, పీవీ రమణయ్యలు పాల్గొని ప్రభాకరరావు దంపతులను పూలమాలతో సత్కరించారు. కావలి విద్యాశాఖ అధికారి బండి గోవిందయ్య, మాజీ విద్యాశాఖ అధికారి శివన్నారాయణ, పలు ఉపాధ్యాయ సంఘాలకు చెందిన ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

సీఐ అన్వర్‌బాషా బాధ్యతల స్వీకరణ


సీఐ అన్వర్‌బాషాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్ఐ శివనాగరాజు

కందుకూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): కందుకూరు సీఐగా అన్వర్ బాషా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఐగా ఉన్న కే.వెంకటేశ్వరరావును వీఆర్‌కు బదిలీచేసి ఆయన స్థానంలో అన్వర్ బాషాను నియమించారు. నూతన సీఐను కందుకూరు పట్టణం, రూరల్, ఉలవపాడు ఎస్ఐలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటానని, కందుకూరు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా తగుచర్యలు తీసుకోవటం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

రాళ్లపాడు తాగునీటి పథకం పైపులైన్ లీకేజీ

● కలుషితం అవుతున్న మంచినీరు


స్వర్ణాజిపురం దగ్గర పైప్‌లైన్ నుంచి వృథాగా పోతున్న నీరు

గుడ్లూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాజర్ల, స్వర్ణాజిపురం రహదారికి పక్కగా ఏర్పాటు చేసిన రాళ్లపాడు తాగునీటి పథకం పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడంతో నీరు వృథాగా పోతోంది. గుడ్లూరు మోయిన్ ట్యాంక్ నుంచి విడుదల చేస్తున్న నీరు స్వర్ణాజిపురంకు సమీపంలో వాటర్ లైన్ మళ్లించేందుకు ఏర్పాటు చేసి ఉన్న తొట్టి దగ్గర పైపు లీకేజీ ఏర్పడడంతో నీరు వృథాగా పోతోంది. నెలలు తరబడి ఈ లీకేజీ ఇలాగే ఉన్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. దీంతో తాగునీరు కలుషితం అవుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పైప్‌లైన్ లీకేజీకి మరమ్మతులు చేయించాలని పాజర్ల, స్వర్ణాజిపురం గ్రామస్థులు కోరుతున్నారు.



అభివృద్ధితోనే అడుగులు

నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

ఏడాదిలో 1 ఏం చేశారు?

ఆచితూచి అడుగు వేస్తారు. తడుముకోరు. తడబాటు ఉండదు. క్లుప్తంగా, సూటిగా, స్పష్టంగా మాట్లాడతారు. నగరి ఎమ్మెల్యేగా గెలిచిన తొలి ఏడాదిలోనే తండ్రికి తగ్గ తనయుడు అనిపించుకున్నారు గాలి భానుప్రకాష్. రాజకీయాల్లో ఢక్కామొక్కీలు తిన్న కుటుంబానికి వారసుడిగా తొలి ఓటమిని ఎదుర్కొన్న గాలి భానుప్రకాష్ 2024లో గెలుపును సొంతం చేసుకున్నారు. ఫైర్‌బ్రాండ్ రోజా నోటినీ, ఆమె వర్గం రాజకీయ వ్యూహాలనూ సమర్థంగా ఎదుర్కొంటూ ఆరితేరారు. అలివిగాని మాటలు చెప్పరుగానీ, చెప్పినవన్నీ చేస్తారన్న పేరును మాత్రం జనంలో తెచ్చుకున్నారు. తొలి ఏడాది కాలంలో నగరి ఎమ్మెల్యేగా గాలి భానుప్రకాష్ ఏం సాధించారు? ఇంకా ఏమి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. సీఎం దృష్టికి ఆయన తీసుకువెళ్లిన అంశాలేమిటి.. వీటిపై గాలి భానుప్రకాష్‌తో ఆంధ్రజ్యోతి సంభాషణలోని ముఖ్యాంశాలు...

- 4వ పేజీలో -

రేషన్‌కు 'సర్వర్' కష్టాలు



చంద్రగిరి మండలంలో సర్వర్ పనిచేయక అవస్థలు పడుతున్న కార్డుదారులు

● తొలిరోజు మందకొడిగా సరుకుల పంపిణీ

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రేషన్ సరకుల పంపిణీకి సర్వర్ కష్టాలు వెంటాడాయి. దీంతో తొలిరోజైన శుక్రవారం పంపిణీ మందకొడిగా ప్రారంభమైంది. ఈ నెలలోనూ కందిపప్పు ఇవ్వడం లేదు. ఉచిత బియ్యంతో పాటు అరకిలో చక్కెర పంపిణీ చేశారు. జిల్లాలోని 5,91,259 బియ్యం కార్డులున్నాయి. చాలా చోట్ల సర్వర్ పనిచేయక.. సరుకుల పంపిణీ జరగకపోవడంతో కార్డుదారులు గంటల తరబడి వేచి ఉండి వెనుదిరిగారు. తిరుపతి నగరం బాలాజీకాలనీ, శివజ్యోతినగర్, రైల్వే కాలనీ, సత్యనారాయణపురం, చెన్నారెడ్డికాలనీ, ఎంఆర్‌పల్లి, బాలాయపల్లి, గూడూరు, వాకాడు, వంటి ప్రాంతాల్లో కొందరు డీలర్లు దుకాణాలు తెరచి కాసేపు ఉండిపోయినట్లు సమాచారం. దీంతో ఉదయం దాదాపు 12 దుకాణాలు తెరుచుకోలేదు. ఇవన్నీ మధ్యాహ్నం నుంచి తెరుచుకున్నా కార్డుదారులు డీలర్లు వస్తారో రారో అనే అనుమానంతో శనివారం తీసుకుందాములే అని రానట్లు తెలిసింది. శుక్రవారం సాయంత్రానికి 23.4 శాతం నిత్యాసర వస్తువుల పంపిణీ జరిగిందని డీఎస్‌వో శేషాచలం రాజు చెప్పారు.

లబ్ధిదారు రైతుల ఖాతాల్లో నేడు రూ.7 వేల చొప్పున నగదు జమ

'సూపర్ సిక్స్' హామీల్లో మరొకటి అమల్లోకి

అన్నదాతా సుఖీభవ!





తిరుపతి (ఎంఆర్‌పల్లె), ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీల్లో ఒకటైన 'అన్నదాత సుఖీభవ' పథకం శనివారం అమల్లోకి రానుంది. అన్నదాతలకు ప్రోత్సాహకంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పీఎం కిసాన్ యోజన, అన్నదాత సుఖీభవ పథకాల కింద ఒక్కో రైతుకు రూ.7వేల చొప్పున బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నాయి. 2014-19లో అధికారంలో ఉన్న టీడీపీ 'అన్నదాత సుఖీభవ' కింద రైతులకు పెట్టుబడి సాయం అందించే ఈ పథకాన్ని ప్రారంభించింది. వైసీపీ హయాంలో రైతు భరోసాగా పేరు మార్చి రూ.13,500 (రాష్ట్రం వాటా రూ.7500, కేంద్ర వాటా రూ.6500) మాత్రమే ఇచ్చేవారు. కూటమి ప్రభుత్వం మరో రూ.6,500 పెంచి రూ.20వేలు ఇవ్వనుంది. ఇందులో రాష్ట్ర వాటా రూ.14వేలు కాగా, కేంద్ర వాటా రూ.6వేలు. గతంలో మాదిరిగానే ఏప్రిల్- జూలై వరకు.. ఆగస్టు-నవంబరు వరకు.. డిసెంబరు-మార్చి వరకు.. ఇలా మూడు విడతల్లో ఈ సొమ్ము రైతుల బ్యాంకు ఖాతాల్లో జమకానుంది. రాష్ట్ర ప్రభుత్వం తొలి, మలి విడతల్లో రూ.5వేలు చొప్పున, మూడో విడతలో రూ.4వేలు ఇవ్వనుండగా, కేంద్ర ప్రభుత్వం ఒక్కో విడతలో రూ.2వేల చొప్పున ఇవ్వనుంది. వ్యవసాయ శాఖ గణాంకాల ప్రకారం జిల్లాలో ఈ పథకం కింద 1,54,908మంది రైతుల ఖాతాల్లో శనివారం రూ.7 వేల చొప్పున నగదు జమ కానుంది.

అర్హులైన రైతులు : 1,54,908 మంది

జమయ్యే నగదు : రూ.7వేల చొప్పున రూ.105.18 కోట్లు

రాష్ట్రం వాటా : రూ.5 వేల వంతున రూ.77.45 కోట్లు

కేంద్రం వాటా : రూ.2 వేల చొప్పున రూ.27.73 కోట్లు

అర్హతను తెలుసుకోండిలా..

అన్నదాత సుఖీభవకోసం: రైతులు తమ వాట్సాప్ ద్వారా 95523 00009 (వాట్సాప్ గవర్నెన్స్ మనమిత్ర) నెంబరుకు 'హాయ్' మెసేజ్ పంపాలి. ఆ తర్వాత సేవను ఎంచుకుని.. అన్నదాత సుఖీభవపై క్లిక్ చేయాలి. ఆధార్ నెంబరు నమోదుచేస్తే వివరాలు వస్తాయి. అందులో రైతులు అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులా.. అనర్హులా అనే వివరాలు వస్తాయి. అనర్హులైతే అందుకు కారణమూ ఉంటుంది. రైతుల ఈకేవైసీ పూర్తయిందో లేదో కూడా తెలిసి పోతుంది. అదే విధంగా అధికార పోర్టల్‌లోనూ రైతులు చెక్ చేసుకోవచ్చు.

పీఎం కిసాన్: రైతులకు 20వ విడత పీఎం కిసాన్ కింద రూ.2వేలు రావాలంటే తమ బ్యాంకు ఖాతాకు ఆధార్‌లింక్, ఈకేవైసీ పూర్తి చేసుకోవాలి. దీనికి 'పీఎంకిసాన్.జీవోవి.ఇన్' వెబ్‌సైట్‌లో తెలుసుకోవాలి. అందులో పేరుందో లేదో కూడా రైతులు తెలుసుకోవచ్చు.

అనర్హతకు కారణాలు

● గత ఆర్థిక సంవత్సరంలో ఆదాయపుపన్ను చెల్లించిన వారు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, రూ.10వేలు, అంతకంటే ఎక్కువ పింఛను పొందేవారు.

● కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకుని అమలు చేయడం వల్ల ఒక కుటుంబంలో నలుగురి పేరిట భూమి ఉంటే వారిలో ఒకరికే లబ్ధి కలగనుంది.

● వ్యవసాయ భూమిని ఇంటి స్థలాలుగా మార్చినా, ఆక్వా రైతులకు, వ్యవసాయేతర భూమి కలిగిన వారూ అనర్హులు. పది సెంట్లకంటే తక్కువ భూమి ఉంటే ఈ పథకం వర్తించదు. వెబ్‌ల్యాండ్‌లో పేరు లేకున్నా.. 18 ఏళ్ల కంటే తక్కువ వయసున్నా.. ఈకేవైసీ పూర్తి కాని రైతులూ అనర్హులే. కాగా, విదేశాలు, ఇతర రాష్ట్రాల్లో కొందరు ఉండగా, బయోమెట్రిక్‌లో వేలిముద్రలు పడకపోవడంతో కొందరికి సమస్యగా ఉంది.

అర్హత కోసం చేయండిలా..

వ్యవసాయ భూమి ఉన్నరైతు చనిపోయి ఉంటే వారి ఖాతాను వారసులకు మ్యుటేషన్ చేసుకోవడం. వెబ్ ల్యాండ్‌లో రైతుసాగు భూమికి ఇతర రైతుల ఆధార్ లింక్ అయిన రైతులు, సాగు భూమికి ఆధార్‌లింక్ కానీ రైతులు మండల రెవెన్యూ అధికారులను సంప్రదించాలి. అధికారులు సరిచేశాక ఈ పథకానికి అర్హులవుతారు. ఇక ఎన్‌పీసీఐ ఇన్‌యాక్టివ్ రైతులు సంబంధిత బ్యాంకు అధికారులను సంప్రదించి యాక్టివ్ చేసుకోవాలి. ఎన్‌పీసీఐ మ్యాపింగ్ కాని వారు.. తమ బ్యాంకు ఖాతాను, ఆధార్ నెంబర్‌ను ఎన్‌పీసీఐకి మ్యాపింగ్ చేసుకున్నాక నగదు జమవుతుంది.

- ప్రసాదరావు, జిల్లా వ్యవసాయాధికారి

2,50,829 మందికి పింఛన్ల పంపిణీ

● రాష్ట్రంలో జిల్లాకు రెండో స్థానం



ఇరకం దీవిలో పింఛన్లను పంపిణీ చేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే విజయశ్రీ

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్ల నగదును 2,50,829 మందికి పంపిణీ చేశారు. శుక్రవారం ఉదయం 6.30 గంటలకే సచివాలయ సిబ్బంది ఇంటింటికి వెళ్లి పింఛన్లు అందజేశారు. 2,63,743మందికి గాను రాత్రి వరకు 2,50,829 మందికి రూ.107.26 కోట్ల నగదు అందించారు. తద్వారా పింఛన్ల పంపిణీలో జిల్లాకు రెండో స్థానం దక్కింది. ఇక, ఇంటికి పెద్ద దిక్కు కోల్పోయి వేదన అనుభవిస్తున్న వితంతువులకు కూటమి ప్రభుత్వం అండగా నిలిచింది. కొంతకాలంగా ఊరిస్తున్న భాగస్వామ్య పింఛన్లు శుక్రవారం అందజేశారు. జిల్లాలో 4,800 మందికి భాగస్వామ్య (స్పౌజ్) పింఛన్లకు లబ్ధిపొందారు. తడ మండలం ఇరకం దీవిలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీతో కలిసి కలెక్టర్ వెంకటేశ్వర్ పింఛన్లు పంపిణీ చేశారు. ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. భాగస్వామి పింఛన్ల ప్రక్రియ నిరంతరం సాగుతుందని డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, ఏపీడీ ప్రభావతి తెలిపారు.

560 వాహనాల సైలెన్సర్లు, లౌడ్ హారన్లు ధ్వంసం



తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో అధిక ధ్వని కాలుష్యం కలిగిస్తూ ఇబ్బందికరంగా తయారైన దాదాపు 560 వాహనాల సైలెన్సర్లు, లౌడ్ హారన్లను ధ్వంసం చేశారు. తిరుపతిలోని పోలీసు పరేడ్ మైదానంలో శుక్రవారం ఎస్పీ హర్షవర్ధనరాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఇందులో 60 ద్విచక్రవాహనాల సైలెన్సర్లు, మరో 500 వాహనాల లౌడ్ హారన్లు ఉన్నాయి. 1988లోని సెక్షన్ 190(2) ప్రకారం జరిమానాలు విధించినట్లు ఎస్పీ చెప్పారు. వాహనాలకు అమర్చిన అధిక శబ్దం కలిగించే హారన్లు తొలగించాక ఒరిజనల్ హారన్లు, సైలెన్సర్లు బిగించాకనే వాహనాలను యజమానులకు తిరిగిస్తామన్నారు. శబ్ద కాలుష్యంలేని హారన్లు, సైలెన్సర్లు వాడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణమాచ్చారి, సీఐలు సంజీవ్‌కుమార్, ఎస్ఐలు పురుషోత్తమ రెడ్డి, విజయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

● అదనపు లోడ్లు క్రమబద్ధీకరణకు

డిసెంబరు 31వరకు గడువు

తిరుపతి(ఆటోనగర్), ఆగష్టు1(ఆంధ్రజ్యోతి): సదరన్ డిస్కం పరిధిలోని గృహ విద్యుత్ వినియోగదారులు 50 శాతం రాయితీతో డిసెంబరు 31వ తేదీలోపు అదనపు లోడ్‌ను క్రమబద్ధీకరించుకోవాలని ఆ సంస్థ సీఎండీ కె.సంతోషరావు శుక్రవారం తెలిపారు. రాష్ట్రంలో క్రమబద్ధీ కరణ చేసుకోవలసిన విద్యుత్ వినియోగదారులు ఎక్కువగా ఉండటంతో ఈ గడువును ఏడాది చివరి వరకు పొడిగించి నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి(ఏపీఈఆర్‌సీ) రాయితీ కల్పించి ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. విద్యుత్ వినియోగదారులు నూతనంగా సర్వీసు తీసుకొనే సమయంలో దరఖాస్తులో పొందు పరచిన లోడ్ కంటే అదనంగా వినియోగిస్తున్న వారు పెరిగిన లోడ్‌కు అనుగుణంగా ఒక కిలో వాట్‌కు 50 శాతం రాయితీతో క్రమబద్ధీకరించుకోవాలన్నారు.

తిరుమల చేరుకున్న కేంద్రమంత్రి గడ్కరీ

తిరుమల/ తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ శ్రీవారి దర్శనార్థం శుక్రవారం రాత్రి తిరుమలకు చేరుకున్నారు. తిరుమలలోని వకుళమాత నిలయం గెస్ట్ హౌస్ వద్ద ఆయనకు టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరీ స్వాగతం పలికారు. రాత్రికి తిరుమలలోనే బస చేసి, శనివారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవారిని దర్శించుకోనున్నారు. అనంతరం ఉదయం 10గంటలకు తిరుచానూరు పద్మావతి అమ్మవారిని దర్శించుకుంటారు. 10.30గంలకు తిరుపతిలోని కంచికామకోటిపీఠానికి చేరుకుని అక్కడ జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 12.40గంటలకు రేణిగుంట విమానాశ్రయం నుంచి విజయవాడకు బయలుదేరి వెళ్లనున్నారు.



కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి స్వాగతం పలుకుతున్న టీటీడీ అదనపు ఈవో

ద్రావిడ భాషా సాహిత్య కల్పతరువు!

● అమెరికాలో కన్నుమూసిన ప్రొఫెసర్ గంగిశెట్టి లక్ష్మీనారాయణ

● ఆయన సాహిత్య సేవలు అనన్యం



ద్రావిడ విశ్వవిద్యాలయం మాజీ వీసీ గంగిశెట్టి లక్ష్మీనారాయణ మరణం సాహిత్య వర్గాలను శోకసముద్రంలో ముంచెత్తింది. శుక్రవారం అమెరికాలో తన కుమారుడి ఇంట్లో 78 ఏళ్ల వయసులో ఆయన కన్నుమూశారు. మారుమూల కుప్పంలో మరుగున ఉండిపోయిన ద్రావిడ విశ్వవిద్యాలయాన్ని ఎనలేనంతగా అభివృద్ధి చేసి, ద్రావిడ భాషా రాష్ట్రాల పర్యంతం పేరుగల వర్సిటీగా నిలబెట్టిన ఘనత ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణకే దక్కుతుంది. ద్రావిడ భాషా సాహిత్యాలకు, ద్రావిడ విశ్వవిద్యాలయం అభివృద్ధికి ఆయన చేసిన కృషిని ఈ సందర్భంగా సాహిత్య వర్గాలు మననం చేసుకుంటున్నాయి.

కుప్పం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): తెలుగు వెలుగు ఎన్టీ రామారావు మానస పుత్రికగా ద్రావిడ విశ్వవిద్యాలయం 1997లో స్థాపితమైంది. ఏర్పడనైతే ఏర్పడింది కానీ,అప్పటి విశ్వవిద్యాలయంలో కేవలం హిస్టరీ, ఫిలాసఫీ, జానపద గిరిజన అధ్యయన శాఖలు మాత్రమే ఉండేవి. ఈ దశలో 2005 ఆగస్టు 8న ప్రొఫెసర్ గంగిశెట్టి లక్ష్మీనారాయణ ద్రావిడ విశ్వవిద్యాలయం 3వ ఉప కులపతిగా బాధ్యతలు తీసుకున్నారు. 2008 ఆగస్టు 4న పదవీ విరమణ చేసేదాకా ద్రావిడ వర్సిటీకి స్వర్ణయుగమే నడిచిందని చెప్పవచ్చు. ద్రావిడ భాషలైన తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, తుళులతోపాటు వీటిని అనుసంధానించడానికి ఆంగ్ల అధ్యయన శాఖలను ఆయన ప్రారంభించారు. ఆయా భాషా శాస్త్రాల్లో నిష్ణాతులైన సీనియర్ ఆచార్యులను ఎంపిక చేసి కోరి మరీ నియమించుకున్నారు. మరోవైపు యూనివర్శిటీ తరఫున ప్రసారాంగ పేరుతో ప్రచురణల సంస్థను స్థాపించి ద్రావిడ భాషల్లో ప్రసిద్ధులైన రచయితల రచనలను ముద్రించారు. దీన్ని క్రియాశీలకంగా పని చేయించడానికి 18 పోస్టులు సృష్టించారు. ఆయా భాషల్లో మాత్రమే అయితే కేవలం ఆ భాషా పాఠకులకు మాత్రమే పరిమితం అవుతుందని భావించి, ఒక భాషనుంచి ఇంకో భాషకు అనువాదం చేసేందుకు ప్రసారాంగకు అనుబంధంగా అనుసృజన పేరుతో అనువాద శాఖను నెలకొల్పారు. ఈ శాఖకు ప్రఖ్యాత కవి దివంగత వేగుంట మోహన్ ప్రసాద్‌ను ఒప్పించి డైరెక్టర్‌గా నియమించారు. గంగిశెట్టి లక్ష్మీనారాయణ హయాంలో ప్రసారంగ, దానికి అనుబంధమైన అనుసృజన శాఖలు అనేక ప్రసిద్ధ ప్రచురణలు, అనువాదాలతో ఒక వెలుగు వెలిగాయి. కందుకూరి వీరేశలింగం నవల రాజశేఖర చరిత్రము తెలుగునుంచి వివిధ ద్రావిడ భాషలకు అనువాదం చేయడం అప్పుడే జరిగింది. అంతేకాదు, తెలుగు వాళ్లు గర్వించే రచయిత రాచకొండ విశ్వనాథ శాస్త్రి రచనలు కూడా ద్రావిడ భాషలకు అప్పుడే అనువాదమయ్యాయి. సంజీవదేవ్ హస్త రేఖలు నవలను సైతం వివిధ భాషల్లోకి అనువదించారు. తిరుమల రామచంద్ర ఆత్మకథ 'హంపీ నుంచి హరప్పా దాక' తెలుగు నుంచి ఇతర ద్రావిడ భాషల్లోకి గంగిశెట్టి లక్ష్మీనారాయణే అనువాదం చేయించారు.జ్ఞానపీఠ అవార్డు గ్రహీత అయిన కన్నడ రచయిత ఎస్.ఎల్. భైరప్ప 'పర్వ' నవల సైతం ఆ భాషనుంచి సాటి ద్రావిడ భాషల్లోకి లక్ష్మీనారాయణచే అనువదించబడి ఆయా భాషల్లోని సాహిత్యాభిమానులను అలరించింది. 2004లో ఈ అనువాదానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది.గంగిశెట్టి లక్ష్మీనారాయణ ద్రావిడ భాషా సంస్కృతులకు సంబంధించిన అనేక వ్యాసాలు, రచనలు చేశారు. పలు ద్రావిడ భాషలకు చెందిన ప్రసిద్ధ భాషా శాస్త్రవేత్తలను గుర్తించి, వారికి గౌరవ డాక్టరేట్లను ప్రదానం చేశారు.

ద్రావిడ వర్సిటీకి స్వర్ణయుగం

ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ హయాంలోనే ద్రావిడ విశ్వవిద్యాలయానికి యూజీసీ గుర్తింపు లభించింది. దీంతో యూజీసీ నిధులు మంజూరై వర్సిటీ అభివృద్ధికి తోడ్పడ్డాయి. అంతేకాదు, తమిళనాడు, కర్ణాటక తదితర ద్రావిడ రాష్ట్రాల నుంచి ప్రత్యేక నిధులు రాబట్టి, యూనివర్శిటీలోని ఆయా శాఖల అభివృద్ధికి వినియోగించారు.విశ్వవిద్యాలయ ఆవరణలోని అక్కమహాదేవి బాలికల వసతి గృహ నిర్మాణానికి గంగిశెట్టి హయాంలోనే కర్ణాటక ప్రభుత్వం రూ.50 లక్షల నిధులు ఇచ్చింది. ఇంకా కర్ణాటక ఇచ్చిన రూ.10 లక్షల నిధులతో తుళు అధ్యయన పీఠాన్ని ఏర్పాటు చేశారు. మూలికా వనం కూడా ఆయన ఆలోచన నుంచి ఉద్భవించిందే.కేవలం భాషా శాఖలే కాదు- బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ, కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్, మ్యాథ్స్ అండ్ స్టాటిస్టిక్స్, లాంగ్వేజ్ టీచింగ్ టెక్నాలజీ, ఎంబీయే, ఎంసీయే వంటి ఆధునిక ఉపాధి రంగానికి అవసరమైన కోర్సులన్నింటినీ ప్రవేశపెట్టిన ఘనత కూడా ఆయనకు దక్కుతుంది.ద్రావిడ విశ్వవిద్యాలయ తొట్టతొలి కాన్వకేషన్‌ను 2007లో లక్ష్మీనారాయణే ప్రారంభించారు. పదవీ విరమణ చేసే ముందు 2008వ సంవత్సరంలో సైతం తమిళనాడు ప్రభుత్వంనుంచి టీచింగ్ పోస్టులు సాధించగలగడం ద్రావిడ విశ్వవిద్యాలయం పట్ల గంగిశెట్టి చిత్తశుద్ధికి నిదర్శనం. కాగా ద్రావిడ విశ్వవిద్యాలయానికి ఒక గుర్తింపును తెచ్చిన సాహిత్య వేత్త మరణం ద్రావిడ భాషామ తల్లికి తీరని లోటని ఆంగ్లశాఖ ఆచార్యుడు తిరుపతిరావు వ్యాఖ్యానించారు.



సుధా రఘునాథన్ - గాయని ఉష

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో ప్రముఖ గాయని పద్మభూషణ్ సుధా రఘునాథన్, సినీ గాయని ఉష, ఢిల్లీ మంత్రి పర్వేష్ వర్మ ఉన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



చెంగాళమ్మకు పుష్పయాగం

శ్రావణ మాసం రెండో శుక్రవారం సందర్భంగా సూళ్లూరుపేటలోని చెంగాళమ్మకు పుష్పయాగం నిర్వహించారు. ఆస్థాన మండపంలో అమ్మవారి ఉత్సవమూర్తికి 20 రకాల పుష్పాలు, 6రకాల పత్రాలతో పుష్పార్చన చేశారు. చామంతి, సంపంగి, రోజా, తామర, కనకాంబరం, మల్లె, గన్నేరు, నూరు వరహాలు, గన్నేరు, మొగలిరేకులు,మానసంపంగి పుష్పాలు, తులసి, మరువం, దవణం, బిల్వం, పన్నీరు, కదరిపచ్చ పత్రాలను వినియోగించారు. చెన్నైకి చెందిన నంబూరు మోహన్‌రావు, సులోచనమ్మ, నంబూరు మనోజ్‌సాయి, లత దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మి, ట్రస్టుబోర్డు మాజీ సభ్యులు ఆకుతోట రమేష్, ముంగర అమరావతి, భక్తులు పాల్గొన్నారు. - సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి



అమ్మవారి పాదాల చెంత పూజలుచేసి పుష్పాలను తీసుకొస్తున్న ఉభయదాతలు

సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 2 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.4.66 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 66,149

తలనీలాలు సమర్పించినవారు: 24,429



కథనం, ఇంటర్వ్యూ : తిరుపతి, ఆంధ్రజ్యోతి

చిత్తూరు, తిరుపతి.. రెండు జిల్లాల్లో భాగంగా ఉన్న నియోజకవర్గం నగరి. తమిళనాడు సరిహద్దుల్లో ఉన్న ఈ నియోజకవర్గంలో రచ్చలూ రావిళ్లతోనూ రాజకీయాలు నడుస్తాయి. పార్టీ ఏదైనా ఇక్కడ గ్రూపులు సహజం. ఏకతాటిపై నడక అసాధ్యం. ఇటువంటి చోట టీడీపీ ఎమ్మెల్యేగా 2024లో తొలి విజయం అందుకున్నారు గాలి భాను ప్రకాష్. తండ్రి దివంగత గాలి ముద్దుకృష్ణమనాయుడు తరహాలోనే నిరంతరం జనంలో ఉంటారు. జనం చెప్పింది వింటారు. చేయగలిగిందే చెబుతారు. చెప్పింది వెంటనే చేస్తారు. నగరి నియోజకవర్గంలో అభివృద్ధి ముద్రతో మరింత ఎదగాలని ఆశపడుతున్న గాలి భానుప్రకాష్‌తో తొలి ఏడాది పాలనపై ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ...



నేడు

నగరి మండలం గుండ్రాజుకుప్పం పంచాయతీ మారుతీనగర్‌లో రూ.8.40 లక్షలతో కొత్తగా నిర్మించిన సిమెంటు రోడ్డు



నాడు

అదే చోట రోడ్డు వేయకముందు పరిస్థితి

నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

రూ.123 కోట్లతో అభివృద్ధి చేశా!



ఏడాదిలో ఏం చేశారు?

ప్రోగ్రెస్ రిపోర్ట్

వడమాలపేటలో ఫైవ్‌స్టార్ లగ్జరీ రిసార్టులు

నగరి నియోజకవర్గాన్ని పర్యాటక పరంగా అభివృద్ధి చేయడంపై ప్రత్యేక దృష్టి సారించా. ఆతిథ్య రంగంలోనూ పెట్టుబడులు రప్పించడానికి ప్రయత్నిస్తున్నా. దానివల్ల స్థానిక యువతకు ఉపాధి దొరుకుతుంది. వ్యక్తిగత చొరవతో ఫైవ్ స్టార్, సెవెన్ స్టార్ రిసార్టులు, హోటళ్ల ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నా. మొదటి ప్రయత్నంగా వడమాలపేట మండలం ఎస్వీపురం వద్ద పర్యాటక శాఖకు 12 ఎకరాల భూమిని ఇటీవలే ప్రభుత్వం కేటాయించేలా చూశా. ఆ భూమిని పర్యాటక శాఖ అట్మోస్ఫియర్ కోర్ అనే సంస్థకు ఫైవ్ స్టార్ లగ్జరీ రిసార్టుల కోసం కేటాయించనుంది.



తిరుమలకుప్పంలో నిర్మాణంలో ఉన్న 33/11 కేవీ విద్యుత్తు సబ్‌స్టేషన్

గాలి భానుప్రకాష్

పుట్టిన తేదీ: జూన్ 20,

తల్లిదండ్రులు : గాలి సరస్వతమ్మ, గాలి ముద్దుకృష్ణమనాయుడు

చదువు: అమెరికాలో మాస్టర్స్

కుటుంబం: భార్య గాలి శిరీష, కుమారులు గాలి కృష్ణ, గాలి రామ్‌నాయుడు

- నగరి మండలం గుండ్రాజుకుప్పం, పుత్తూరు మండలం తిరుమలకుప్పంలో విద్యుత్ సబ్‌స్టేషన్లు మంజూరు చేయించా. తిరుమలకుప్పంలో నిర్మాణం దాదాపు పూర్తి కావచ్చింది. గుండ్రాజుకుప్పంలో పనులు త్వరలో ప్రారంభమవుతాయి.

గ్రావెల్.. లా అండ్ ఆర్డర్.. అండర్ కంట్రోల్

గతంలో నగరి నియోజకవర్గం గ్రావెల్ అక్రమ రవాణాకు పేరుమోసింది. అలాగే శాంతి భద్రతలు కూడా సక్రమంగా వుండేవి కావు. ఈ రెండింటి పట్ల కఠిన వైఖరి తీసుకున్నాం. ఇపుడు నియోజకవర్గం మొత్తం మీద ఎక్కడా గ్రావెల్ అక్రమ రవాణా అన్న మాటే వినిపించడంలేదు.

పల్లెలకు బస్సులు

పుత్తూరు డిపో పరిధిలో ఈ ఏడాది కాలంలోనే ఎనిమిది కొత్త బస్సు సర్వీసులు ప్రారంభించాం. అగరంపేట నుంచి 9వ మైలు, కండ్రిగల మీదుగా నగరికి, వెంగళత్తూరు నుంచి నింద్ర మీదుగా పిచ్చాటూరుకు, పరమాల నుంచి కుప్పం బాదూరు, బట్టి కండ్రిగల మీదుగా పుత్తూరుకు, ఎగువ పుత్తూరు నుంచి పాలమంగళం, సుబ్బానాయుడు కండ్రిగల మీదుగా పుత్తూరుకు, ఎలకటూరు నుంచి కావనూరు, కీలంబాకం, ఆరూరు మీదుగా నగరికి, పుత్తూరు నుంచి నారాయణవనం, గోవిందప్ప నాయుడు కండ్రిగ మీదుగా కైలాసకోనకు... ఇలా ఆరు మార్గాల్లో ప్రారంభించాం.







నింద్ర మండలం కైపాకం పంచాయతీలో రూ.15 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

వచ్చే నెల నుంచీ మరమగ్గాలకు ఉచిత కరెంటు



నగరి, పుత్తూరు, నారాయణవనం మండలాల్లో 5500 మంది మరమగ్గాల కార్మికులున్నారు. మరమగ్గాలకు 500 యూనిట్ల వరకూ ఉచిత కరెంటు ఇవ్వాలని ఎన్నికలకు ముందే సీఎం చంద్రబాబును కోరా. ఆయన ఆమోదించారు. ఆగస్టు విద్యుత్ బిల్లు సెప్టెంబరులో వస్తుంది. ఆ బిల్లు నుంచీ ఉచిత విద్యుత్ అమల్లోకి రానుంది. నగరిలో 5500 మందికి లబ్ధి కలగనుంది.

ఇవి చేశాం

- రూ. 23.41 కోట్లతో 45 కిలోమీటర్ల సీసీ రోడ్ల నిర్మాణం మొదలు. 32 కిలోమీటర్లు పూర్తి.
- రూ. 13 కోట్లతో గోకులం షెడ్లు పూర్తి అయ్యాయి.
- తుడా నుంచి రూ. 34.18 కోట్లతో తారు రోడ్లు, సీసీ రోడ్లు, తాగునీటి పథకాలు మంజూరు చేయించాం. రూ. 32 కోట్లతో తాగునీటి పథకాల పనులన్నీ పూర్తయ్యాయి.
- నియోజకవర్గంలో జడ్పీ, ఆర్ అండ్ బీ శాఖల నుంచీ రూ. 12.56 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం, తారు రోడ్ల మరమ్మతులు, తాగునీటి పథకాల పనులు మంజూరయ్యాయి. రూ. 1.61 కోట్లతో తాగునీటి పనులు పూర్తయ్యాయి. మరో రూ. 4.80 కోట్లతో 90 కిలోమీటర్ల మేర సీసీ రోడ్ల నిర్మాణం జరిగింది. ఆర్ అండ్ బీ ద్వారా రూ. 6.15 కోట్లతో 190 కిలోమీటర్ల మేర రోడ్లకు ప్యాచ్ వర్కులు చేపట్టాం.



రూ.68 లక్షలతో బాగుపడిన విజయపురం మండలంలోని నెట్టేరి- కనకమ్మసత్రం రోడ్డు

చంద్రబాబును కోరుతున్నది ఇదే!

- పుత్తూరు ప్రభుత్వాసుపత్రిని వంద పడకలకు స్థాయికి పెంపు
- గాలేరు-నగరి సుజల స్రవంతిని పూర్తి చేయాలి.
- వడమాలపేటలో ఈఎంసీ-3 ఏర్పాటు.
- నగరిలో టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు. దానికోసం వీకేఆర్‌పురం వద్ద 150 ఎకరాలు గుర్తించాం.

ఇవి చేయాలి

- రూ. 1.20 కోట్లతో 2.45 కిలోమీటర్ల సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాల్సి వుంది. ఇంకో రూ. 8.67 కోట్లతో 12.16 కిలోమీటర్ల మేరకు పనులు ప్రతిపాదించడం జరిగింది. రూ. 40.54 కోట్లతో 37.76 కిలోమీటర్ల మేరకు తారు రోడ్ల నిర్మాణం చేపట్టాల్సి వుంది.
- రూ. 70 లక్షల తుడ నిధులతో 1.17 కిలోమీటర్ల తారు రోడ్డు చేపట్టాల్సి వుంది. అలాగే రూ. 1.48 కోట్లతో 2.44 కిలోమీటర్ల సీసీ రోడ్లు నిర్మించాల్సి వుంది.
- నియోజకవర్గంలో ఆరు విద్యుత్ సబ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలి. ● ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు చేయాలి. ఇందు కోసం విజయపురం మండలం కోసలనగరంలో 500 ఎకరాలు గుర్తించాం. ● నగరి వద్ద ఏకాంబరకుప్పం, అలాగే పుత్తూరులో ఆర్డీఎం గేటు, మరాఠీ గేటు తదితర మూడు రైల్వే లెవల్ క్రాసింగులున్న చోట్ల ఆర్వోబీల నిర్మాణం కోసం రైల్వే ఉన్నతాధికారులను కలసి ప్రతిపాదనలు అందజేశా. ● పుత్తూరు నుంచీ చెన్నై వరకూ ఇపుడున్న డబుల్ రోడ్డును సిక్స్ లేన్‌గా విస్తరించాలని ఢిల్లీలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలసి కోరాను.

మహిళా ఎమ్మెల్యేని కించపరిచిన వ్యక్తికి పరామర్శా?

● జగన్ తీరు మార్చుకోకపోతే సింగిల్ డిజిట్టేనన్న ఎమ్మెల్యే విజయశ్రీ

సూళ్లూరుపేట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఒక మహిళా ఎమ్మెల్యేపై అసభ్యకరంగా మాట్లాడి కించపరిచిన మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్ రెడ్డిని జగన్ పరామర్శించడం సిగ్గుచేటని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. మాజీ ఎమ్మెల్యేలు, వైసీపీ నాయకులు ఇతరులను హేళనగా మాట్లాడితే ఖండించాల్సిన అధినేతే, వారిని పరామర్శించి రెచ్చగొట్టేలా మాట్లాడటం మంచి పద్ధతి కాదన్నారు. జగన్ తీరు మార్చుకోకపోతే ఈసారి సింగిల్ డిజిట్‌కే పరిమితమవ్వడం ఖాయమని జోస్యం చెప్పారు. సూళ్లూరుపేటలో శుక్రవారం ఆమె మాట్లాడుతూ, నెల్లూరు పర్యటనలో అనుమతి లేకపోయిన రెచ్చగొట్టే మాటలు మాట్లాడి పోలీసులను తోసేసి తాము అధికారంలోకి వస్తే చంపుతాం.. నరుకుతాం.. అధికారులను జైలుకు పంపుతామని మాజీ సీఎం హోదాలో మాట్లాడటం రికాదన్నారు.

నాటు బాంబు పేలి ఉపాధి కూలీకి తీవ్రగాయాలు




గాయపడిన జమునమ్మ

నాగలాపురం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): నాటు బాంబు పేలి ఉపాధి కూలీకి తీవ్ర గాయాలయ్యాయి.ఈ సంఘటన శుక్రవారం నాగలాపురం మండలంలో చోటు చేసుకుంది. బాధితురాలి కథనం మేరకు... కస్తూరినాయుడు కండ్రిగ ఎస్టీ కాలనీ అటవీ ప్రాంతంలో శుక్రవారం ఉదయం ఉపాధి కూలీలు పనులు చేపట్టారు. ఆ సమయంలో సురుటుపల్లి పంచాయతీలోని లింగమనాయుడు కండ్రిగ గ్రామానికి చెందిన కూలీ జమునమ్మ(60) పనులు చేస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు వేట కోసం పెట్టిన నాటు బాంబు ఆమె చేతికి తగిలి పేలిపోయింది. ఎడమ చేతికి తీవ్ర గాయాలపాలైంది. వెంటనే అక్కడి ఫీల్డ్ అసిస్టెంట్, ఉపాధి కూలీలు ఆమెను సమీప తమిళనాడు ప్రాంతంలోని ఊత్తుకోట జీహెచ్‌కి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. మెరుగైన చికిత్స నిమిత్తం చెన్నై స్టాండ్లీ ఆస్పత్రికి తరలించారు. దీనిపై ఫీల్డ్ అసిస్టెంట్ మోహన, బాధితురాలు బంధువులు నాగలాపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సత్యవేడు పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. వివరాలు నమోదు చేసుకున్నారు.

ప్రసన్న మృతిపై దర్యాప్తు ముమ్మరం: సీఐ

ఏర్పేడు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలం మన్నసముద్రం గ్రామానికి చెందిన ప్రసన్న(30) 20రోజుల క్రితం దొంగతనానికి పాల్పడిందని పక్కింటి వారు వేధించి.. దాడి చేయడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకుంది. ఈ విషాదకర ఘటనపై 'ఆంధ్రజ్యోతి'లో శుక్రవారం వార్త ప్రచురితమైంది. దీనిపై ఏర్పేడు సీఐ శ్రీకాంత్ రెడ్డి కేసు దర్యాప్తును ముమ్మరం చేశారు. పోలీసు సిబ్బందిని మన్నసముద్రం పంపి విచారణ చేపట్టారు. పరారీలో ఉన్న నిందితుల కోసం ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు. త్వరలో వారిని పట్టుకుని చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు.

9వ బెటాలియన్ కమాండెంట్ బాధ్యతల స్వీకరణ



ఈఎస్ఎస్ ప్రసాద్

వెంకటగిరి టౌన్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): వల్లివేడు వద్ద ఉన్న 9వ బెటాలియన్ కమాండెంట్‌గా ఈఎస్ఎస్ ప్రసాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... అమరావతి డీజీపీ కార్యాలయంలో కమాండెంట్‌గా విధులు నిర్వహిస్తూ 9వ బెటాలియన్‌కు బదిలీపై వచ్చానన్నారు. బెటాలియన్ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. సిబ్బంది పనితీరుపై ప్రత్యేక దృష్టి పెట్టి, వారి సమస్యల పరిష్కరిస్తానన్నారు. అనంతరం సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ అరుణ్‌బోస్, సిబ్బంది పాల్గొన్నారు.

చెట్లను నరికి.. పంట కాలువ పూడ్చి



టోల్‌ప్లాజా సమీపంలో జాతీయ రహదారిపై నరికిన చెట్లు

● సూళ్లూరుపేటల లేఅవుట్ నిర్వాహకుల నిర్వాకం

సూళ్లూరుపేట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట టోల్‌ప్లాజా సమీపంలో జాతీయ రహదారి పక్కన ఓ లేఅవుట్ నిర్వాహకులు చెట్లను నరికేశారు. పట్ట పగలే చెట్లను నరికి కలపను సైతం ఇతర ప్రాంతాలకు గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్నారు. అనుమతుల్లేకుండా ఇలా చేయడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. టోల్‌ప్లాజా సిబ్బంది కూడా అధికారులకు సమాచారం ఇవ్వలేదు. ఇక, ఎన్‌వీకండ్రిగ వరకు వచ్చే నెర్రికాలువకు అనుసంధానమైన పంట కాలువను పూడ్చేసి చదును చేశారు. దాదాపు 7 గ్రామాలకు పైగా 5 వేల ఎకరాలకు పైగా ఈ కాలువ గుండా సాగునీరందుతోంది. ఈ ఎప్పుడు సాగునీరందించే పంట కాలువను పూడ్చేసి హైవే రోడ్డుకు సమాంతరంగా గ్రావెల్ రోడ్డుతో చదును చేసి లేఅవుట్‌లోకి దారులు ఏర్పాటు చేసుకుంటున్నారు. దీనిపై అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది.



పంట కాలువను పూడ్చేసి గ్రావెల్‌తో చదునుచేసి రోడ్డు వేసిన దృశ్యం

అక్రమాలకు బాస్.. జగన్

● మహిళలకు క్షమాపణలు చెప్పాలన్న టీడీపీ



తిరుపతి(జీవకోన), ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో రాష్ట్రంలో జరిగిన అన్ని అక్రమాలకు బాస్.. జగన్ అని తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్ అన్నారు. త్వరలోనే మరిన్ని అక్రమాలు బయటకు రానుండటంతో డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నాడని విమర్శించారు. తన అక్రమాలకు ఎపుడు అరెస్టు అవుతారో జగన్‌కే తెలియని పరిస్థితి ఏర్పడిందన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ, అధికారం కోల్పవడం.. లిక్కర్ కేసులో ఆ పార్టీ నేతలు జైళ్లకు వెళ్లడంతో జగన్ మెంటల్ కండిషన్ సరిగాలేక చంద్రబాబుపై విమర్శలు చేస్తున్నారన్నారు. సభ్య సమాజం తలదించుకునేలా మహిళలపై నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను సమర్థించిన జగన్.. మహిళా లోకానికి క్షమాపణ చెప్పాలని డిమాండు చేశారు. పెద్దిరెడ్డి ఎపుడో చంద్రబాబును కొట్టాడని, అందువల్లే మిథున్‌రెడ్డిపై కక్ష సాధిస్తున్నారని తప్పుడు ప్రచారాలు చేయడం జగన్ దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. శాంతి భద్రతలకు జగన్ విఘాతం కలిగిస్తున్నారని డిప్యూటీ మేయర్ ఆర్‌సీ మునికృష్ణ ఆరోపించారు. ఈ సమావేశంలో రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్‌వర్మ, నేతలు మన్నెం శ్రీనివాసులు, హేమంత్ యాదవ్, సుబ్బుయాదవ్, రామారావు పాల్గొన్నారు.

జగన్‌రెడ్డీ.. ఇదేమి తీరు!

● అన్ని ఆధారాలతోనే చెవిరెడ్డి అరెస్టు జరిగిందన్న తుడా చైర్మన్



తిరుపతి, ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): 'మహిళా ఎమ్మెల్యేని అసభ్యకరంగా మాట్లాడిన ప్రసన్నకుమార్ రెడ్డిని.. ఒక తల్లిని అనరాని మాటలన్న వల్లభనేని వంశీని జగన్మోహన్‌రెడ్డి పరామర్శించడం విడ్డూరంగా ఉంది. తన కారు కింద పడి మృతి చెందిన కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించలేని ఆయన.. అరెస్టయిన గంజాయి ముఠా నాయకులను, రౌడీషీటర్లు, స్త్రీలను అగౌరవంగా మాట్లాడుతున్న సంస్కారంలేని నాయకులను పరామర్శించడం ఏమిటి? జగన్ తీరు మార్చుకోకపోతే ప్రజలు ఓట్లు కాదు కదా.. రోడ్లమీదా తిరగనివ్వరు' అని తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం తిరుపతిలోని తన నివాసంలో అయన అయన మీడియాతో మాట్లాడారు. ఇప్పుడు రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు ప్రశాంతంగా జీవిస్తుంటే, తన ఉనికికోసం జగన్ పరామర్శల పేరుతో తిరుగుతూ అలజడి సృష్టించాలని ప్రయత్నిస్తున్నారన్నారు. లిక్కర్ స్కాంలో ప్రతినెలా రూ.500 కోట్లు దోచేశారన్నారు. ఈ స్కామ్‌లో చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని పక్కా ఆధారాలతోనే అరెస్ట్ చేశారన్నారు. ఆయన పీఏలు, గన్‌మ్యాన్‌లు ఎక్కడెక్కడ డబ్బులు తీసుకొచ్చారు? ఎక్కడ దాచిపెట్టారు? ఎవరికి ఇచ్చారు? వారి వాహనాలు ఎక్కడ తిరిగాయనే శాటిలైట్ ఆధారాలు సిట్ వద్ద ఉన్నాయన్నారు.

జగన్ రాష్ట్రాన్ని దోచేశాడు: కురుగొండ్ల



వల్లివేడులో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల తదితరులు

వెంకటగిరి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని దోచేశారని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆరోపించారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని వల్లివేడులో ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు పింఛను అందజేశారు. ఆయన మాట్లాడుతూ మద్యం కుంభకోణంలో జగన్ జైలుకెళ్లడం తథ్యమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే సంక్షేమం, అభివృద్ధిని రాష్ట్ర ప్రజలు చూస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ తనూజరెడ్డి, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీరాందాస్ గంగాధర్, ఏఎంసీ ఛైర్మన్ పునుగోటి విశ్వనాథ నాయుడు, టీడీపీ నేతలు పులికొల్లు రాజేశ్వరరావు, కేవీకే ప్రసాద్ నాయుడు, అవ్వారుసత్యనారాయణ, బీరం రాజేశ్వరరావు, పప్పు చంద్రమౌళిరెడ్డి, జీకేపల్లి బాబు నాయుడు, మంకు ఆనంద్, మల్లారం బాబు తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన మాటకు కట్టుబడే పింఛన్ల పెంపు

బాలాయపల్లి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి పింఛన్లు పెంపు చేసినట్లు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. శుక్రవారం మండలంలోని నిండలి గ్రామంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని నూతనంగా మంజూరైన ఫించన్లను పంపిణీ చేశారు. ముందుగా వేమాలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షులు రాయి మస్తాన్ నాయుడు, రాయి సత్యం నాయుడు, కూను శ్రీహరి, చిత్తూరు ఈశ్వరయ్య, వేళ్ల సురేంద్ర రెడ్డి, దాసరి కోటేశ్వరావు, సీపీ నాయుడు, మాధవ నాయుడు, చెంచుక్రిష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేరుస్తున్న ఘనత చంద్రబాబుదే



పింఛన్లను అందజేస్తున్న శీలం కిరణ్‌కుమార్

గూడూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్న ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శీలం కిరణ్‌కుమార్ అన్నారు. స్థానిక వరదానగర్, వాలాయనందపురం, రాణిపేట ప్రాంతాల్లో లబ్ధిదారులకు పింఛన్లను అందజేశారు. నిమ్మకాయల నరసింహులు, వీరబోయిన వెంకటేశ్వర్లు, మునీంద్రబాబు, తిరుపాల్, నరసయ్య పాల్గొన్నారు.

● చిల్లకూరు: మండలంలోని అన్ని పంచాయతీల్లోని లబ్ధిదారులకు శుక్రవారం ఆయా పంచాయతీల్లోని కూటమి నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందజేశారు. ఆయా గ్రామాలకు చెందిన కూటమి నాయకులు చిల్లకూరు పట్టాభిరామిరెడ్డి, చిరంజీవి, లీలావతి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, నదందకుమార్ యాదవ్, కుమార్ యాదవ్, కీరవాణి, సతీష్ యాదవ్, భాస్కర్‌రెడ్డి, శివకుమార్, త్రివిక్రమ్‌భూపతి, రామ్మూర్తి, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

● దక్కిలి: మండలంలో పింఛన్ల పంపిణీ 94 శాతం పూర్తి చేసినట్లు దక్కిలి పట్టణ టీడీపీ అధ్యక్షులు దక్కిలి చంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని అన్ని గ్రామాల్లో రెవెన్యూ, మండల పరిషత్ సిబ్బంది లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందించారు. కొత్తగా 121మందికి స్పౌజ్ పింఛన్లు మంజూరు కాగా, నూరుశాతం పంపిణీ చేశారు. పాత పింఛన్లు 6,221కి గాను 5,945 మంది లబ్ధిదారులకు అందించారు.

● కోట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పింఛన్‌దారులతో టీడీపీ మైనార్టీ జిల్లా అధ్యక్షుడు జలీల్ అహ్మద్ ఆధ్వర్యంలో పార్టీ నాయ



మాట్లాడుతున్న మైనార్టీసెల్ జిల్లా అధ్యక్షుడు జలీల్‌అహ్మద్

కులు ముఖాముఖి నిర్వహించారు. మండలంలోని 21 పంచాయతీలకు కొత్తగా 118 పింఛన్లు మంజూరు కాగా, కోట మేజర్ పంచాయతీకి 16 పింఛన్లు మంజూరయ్యాయి. ఈ పింఛన్లను టీడీపీ నాయకులు లబ్ధిదారులకు అందజేసి సీఎం చంద్రబాబును, ఎమ్మెల్యే సునీల్‌కుమార్‌లను ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు దార సురేష్, షంషుద్దీన్, సర్పంచు రమణమ్మ, టీడీపీ నాయకులు రాధాకృష్ణారెడ్డి, కోటేశ్వరరావు, శ్రీనివాసులు, బాలకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సొంత నిధులతో పింఛన్ల పంపిణీ



పింఛన్లు అందిస్తున్న ఓమనరావు, గురవయ్య

చిట్టమూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): నిరుపేద కుటుంబాలకు చెందిన వ్యాధిగ్రస్తులకు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ తన సొంత నిధులతో శుక్రవారం పింఛన్లు అందజేశారు. గత నెలలో చిట్టమూరు మండలంలో జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే సునీల్ కుమార్ పర్యటించిన సమయంలో మానసికంగా బాధపడుతున్న చిల్లమూరు గిరిజనకాలనీకి చెందిన కోట్లపాటి సుబ్బయ్యకు ప్రభుత్వం నుంచి పింఛన్ మంజూరయ్యే వరకు నెలకు రూ.4 వేలు అందిస్తామని హామి ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు చిట్టమూరు టీడీపీ నాయకులు ఓమనవావు, పంచాయతీ కార్యదర్శి గురవయ్యలు సుబ్బయ్య ఇంటికెళ్లి ఎమ్మెల్యే పంపిన నగదును శుక్రవారం అందజేశారు. అదేవిధంగా పెళ్ళకూరు పంచాయతీలో ఉన్న కొత్తచెరువు కట్టకు చెందిన బందిలి వెంకటయ్య, మంగమ్మ దంపతులు క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న విషయం ఎమ్మెల్యే దృష్టికి వచ్చింది. ప్రతి నెల ఒకటో తేదీన వారి మందుల ఖర్చుల కోసం ఎమ్మెల్యే పంపిన రూ.5 వేలను సచివాలయ సిబ్బంది బాధితులకు అందజేశారు. టీడీపీ మండల అధ్యక్షులు గణపర్తి కిషోర్ నాయుడు, నాయకులు, కార్యకర్తలు కృతజ్ఞతలు తెలియజేశారు.

పూసల అలంకారంలో కోటమ్మ



కోట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కోట గ్రామదేవత కోటమ్మ అమ్మవారిని శ్రావణమాసం రెండో శుక్రవారం పురస్కరించుకుని పండితులు పూసలతో అలంకరించారు. కోట, వాకాడు, చిట్టమూరు, ఓజిలి మండలాలకు చెందిన మహిళా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ పాలక మండలి ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

త్వరలో మున్సిపల్ సమావేశం

వెంకటగిరిటౌన్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు 10వ తేదీన వెంకటగిరి పోలేరమ్మ జాతర సందర్భంగా త్వరలోనే మున్సిపల్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని ఛైర్‌పర్సన్ నక్కా భానుప్రియ అన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ జూలై 31న జరగాల్సిన కౌన్సిల్ సమావేశం వాయిదా వేశామని చెప్పారు. త్వరలో నిర్వహించే సమావేశంలో జాతరలో ఎలాంటి ఏర్పాట్లు చేయాలి తదితర అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు.

ఉపాధి పనుల పరిశీలన

వాకాడు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాకాడు చెరువులో జరుగుతున్న ఉపాధిహామీ పనులను శుక్రవారం ఎంపీడీవో శ్రీనివాసులు పరిశీలించారు. ఉపాధి శ్రామికులు చేపడుతున్న పనులు, కూలీల మస్టర్లు పరిశీలించారు. ఈవోపీఆర్‌డీ ఉమామహేశ్వరరావు, ఏపీవో విజయమ్మ, ఎఫ్ఏ రమ్య తదితరులు పాల్గొన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

కుటుంబ కలహాలతో ఆత్మహత్య



ఆంజనేయప్రసాద్ మృతదేహం

కోట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కోట మండలంలోని జరుగుమల్లి సమీపంలోని చల్లకాలువ వద్ద ఉన్న పొలాల్లో శుక్రవారం ఆంజనేయప్రసాద్ (43) అనే వ్యక్తి చెట్టుకు ఉరివేసుకుని మృతిచెందాడు. స్థానికుల కథనం మేరకు... నెల్లూరుకు చెందిన ఆంజనేయప్రసాద్ కోట మండలం నెల్లూరుపల్లికి చెందిన ఓ అమ్మాయిని పదేళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. వీరి మధ్య తరుచూ వివాదాలు వస్తుండడంతో నాలుగు సంవత్సరాల నుంచి ఆంజనేయప్రసాద్ అప్పుడప్పుడు భార్య వద్దకు వచ్చి వెళుతుంటాడు. ఈక్రమంలో గురువారం అర్థ రాత్రి నెల్లూరుపల్లికి వచ్చి చల్లకాలువ వద్ద ఉన్న వేపచెట్టుకు ఉరివేసుకుని మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ పవన్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని, శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

స్వర్ణముఖినదిలో గల్లంతైన మృతదేహం లభ్యం



వెంకటేశ్వర్లు మృతదేహాన్ని వెలికితీస్తున్న ఫైర్ సిబ్బంది

నాయుడుపేట టౌన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మండలంలోని మర్లపల్లి స్వర్ణముఖినది సమీపంలో గల్లంతైన వెంకటేశ్వర్లు మృతదేహాన్ని ఫైర్ సిబ్బంది వెలికితీశారు. గురువారం చేపలవేటకు వెళ్లిన వెంకటేశ్వర్లు నదిలో గల్లంతైన విషయం విధితమే. శుక్రవారం గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు, ఫైర్ సిబ్బంది వెంకటేశ్వర్లు మృతదేహాన్ని అయ్యప్పరెడ్డి పాళెం సమీపంలోని స్వర్ణముఖినదిలో వెలికితీశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సర్వర్ బిజీ... ఓపెన్ కాని పింఛన్ల యాప్

వెంకటగిరి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం మొత్తం 1వ తేదీనే పాత పింఛన్లతో పాటు కొత్త పింఛన్ల పంపిణీ కార్యక్రమం మొదలు కావడంతో సర్వర్ బిజీగా మారింది. దీంతో వెంకటగిరి పట్టణంలోని పలు వార్డుల్లో పింఛన్ల కోసం వచ్చిన వృద్ధులు పడిగాపులు కాయాల్సి వచ్చింది. 11వ వార్డులో వేకువ జామునుంచే పింఛన్ల పంపిణీ మొదలు పెట్టినప్పటికీ తరుచూ యాప్ ఓపెన్ కాకుండా మొరాయించడంతో వృద్ధులు ఇబ్బంది పడ్డారు. ఈ పరిస్థితి పలు వార్డుల్లో తలెత్తినట్లు బాధితులు తెలిపారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



సీఎం సహాయనిధి చెక్కులు తీసుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే విజయశ్రీ, నెలవల సుబ్రహ్మణ్యం, టీడీపీ నాయకులు

సూళ్లూరుపేట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యంతో కలిసి ఎమ్మెల్యే విజయశ్రీ సీఎం సహాయ నిధి చెక్కులను చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో మొత్తం 17 మందికి రూ.15.13 లక్షలు మంజూరయ్యాయని చెప్పారు. ఆ చెక్కులను లబ్ధిదారులకు అందజేసి సీఎం చంద్రబాబుకు అందరూ రుణపడి ఉండాలన్నారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్‌రెడ్డి, టీడీపీ నాయకులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, మాధవనాయుడు, కొక్కు శంకరయ్య, పాకం వెంకటసుబ్బయ్య, చిట్టేటి పెరుమాల్, అలవల శ్రీనివాసులు, తిరుపాల్, గొంజి మునస్వామి, పరసా రాజా, చెంచుకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ

సూళ్లూరుపేట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలోని మన్నారుపోలూరు, నూకలపాలెంలో శుక్రవారం ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ చేతుల మీదుగా లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఆమె మాట్లాడుతూ 1వ తేదీన ప్రతి ఇంటికి వచ్చి పింఛన్లు అందజేసే విధంగా సీఎం చంద్రబాబు ప్రత్యేక చొరవ తీసుకున్నారన్నారు. నాయకులు దంతాల రవి, కొండలరావు, మునస్వామి, శ్రీధర్ పాల్గొన్నారు.

మోటారుబైక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

కోట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశవరం సమీపంలో శుక్రవారం మోటారుబైక్‌ను ఆర్టీసీబస్సు ఢీకొన్న సంఘటనలో సుభాష్‌చంద్రబోస్ అనే వ్యక్తి గాయపడ్డాడు. మండలంలోని లక్ష్మక్కకండ్రిగ గ్రామానికి చెందిన సుభాష్‌చంద్రబోస్ మోటారుబైక్‌లో గూడూరుకు వెళుతున్నాడు. వాకాడు డిపోకు చెందిన చిట్టమూరు-మల్లాం ఎక్స్‌ప్రెస్ సర్వీసు మోటారుబైక్‌ను ఢీకొనడంతో దానిపై వెళుతున్న సుభాష్‌చంద్రబోస్ తీవ్రంగా గాయపడ్డాడు. ఆయనను కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం గూడూరు ఆసుపత్రికి తరలించగా, ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

ఇన్‌చార్జి ఎంఈవో బాధ్యతల స్వీకరణ

తడ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): తడ మండల ఎంఈవో-1గా కేజే వేములు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సత్యవేడు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న వేములును తడ ఇన్‌చార్జిఎంఈవో-1గా నియమిస్తూ ఉన్నతాధికారుల ఆదేశాలు జారీచేశారు. ఎంపీడీవో శేఖర్‌నాయక్ నెల రోజుల శిక్షణ కోసం బాపట్లకు వెళ్లడంతో ఆయన స్థానంలో ఈవోపీఆర్‌డీ విజయకుమార్‌ను ఇన్‌చార్జి ఎంపీడీవోగా నియమిస్తూ ఆదేశాలు జారీచేశారు. రెండు నెలలుగా ఈవోపీఆర్డీ విజయకుమార్ అనారోగ్య కారణాలతో దీర్ఘకాలిక సెలవులో ఉన్నారు. ఆయన ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరిస్తారో లేదో తెలియాల్సి ఉంది.

నేత్రదానం

సూళ్లూరుపేట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో ఆచార్య భరద్వాజ సంస్థ నిర్వహిస్తున్న నేత్రదాన కార్యక్రమం 474కి చేరింది. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని నూకలపాలెంకు చెందిన నందిపాటి నాగమ్మ (55) మరణానంతరం కుటుంబ సభ్యుల అంగీకారంతో ఆమె నేత్రాలను చెన్నై శంకర నేత్రాలయకు దానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆచార్య భరద్వాజ సేవా సంస్థ నిర్వాహకులు ఎంఎం చంద్రబాబు, ఆలపాటి అశోక్ కుమార్, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

శాకాంబరి అలంకారంలో పోలేరమ్మ



నాయుడుపేట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గడియారం సెంటర్ వద్ద ఉన్న గ్రామ దేవత పోలేరమ్మ ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా అమ్మవారిని వివిధ కూరగాయలతో అలంకరించారు. అనంతరం శాకాంబరి అలంకరణలో భక్తులకు పోలేరమ్మ దర్శనమిచ్చారు. భక్తులు అంబళ్లుపోసి మొక్కులు తీర్చుకున్నారు.



శిథిలావస్థకు చేరిన జడ్పీ పాఠశాల పాత భవనం, పెచ్చులూడిపోయి ఇనుప కమ్మీలు బయటికి వచ్చిన పిల్లర్లు, శిథిల భవనంలోనే చదువుతున్న విద్యార్థులు

శిథిలావస్థలో జడ్పీ ఉన్నత పాఠశాల పాత భవనం

● ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు

గూడూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నూరు జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల పాత భవనం శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. గతంలో ఈ భవనంలోని తరగతి గదుల్లో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు పాఠాలు బోధించేవారు. గత 12 సంవత్సరాలకు పైగా ఈ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో ఇదే ప్రాంగణంలో నూతన గదులు నిర్మించి, తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ పాఠశాలలో 150 మందికి పైగా విద్యార్థులు చదువులు కొనసాగిస్తున్నారు. పాత భవనాల్లో పిల్లర్లు, శ్లాబులు పెచ్చులూడి ప్రమాదకరంగా మారాయి. సెలవు దినాల్లో పాఠశాల క్రీడా మైదానంలో విద్యార్థులు, స్థానికులు పలు క్రీడలు ఆడుతుంటారు. వారు మధ్యాహ్న సమయంలో శిథిల భవనంలోనే భోజనాలు చేస్తుంటారు. కొంతమంది విద్యార్థులు వరండాలో చదువులు కొనసాగిస్తుంటారు. అయితే పెచ్చులూడి శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా మారిన ఈ భవనాలు ఎప్పుడు కూలుతాయోనని విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు, విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. ఇకనైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి ప్రమాదాలు జరగక ముందే ఈ శిథిల భవనాలను తొలగించి, ఆ స్థలాన్ని కూడా క్రీడామైదానంలో విలీనం చేసి అభివృద్ధిపరచాలని గ్రామస్తులు కోరుతున్నారు.

15 లోపు ఇళ్ల స్థలాల కేటాయింపు

● కలెక్టర్ వెంకటేశ్వర్



ట్రాక్టర్‌లో ఎక్కి ఇరకందీవిలో పర్యటిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, పింఛన్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

తడ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఇరకందీవి ఎంతో వెనుకబడిన ప్రాంతమని ప్రభుత్వం గుర్తించిందని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. ఇరకందీవిలో గ్రామస్థులతో శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పూడికుప్పం గ్రామంలో 172 మందికి ఇళ్ల స్థలాలను ఈ నెల 15వ తేదీలోపు కేటాయిస్తున్నామని తెలిపారు. మిగిలిన వారికి రెండు నెలల్లో మరో చోట ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. వీరందరికీ ఇళ్లు నిర్మించి మౌలిక వసతులు కల్పిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే విజయశ్రీ మాట్లాడుతూ ఐదేళ్లుగా ఇరకంకుప్పం గ్రామస్థుల ఇళ్లపట్టాల సమస్య పెండింగ్‌లో ఉందని తెలిపారు. అప్పటి ప్రభుత్వం పట్టించుకోకపోగా ఇంటి స్థలాలు ఇవ్వొద్దంటూ వైసీపీకి చెందిన పూడి పంచాయతీ సర్పంచ్ కోర్టులో కేసులు వేయించారని అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ సమస్యలను పరిష్కరించడంతో ఇళ్లపట్టాల పంపిణీ సులభమైందన్నారు. నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మంచి చేస్తున్న ప్రభుత్వానికి అండగా ఉండాలని తెలిపారు. సమావేశంలో ఆర్డీవో జ్యోతిర్మయి, జడ్పీటీసీ ఇందుమతి, తహసీల్దారు శరత్‌బాబు, సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ, వివిధశాఖల అధికారులు, టీడీపీ నాయకులు ఆకుతోట రమేష్, సెల్వం, పళణి, శ్రీధర్, సుధాకర్, జయపాల్, రవి తదితరులు పాల్గొన్నారు. అనంతరం సామాజిక పింఛన్లను పంపిణీ చేశారు.

ఇరకందీవిలో కలెక్టర్ సుడిగాలి పర్యటన

మండల పరిధిలోని ఇరకందీవిలో కలెక్టర్ సుడిగాలి పర్యటన చేశారు. శుక్రవారం మధ్యాహ్నసమయంలో భీములవారిపాళెం పడవలరేవుకు వచ్చిన ఆయన పడవలో ఇరకంకుప్పం గ్రామానికి వచ్చారు. అక్కడ గ్రామస్థులు ఆయనను పూలతో స్వాగతం పలికారు. గ్రామస్థుల బాధలను, సమస్యలను విని పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాగా పర్యాటకరంగ అభివృద్ధికి ఇరకందీవి ఎంతో అనుకూలమైన ప్రాంతమని కలెక్టర్ తెలిపారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ కోనసీమ జిల్లాలను ఆదర్శంగా తీసుకొని ఇక్కడ కూడా పర్యాటక అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు.

చెన్నై-గూడూరు మార్గంలో
నేడు పలు రైళ్ల రద్దు

తడ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): చెన్నై-గూడూరు మార్గంలో శనివారం పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు సదరన్ రైల్వే చెన్నై డివిజన్ అధికారులు ప్రకటించారు. ఈ మార్గంలో గుమ్మిడిపూడి - కవర్‌పేట రైల్వే స్టేషన్ల మధ్య గత కొంత కాలంగా ఇంజనీరింగ్ పనులు జరుగుతున్న విషయం తెలిసిందే. దీంతో మధ్యాహ్నం 1.15 గంటల నుంచి సాయంత్రం 5.15 గంటల వరకు ఆ పనులు జరుగుతాయి. ఈ మేరకు శనివారం పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు చెన్నై డివిజన్ అధికారులు ప్రకటించారు. రద్దు అయిన రైళ్ల వివరాలు. ● చెన్నై మోర్‌మార్కెట్ కాంప్లెక్స్ నుంచి సూళ్లూరుపేటకు ఉదయం 10.15, మధ్యాహ్నం 12.10 గంటల ఈఎంయూ లోక్ రైళ్లు రద్దయ్యాయి. ● సూళ్లూరుపేట నుంచి చెన్నై మోర్‌మార్కెట్ కాంప్లెక్స్‌కు మధ్యాహ్నం 12.35, 1.15, 3.10 ● చెన్నై మోర్‌మార్కెట్ కాంప్లెక్స్ నుంచి గుమ్మిడిపూడికి ఉదయం 11.35, మధ్యాహ్నం 12.40, 1.40, 2.40, 3.05 గంటలకు ● గుమ్మిడిపూడి నుంచి చెన్నై మోర్ మార్కెట్ కాంప్లెక్స్‌కు మధ్యాహ్నం 1.00, 2.30, 3.15, 3.45, 4.30, 5.00 గంటలకు ఈఎంయూ లోక్ రైళ్లు రద్దయ్యాయి. ● చెంగల్‌పట్టు నుంచి గుమ్మిడిపూడికి ఉదయం 9.55 గంటలకు బయలుదేరివెళ్లే ఈఎంయూ లోక్ రైళ్లను మీజూరు వరకు నడపనున్నారు. ● గుమ్మిడిపూడి నుంచి తాంబరంకు మధ్యాహ్నం 3 గంటలకు బయలు దేరి వెళ్లే ఈఎంయూ లోక్ రైళ్లు, మీజూరు నుంచి బయలుదేరి వెళ్లనున్నాయి. ఈ క్రమంలో నేడు చెన్నై మోర్‌మార్కెట్ కాంప్లెక్స్-పొన్నేరి-చెన్నైమోర్ మార్కెట్ కాంప్లెక్స్‌ల మధ్య పలు ప్రత్యేక ఈఎంయూ లోకల్ రైళ్లను నడపనున్నారు. వాటివివరాలు ● చెన్నై మోర్‌మార్కెట్ కాంప్లెక్స్ నుంచి పొన్నేరికి ఉదయం 11.35, మధ్యాహ్నం 1.40, 3.05 గంటలకు ఈఎంయూ ప్రత్యేక రైళ్లు నడవనున్నాయి. ● చెన్నై బీచ్ నుంచి పొన్నేరికి మధ్యాహ్నం 12.40, 2.40, 3.45 గంటలకు ● గుమ్మిడిపూడి నుంచి మోర్‌మార్కెట్ కాంప్లెక్స్‌కు మధ్యాహ్నం 12.05 గంటలకు ● పొన్నేరి నుంచి చెన్నై మోర్‌మార్కెట్ కాంప్లెక్స్‌కు మధ్యాహ్నం 1.18, 2.48, 3.33, 4.03, 5.18 గంటలకు ఈఎంయూ ప్రత్యేక రైళ్లు నడవనున్నాయి. ● పొన్నేరి నుంచి చెన్నై బీచ్‌కు సాయంత్రం 4.47 గంటలకు ● సూళ్లూరుపేట నుంచి గుమ్మిడిపూడికి సాయంత్రం 4.30 గంటలకు ఈఎంయూ ప్రత్యేక రైలు నడవనుంది.

సీపీఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయండి



మీడియాతో మాట్లాడుతున్న మురళి, నాయకులు

సూళ్లూరుపేట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట వేదికగా ఈ నెల 3, 4 తేదీల్లో రెండ్రోజులపాటు జరిగే సీపీఐ రెండో జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పి.మురళి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ దేశంలో ప్రజల సమస్యలపై సీపీఐ నిరంతం పోరాటం చేసిందని చెప్పారు. ఈ నెల 3న స్థానిక సీపీఐ కార్యాలయం నుంచి కార్మికులతో పట్టణ వీధుల్లో ప్రదర్శనగా వెళ్లి ఆర్టీసీ బస్టాండు సెంటర్‌కు చేరుకుంటామన్నారు. అనంతరం అక్కడ జరిగే బహిరంగ సభకు సీపీఐ జాతీయ నాయకులు నారాయణ, రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, రాష్ట కార్యవర్గ సభ్యులు హరినాథరెడ్డి పలువురు జిల్లా నాయకులు విచ్చేసి ప్రసంగిస్తారని తెలిపారు. ప్రజలందరూ పాల్గొని మహా సభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు సుధాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, రాధాకృష్ణ, కత్తి రవి, గురవయ్య, శ్రీనివాసులు, చెంచమ్మ తదితరులు పాల్గొన్నారు.

జగన్ పర్యటన అంటే ప్రభుత్వానికి భయం: వైసీపీ

వెంకటగిరిటౌన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఏపీలో మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి పర్యటన అంటే కూటమి ప్రభుత్వానికి భయాందోళన పట్టుకుందని వైసీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఎన్‌జేఆర్ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ జగన్ పర్యటనలకు జనం రాకుండా ప్రభుత్వ కుయుక్తులు పన్నుతుందని ఆరోపించారు. వైసీపీ పట్టణ కన్వీనర్ పులి ప్రసాద్ రెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, కౌన్సిలర్లు కళ్యాణి, శంకరయ్య, బాలయ్య, వహిదా, నారాయణ, రాధ పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



గూడూరు అర్బన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): శ్రావణ శుక్రవారం సందర్భంగా స్థానిక నారాయణమ్మ, రాజరాజేశ్వరిదేవి, గంగమ్మ పరమేశ్వరిదేవి తదితర ఆలయాల్లో అమ్మవార్లకు విశేషపూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

చిట్టమూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): చిట్టమూరు మండల సమావేశం శనివారం ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ విజయలక్ష్మి అధ్యక్షతన చిట్టమూరు స్త్రీశక్తి భవనంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మనోహర్‌గౌడ్ తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు, తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు.

టెన్నిస్ పోటీల్లో లక్ష్మీసిరి ప్రతిభ



గూడూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): హైదరాబాదులో ఆల్‌ఇండియా టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమెన్స్ టెన్నిస్ పోటీల్లో గూడూరుకు చెందిన దండు లక్ష్మీసిరి ప్రతిభచాటి విజేతగా నిలిచింది. పట్టణంలోని సొసైటీకాలనీకి చెందిన లక్ష్మీసిరి హైదరాబాదులో నిర్వహించిన మహిళల సింగిల్స్ టెన్నిస్ పోటీల్లో విజేతగా నిలిచి ట్రోఫీని సాధించింది. దీంతో ఈమెకు శుక్రవారం పలువురు అభినందనలు తెలిపారు.

దూదేకుల ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు అభినందనీయం

గూడూరు అర్బన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): దూదేకుల ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమని దూదేకుల సంఘ నాయకులు అన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దూదేకుల సంక్షేమానికి ప్రత్యేక ఫైనాన్స్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయడంతో నిరుపేదలైన దూదేకులు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు వీలుంటుందన్నారు. దీంతో ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో చాన్‌బాషా, దిల్షాద్, ఇబ్రహీం, నజీర్, నలీం, సలీమా తదితరులు పాల్గొన్నారు.

వరిలో సమగ్ర సస్యరక్షణపై రైతులకు శిక్షణ

దొరవారిసత్రం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం తల్లంపాడులో రైతులకు వరిలో సమగ్ర సస్యరక్షణపై శుక్రవారం ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. తిరుపతి డీఆర్‌సీ నుంచి వచ్చిన వ్యవసాయాధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులు తెగుళ్ల నివారణకు రసాయనిక ఎరువులను ఆఖరి అస్త్రంగా మాత్రమే ఉపయోగించాలని కోరారు. మండల వ్యవసాయాధికారి జ్యోతిర్మయి మాట్లాడుతూ శనివారం అర్హత కలిగిన ప్రతి రైతు బ్యాంక్ ఖాతాలో పీఎంకిసాన్‌తో పాటు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న అన్నదాత సుఖీభవ పథకం నగదు రూ.7000 పడుతుందని తెలిపారు.

నేడు ఎమ్మెల్యేచే నూతన పింఛన్ల పంపిణీ

నాయుడుపేట టౌన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పార్కు సెంటర్‌వద్ద నూతనంగా మంజూరైన పింఛన్లను శనివారం సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ లబ్ధిదారులకు అందజేస్తారని ఎంపీడీవో సురేష్‌బాబు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో నూతనంగా మంజూరైన వితంతువు పింఛన్లను ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే అందజేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.